RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




03 డిసెంబర్ 2024 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:156

# కోకాకోలా ఫ్యాక్టరీని ప్రారంభించిన సీఎం రేవంత్



గజ్వేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం నాడు గజ్వేల్ లో పర్యటించారు. సిద్దిపేట జిల్లాలోని బండతిమ్మాపూర్లో హెచ్ఎస్ఎస్బీ కోకాకోలా ఫ్యాక్టరీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, కోకాకోలా ప్రతినిధులు పాల్గొన్నారు. ప్లాంట్ను ప్రారంభించిన అనంతరం అంతా కలియదిరిగారు. కూల్ డ్రింక్ తయారీ వివరాలను సంస్థ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు.గజ్వేల్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం. మాజీ ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ మొదటిసారి పర్యటించారు.

## డిసెంబర్ 4 న పెద్దపల్లి లో సి.ఎం. సభ 'యువ వికాసం' పై సి.ఎస్ సమీక్ష.

హైదరాబాద్, డిసెంబర్ 2 ::డిసెంబర్ 4 వ తేదీన పెద్ద పల్లిలో నిర్వహించే యువ వికాసం సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై దాదాపు 9000 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందచేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. పెద్ద పల్లిలో డిసెంబర్ 4వ తేదీన తలపెట్టిన ముఖ్యమంత్రి గారి సభా ఏర్పాట్లపై నేడు సంబంధిత అధికారులు, జిలా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాలలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువత కై ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఇటీవల గ్రూప్ ఎం తోపాటు ఎంపికైన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందచేస్తారని వివరించారు. ఈ సభలోనే స్కిల్ యూనివర్సిటీలో బాగస్వామ్యమయ్యే 7 ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలను సంతకం, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ప్రారంభోత్సవం, సి.ఎం కప్ ప్రారంభం లతో పాటు వందలాది కోట్ల రూపాయల విలువైన అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియచేసే దాదాపు పలు స్టాళ్లను ఈ సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సభకు హాజరయ్యే వారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బస్సుల్లో వచ్చే వారు మధ్యాహ్నం రెండున్నర వరకల్లా వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్



ముంబై డిసెంబర్ 2 మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరనేది తేలిపోయింది. దేవేంద్ర ఫడ్నవిస్ తదుపరి ముఖ్యమంత్రి అని బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి సుధీర్ ముంగటివార్ ప్రకటించారు. అయితే, ఇది తన అభిప్రాయంగా ఆయన చెప్పారు. బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని, బీజేపీ నుంచి ఎలాంటి ఆశ్చర్యకరమైన నిర్ణయం ఉండదని పరోక్షంగా ఫడ్నవీస్నే అధికారికంగా సీఎంగా ప్రకటిస్తారనే సంకేతాలిచ్చారు.ఫడ్నవిస్ను సీఎంగా నిర్ణయించే విషయంలో షిండేకు ఎలాంటి కోపం లేదని కూడా ముంగటివార్ చెప్పారు. "ఒక శాఖకు సంబంధించి సొంత డిమాండ్లు ఉంటే దాని అర్థం కోపంగా ఉన్నట్టు కాదు. షిండేకు తగిన గౌరవం ఉంటుంది. ఆయన కూడా ప్రభుత్వంలో పాలుపంచుకుంటారని అనుకుంటున్నాను" అని అన్నారు. డిసెంబర్ 5న ముంబైలో కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారం భారీ స్థాయిలో ఉంటుందని చెప్పారు.కాగా, మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ఫడ్నవీస్ పేరు ఖరారైందని, లెజిస్లేచర్ పార్టీ నేతను ఎన్నుకునేందుకు డిసెంబర్ 2 లేదా 3వ తేదీన సమావేశం ఉంటుందని మరో బీజేపీ నేత తెలిపారు. కొత్త ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో బీజేపీ నిర్ణయానికి తన మద్దతు ఉంటుందని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి షిండే సైతం ఇప్పటికే ప్రకటించారు.

## జీహెచ్ఎంసీ ప్రజావాణికి 132 ధరఖాస్తులు




**జీహెచ్ఎంసీ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, డిసెంబర్ 02: జీహెచ్ఎంసి వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హెడ్ ఆఫీస్, ఆరు జోన్లలో కలిపి మొత్తం 132 ఫిర్యాదులు అందాయి.

జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్లు పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది.

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 38 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఏ.సి రెవెన్యూ, ఏ.సి అడ్మిన్ లకు నాలుగు చొప్పున, సి.ఇ మెయింటెనెన్స్, వెటర్నరి, ఎల్.ఏ.ఓ 3 చొప్పున, శానిటేషన్, హెల్త్, యు.బి.డి సి.ఇ ప్రాజెక్ట్ ఒకటి చెప్పున విన్నపాలు అందాయి.

జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 65, ఎల్బీనగర్ జోన్ లో 10, సికింద్రాబాద్ జోన్ లో 8, శేరిలింగంపల్లి జోన్ లో 7, ఖైరతాబాద్, చార్మినార్ జోన్లలో రెండు చొప్పున ఫిర్యాదులు అందాయి.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, పంకజ, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి ప్రదీప్ కుమార్ ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గడిచిన పదేళ్లలో

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి






# లక్ష మందితో డిసెంబర్ 4న పెద్దపల్లిలో బహిరంగ సభ

- x రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- x ప్రైవేట్ రంగంలో వేలకోట్ల పెట్టుబడులు సాధిస్తూ యువత ఉపాధి కల్పించేలా కృషి
- x ముఖ్యమంత్రి సభా స్థలిని పరిశీలించి ఏర్పాట్లపై పత్రికా సమావేశం నిర్వహించిన మంత్రి ఉత్తమ్ కుమార్



ఈ నెల 4న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి సబ్ స్టేషన్ వద్ద లక్ష మందితో యువ శక్తి బహిరంగ సభ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందని, ఇందులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధి రంగంపల్లి సబ్ స్టేషన్ వద్ద ముఖ్యమంత్రి సభాస్థలి ప్రాంగణాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రోటోకాల్ ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తో కలిసి పరిశీలించి సభా స్థలం లో చేయాల్సిన ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2023 ఎన్నికలలో తెలంగాణ ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని, డిసెంబర్ 7న ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని, గత సంవత్సర కాలంలో తెలంగాణ రైతులు ఎస్సీలు ఎస్టీలు, అణగారిన వర్గాలు, మహిళల మేలు కొరకు ప్రభుత్వం పని చేసిందని అన్నారు. యువతకు ఉపాధి వేగవంతంగా కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం 10 నెలల కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు. డిసెంబర్ 4న పెద్దపల్లి వేదికగా యువశక్తి కార్యక్రమం పేరుతో బహిరంగ సభ నిర్వహించి గ్రూప్ 4 అభ్యర్థులు, ఇతర పరీక్షలలో ఎంపికై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని అన్నారు. ప్రభుత్వంలో పోలీసులు టీచర్లు ఇంజనీర్ గ్రూప్ 1, గ్రూప్ 4 వదలవు అన్ని విభాగాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తున్నామని, అదే కాకుండా ప్రైవేట్ సంస్థలో యువత ఉపాధి పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు స్కిల్ యూనివర్సిటీ, టాస్క్ సెంటర్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్టానికి వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, వీటి ద్వారా ఏర్పాటయ్యే ఐటి, ఫార్మా, మొదలగు రంగాలలో వచ్చే పరిశ్రమలో స్థానిక యువతకు ఉపాధి అందించేలా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా బస్సు ప్రయాణం చేస్తున్నారని, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిధి 10 లక్షలకు పెంపు, గృహజ్యోతి కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ వంటి పథకాలు అమలు చేశామని అన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 1.53 కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం మన రైతులు పండించారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో ప్రైవేట్ లో అధిక ధరకు సన్న రకాల అమ్ముడు పోతున్నాయని అన్నారు. 40 లక్షల మంది రైతులకు దాదాపు 35 నుంచి 40 వేల కోట్ల ఆదాయం రానుందని అన్నారు. రైతు రుణమాఫీ కింద 4 విడత లలో 24 లక్షల మంది రైతులకు 22 వేలకోట్ల రుణమాఫీ చేశామని అన్నారు. రైతు బీమా పథకం కొనసాగిస్తున్నామని, పంటల బీమా పథకాన్ని సైతం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నందున డిసెంబర్ 4న జరిగే సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ నిన్న ప్రభుత్వం 2740 కోట్లు విడుదల చేసి మరో మూడు లక్షల రైతులకు రుణమాఫీ పూర్తి చేసిందని అన్నారు.

గత ప్రభుత్వం గ్రూప్ 1 నిర్వహించ లేకపోయిందని, ప్రతిపక్షాలు అనేక ఆటంకాలు సృష్టించిన ప్పటికీ విజయవంతంగా పరీక్షలు నిర్వహించామని అన్నారు. డిసెంబర్ 4న జరిగే ముఖ్యమంత్రి సభకు పెద్ద ఎత్తున రైతులు, యువత మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని , స్థానిక ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్య నారాయణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పామెలా సత్పతి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ లు డి.వేణు, జే.అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ , రెవెన్యూ డివిజన్ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

03 డిసెంబర్ 2024 మంగళవారం

# దారితప్పిన సరోగసీ

సరోగసీ ఒక వ్యాపారంగా విస్తరిస్తోందన్నది బహిరంగ రహస్యమే. ఆధునిక జీవనశైలిలో అనేక మార్పులు రావడం, ఒత్తిళ్లు పెరగడంతో ఆ ప్రభావం యువతను అనేక విధాలుగా వేధిస్తోంది. సంపాదనలో భార్యాభర్తలు ఇద్దరూ నిమగ్నం కావడంతో అప్పుడే సంతానం అక్కరలేదని సరిపెట్టుకొంటున్నారు. కొన్నేళ్ల తరువాత సంతానం పొందాలనుకొనే ఆకాంక్ష కలిగినా సంతాన సాఫల్యం కలగని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దాంతో సంతాన రహితులైన స్వదేశీయులే కాదు విదేశాల్లో ఉన్న ప్రవాస భారతీయులు కూడా కొన్ని లక్షల రూపాయల పెట్టుబడితో ప్రత్యామ్నాయంగా అద్దె గర్భాలను కుదుర్చుకుని సంతానం పొందడానికి తాపత్రయపడడం పరిపాటి అయింది. అయితే ఇది ఫక్కా వాణిజ్యంగా రూపాంతరం చెందుతోంది. ఎన్ని నిబంధనలున్నా దీనిని నియంత్రించడం కష్టసాధ్యమవుతోంది. ఈ చాటుమాటు వ్యవహారాలు, విషాద సంఘటనలు దేశంలో అక్కడక్కడ జరుగుతున్నా అంతగా బయటపడడం లేదు. రెండు రోజుల క్రితం తెలంగాణలోని రాయదుర్గంలో సరోగసీ గర్భధారిణి నిర్బంధానికి గురై, లైంగిక వేధింపులు భరించలేక తొమ్మిదో అంతస్థు నుంచి దూకి బలవన్మరణానికి బలైపోవడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సరోగసీ తెలంగాణలో చాపకింద నీరులా సాగుతోందనడానికి ఈ విషాద సంఘటన సాక్షమవుతోంది. సరోగసీలో నిబంధనల ప్రకారం సమీప బంధువుల నుంచి మాత్రమే అద్దెగర్భం ప్రక్రియలో సంతానాన్ని పొందవలసి ఉంటుంది. కానీ నిబంధనలు ఏవీ పాటించకుండా నిరుపేద మహిళలకు కొంత నగదు ముట్టజెప్పి పిల్లలను ప్రసవింప చేసుకోగలుగుతున్నారు. కొన్ని సాఫల్య కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు ఈ అద్దెగర్భాల ప్రక్రియను భారీ వాణిజ్య రాకెట్‌గా సాగిస్తున్నాయి. సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకుంటే కొన్ని నిబంధనలు చట్టంలో రూపొందించారు. దంపతులకు పెళ్లయి ఐదేళ్లు నిండాలి. వీరికి గతంలో పిల్లలు కానీ, దత్తత తీసుకున్న సంతానం కానీ ఉండకూడదు. భర్తకు 26 55, భార్యకు 25 50 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. దంపతుల్లో ఒకరికి సంతాన వైఫల్యం సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువపత్రం అవసరం. జన్మించిన బిడ్డ సంరక్షణ హక్కులకు మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలి. గర్భాన్ని అద్దెకిచ్చే మహిళ వివాహితురాలై ఉండడమే కాదు, ఒక బిడ్డకు జన్మనిచ్చి ఉండాలి. ఒకసారి మాత్రమే అద్దెగర్భం పొందే అవకాశం ఉంటుంది. అదీ సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలి. ప్రసవానంతరం ఆ మహిళకు 16 నెలల బీమా సౌకర్యం కల్పించాలి. ఇన్ని నిబంధనలు ఉన్నా ఇవేవీ పట్టించుకోకుండా దళారీ వ్యవస్థ ద్వారా అద్దె గర్భాలను కుదుర్చుకుంటున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, విజయవాడ కేంద్రాలుగా సాగిన సరోగసీ వ్యవహారం రానురాను తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు కూడా ప్రాకింది. ఐదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో సరోగసీ దందా వెలుగు చూసింది. పేద గిరిజన మహిళలకు లక్షల రూపాయలు ఆశ చూపి వారిని పావులుగా వాడుకున్నారు. భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సరోగసీ కోసం సుమారు 100 మంది మహిళలను గుట్టుగా ఉంచగా, ఓ మహిళ బయటపడడంతో ఆ వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. చిన్న వయసులో వివాహాలు జరిగి పిల్లలు పుట్టిన యువతులను సరోగసీకి ఎంపిక చేసుకుంటున్నారు. వారికి తొలుత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత సరోగసీకి బలవంతంగా ఒప్పిస్తున్నారు. అయితే ఇది వికటించి కొందరు మహిళలు అనారోగ్యానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. బలవంతంగా వివాహితలను ఈ రొంపిలోకి లాగినట్టు కొన్ని కేసులు కూడా పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. థాయ్‌లాండ్, నేపాల్, మెక్సికో, కంబోడియాలతోపాటు భారత దేశం కూడా సరోగసీని నిషేధించిన తరువాత ఉక్రెయిన్, జార్జియా, లావోస్, మలేసియా, అర్జెంటీనా, కొలంబియా, నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి దేశాలకు సరోగసీ మార్కెట్ విస్తరించింది. భారత దేశంలో 2010లో సరోగసీ నియంత్రణ ముసాయిదా బిల్లు తయారైంది. 2019 లో సరోగసీ నిషేధ చట్టాన్ని లోక్‌సభ ఆమోదించింది. 2021లో సరోగసీ (నియంత్రణ) చట్టం ఆమోదం పొందింది. అంతవరకు భారతదేశం ప్రముఖ సరోగసీ గమ్యస్థానంగా ఉండేది. అనైతిక విధానాలు సాగేవి. అద్దె తల్లుల ఒప్పందాలు తక్కువ ఖర్చుతో సులువుగా జరిగేవి. విదేశాల్లో ఉండే సంతాన యోగం లేని వారు భారత దేశానికి వచ్చి అద్దె తల్లుల ద్వారా సంతానాన్ని సులువుగా పొందగలిగే వారు. 2009లో గుజరాత్‌లో 45 మంది సరోగసీ తల్లులను అధ్యయనం చేయగా, సంతానం పొందాలనుకున్న తల్లిదండ్రుల్లో 41% మంది విదేశాల నుంచి వచ్చారని తేలింది. అద్దె తల్లులు కావాలనుకునే మహిళలు తాము తీసుకునే రిస్కుకు తగినట్టు పారితోషికం చెల్లించాలన్న డిమాండ్ ఆయా కుటుంబాల నుంచి ఎక్కువగా తెరపైకి వచ్చింది. ఈ విషయంలో స్వదేశీయులు కన్నా విదేశాల నుంచి వచ్చిన తల్లిదండ్రులే ఎక్కువగా చెల్లిస్తున్నారు.ప్రస్తుతం భారత ప్రభుత్వం పరోపకార సరోగసీని మాత్రమే నిబంధనల ప్రకారం అనుమతిస్తుంది. ఇందులో వాణిజ్యపరంగా ఆర్థిక లావాదేవీలు వంటివి ఉండకూడదు. ఇది చట్టబద్ధంగా వివాహం చేసుకున్న సంతానం లేని దంపతులకు మాత్రమే పరిమితం చేయబడింది. కానీ ఇప్పుడు కేవలం ధనార్జనే ధ్యేయంగా అమాయకులైన యువతులను పావులుగా దళారులు వాడుకుంటున్నారు. అందుకనే ఈ సరోగసీ రాకెట్‌లో ఇరుక్కున్న మహిళలకు స్వేచ్ఛలేక, ఆరోగ్య భద్రత లేక వారి భవిష్యత్ విషాద గాథలుగా మిగిలిపోతున్నాయి.

# భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్

## -నేడు ఆయన జయంతి




డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి. అతడు 1950 నుండి 1962 వరకు రాష్ట్రపతి బాధ్యతలను నిర్వహించాడు. ప్రజలు ఇతనిని ప్రేమగా, గౌరవంగా 'బాబూ' అని పిలిచేవారు. అతడు భారతీయ రాజకీయ నాయకునిగా భారత జాతీయ కాంగ్రెస్ లో భారత స్వాంతంత్ర్యోద్యమ కాలంలో చేరాడు. అతడు బీహార్ లో ప్రముఖ నాయకునిగా ఎదిగాడు. మహాత్మాగాంధీ మద్దతుదారునిగా అతడు 1931 లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం, 1941లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు. 1946 ఎన్నికల తరువాత అతడు ఆహారం, వ్యవసాయం శాఖకు భారత ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించాడు. అతడు భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి. 1948 నుండి 1950 వరకు భారత రాజ్యాంగ ముసాయిదా తయారీ కోసం ఏర్పరచబడిన సంఘానికి అధ్యక్షత వహించాడు. 1950లో భారతదేశం గణతంత్ర రాజ్యంగా అవతరించిన తరువాత అతడు రాగ్యాంగ పరిషత్తు ద్వారా మొదటి రాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డాడు. 1951 సార్వత్రిక ఎన్నికల తరువాత అతడు మొదటి భారత పార్లమెంటు ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా రాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డాడు. ఒక రాష్ట్రపతిగా అతడు పక్షపాత ధోరణి లేకుండా, ఉన్నత పదవులలో ఉన్నవారు స్వతంత్రంగా వ్యవహరించేందుకుగాను కాంగ్రెస్ పార్టీ రాజకీయాల నుండి వైదొలగి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పాడు. ఈ పదవి అలంకారప్రాయ మైనదైనప్పటికీ అతడు భారతదేశంలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు గాను అప్పటి ప్రధానమంత్రి జవాహర్ లాల్ నెహ్రూ కు వివిధ సందర్భాలలో సలహాలనిచ్చేవాడు. 1957లో అతడు రెండవసారి రాష్ట్రపతిగా ఎన్నికై, రెండు సార్లు భారత రాష్ట్రపతి పదవినలంకరించిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచాడు.రాజేంద్ర ప్రసాద్ బీహార్ రాష్ట్రంలో శివాన్ జిల్లాలోని జెర్దాయ్ గ్రామంలో 1884లో డిసెంబరు 3 న జన్మించాడు. అతని తండ్రి మహదేవ్ సహాయ్ సంస్కృతం, పర్శియను భాషలలో పండితుడు. తల్లి కమలేశ్వరీ దేవి ఎప్పుడూ రామాయణం నుండి కథలు వివరించేది. ఐదవ ఏటనే పర్షియన్ భాష, హిందీ భాష , అంకగణితం ను నేర్చుకోవడానికి ఒక మౌల్వీ దగ్గరకు పంపించబడ్డాడు. తరువాత ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసాడు. 12 సంవత్సరాల వయసులోనే రాజ్‌వంశీ దేవిని వివాహం చేసుకున్నాడు. అటు తరువాత విద్యకై పాట్నాలో తన అన్న మహేంద్ర ప్రసాద్ వద్ద ఉంటూ ఆర్.కె.ఘోష్ పాఠశాలలో చదువుకున్నాడు. మరల ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో చేరి కలకత్తా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై నెలకు రూ.30 ఉపకారవేతనం పొందాడు.1902లో అతడు కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. మొదట్లో సైన్సు విద్యార్థి. 1904లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎఫ్.ఎ ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడే 1905లో మొదటి స్థానంలో గ్రాడ్యుయేషన్ చేసాడు. అతని అధ్యాపకులలో జగదీష్ చంద్రబోసు, ప్రఫుల్ల చంద్ర రాయ్ మొదలగువారు ఉన్నారు. అతడి మేధాశక్తికి ఒక ఎక్జామినర్ ప్రభావితుడై అతడి పరీక్షా జవాబు పత్రంపై "పరీక్షకుని కంటే పరీక్షితుడు గొప్పవాడు" అనే వ్యాఖ్య రాసాడు. అతడు ఉపాధ్యాయునిగా అనేక విద్యాసంస్థలలో పనిచేసాడు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ పూర్తి చేసిన తరువాత అతడు బీహార్ లోని ముజఫర్‌పూర్ లాంగట్ సింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా చేరాడు. తరువాత ఆ సంస్థకు ప్రధానాచార్యునిగా తన సేవలనందించాడు. తరువాత 1909లో కలకత్తాలోని రిప్పన్ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించడానికి గాను ఉద్యోగాన్ని వదిలి వెళ్ళాడు. అతడు ఆ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించే సమయంలో కలకత్తా సిటీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసాడు. 1915 లో "మాస్టర్ ఆఫ్ లా" పరీక్షలకు హాజరై ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకాన్ని పొందాడు. 1937లో అలహాబాదు విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందాడు. 1911 లో కాంగ్రేసులో చేరాడు. కానీ అతని కుటుంబ పరిస్థితి ఏమంత బాగాలేదు. కుటుంబం తన సహాయానికై ఎదురు చూస్తున్న తరుణంలో, స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేందుకు అన్నగారిని అనుమతి అడిగాడు.అతడు అందుకు ఒప్పుకోక పోవటం వలన 1916 లో, బీహార్, ఒడిషా రాష్ట్రాల హైకోర్టులలో చేరాడు. తరువాత 1917లో అతడు పాట్నా విశ్వవిద్యాలయంలోని సెనేట్, సిండికేట్ లో మొదటి సభ్యునిగా నియమించబడ్డాడు. బీహార్ లో సిల్క్-టౌన్ గా ప్రసిద్ధిగాంచిన భగల్‌పూర్ లో న్యాయవాద ప్రాక్టీసును చేపట్టాడు. ఏదైనా విచారణ జరుగుతున్నప్పుడు, తన వాదనకు వ్యతిరేకంగా ఎవరైనా ఉదాహరణలు చూపలేకపోయినప్పుడు, న్యాయమూర్తులు రాజేంద్ర ప్రసాదునే ఉదాహరణ ఇవ్వమని అడిగేవారు.న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన అనతికాలంలోనే స్వాతంత్ర్య పోరాటంవైపు ఆకర్షితుడయ్యాడు. రాజేంద్రప్రసాద్ 1906లో మొదటి సారి కలకత్తాలో నిర్వహించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల ద్వారా సంబంధాన్ని పెంచుకున్నాడు. ఆ సమయంలో అతడు కలకత్తాలో విధ్యాభ్యాసం చేస్తూ ఆ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకునిగా చేరాడు. 2011లో రెండవసారి వార్షిక సమావేశాలు జరుగుతున్న సమయంలో అతడు భారత జాతీయ కాంగ్రెస్ లో చేరాడు. 1916 లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో మహాత్మా గాంధీని కలిసాడు. చంపారన్ లో జరగనున్న నిజ నిర్ధారణ కమిటీలోనికి తనతో పాటు స్వచ్ఛంద కార్యకర్తగా రావాలని మహాత్మా గాంధీ అతనిని కోరాడు. మహాత్మా గాంధీ అంకితభావం, విశ్వాసం, ధైర్యాలను చూసి చలించిపోయాడు. 1918 లో 'సర్చ్ లైట్'అనే ఆంగ్ల పత్రికను, ఆ తర్వాత 'దేశ్' అనే హిందీ పత్రికను నడిపాడు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా నిర్వహించబడిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నాడు. అతడు తన లాభదాయకమైన న్యాయవాద వృత్తిని, అలాగే విశ్వవిద్యాలయంలోని అధ్యాపక వృత్తి విధులను తప్పుకున్నాడు. పాశ్చాత్య విద్యా సంస్థల స్థాపనకు గాంధీజీ బహిష్కరణకు పిలుపునిచ్చినందున ప్రసాద్ అతని కుమారుడు మృత్యుంజయ ప్రసాద్ ను పాఠశాలనుండి మానివేయించి, భారతీయ సాంప్రదాయ విధానాలలో విద్యాభ్యాసం అందిస్తున్న బీహార్ విద్యాపీఠ్ లో చేర్పించాడు. ఈ విద్యాపీఠాన్ని1921లో తన మిత్రబృందంతో కలిసి స్థాపించి భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా నడిపాడు. .1921లో మహాత్మా గాంధీతో ఒకమారు సమావేశం తరువాత, విశ్వవిద్యాలయంలో తన సెనేటర్ పదవికి రాజీనామా చేశాడు.రాజేంద్రప్రసాద్ 1934 అక్టోబరులో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. అలాగే 1939లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ రాజీనామా చేసిన తరువాత, 1947లో ఇంకోసారి, మొత్తం మూడుసార్లు ఆ పదవిని చేపట్టాడు. 1942 ఆగస్టు 8 న క్విట్ ఇండియా తీర్మానాన్ని కాంగ్రెస్ బొంబాయిలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా అనేక మంది స్వాతంత్ర్యోద్యమ కారులు అరెస్టు చేయబడ్డారు. అతనిని పాట్నాలోని సదాఖత్ ఆశ్రమం వద్ద అరెస్టు చేసి, బాంకిపూర్ కేంద్ర కారాగానికి తరలించారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష తర్వాత, 1945, జూన్ 15 న విడిచిపెట్టారు.1946 సెప్టెంబరు 2 న ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం జవాహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో 12 మంది మంత్రులను ఎంపిక చేసింది. అందులో రాజేంద్ర ప్రసాద్ ఆహారం, వ్యవసాయ శాఖకు మంత్రిగా పనిచేసాడు. తరూవత 1946 డిసెంబరు 11 న రాజ్యాంగ సభకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. తరువాత జె.పి.కృపాలానీ కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజీనామా చేసిన తరువాత 1947 నవంబరు 17 న కాంగ్రెస్ అధ్యక్షునిగా భాధ్యతలు స్వీకరించాడు.భారత స్వాతంత్ర్యం వచ్చిన రెండున్నర సంవత్సరాల తరువాత 1950 జనవరి 26 న స్వతంత్ర భారత రాజ్యాంగం ఆమోదించబడింది. రాజేంద్ర ప్రసాదును మొదటి రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. అనుకోకుండా భారత గణతంత్ర దినోత్సావానికి ఒక రోజు ముందు 1950 జనవరి 25 నాటి రాత్రి అతని సోదరి భగవతి దేవి ప్రసాద్ మరణించింది. అతడు దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేసాడు కానీ రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు పెరేడ్ గ్రౌండ్ లో పూర్తిచేసిన తరువాత మాత్రమే పూర్తిచేసాడు. భారతదేశానికి అధ్యక్షునిగా రాజ్యాంగం ప్రకారం భాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తిగా ఏ రాజకీయ పార్టీకి చెందకుండా స్వతంత్రుడిగా వ్యవహరించాడు. అతడు ప్రపంచవ్యాప్తంగా భారత అంబాసిడరుగా విదేశీ దేశాలతో దౌత్య సంబంధాలు పెంపొందించడం కోసం పర్యటనలు చేసాడు. అతడు రెండవసారి వరుసగా 1952, 1957 లలో తిరిగి ఎన్నుకోబడ్డాడు. ఈ విధంగా ఎంపిక కాబడ్డ మొదటి రాష్ట్రపతిగా చరిత్రలో స్థానం సంపాదించాడు. అతని రాష్ట్రపతి పదవీ కాలమ్లో మొదటి సారి రాష్ట్రపతి భవన్ సమీపంలో ఉన్న ముఘల్ గార్డెన్స్ ఒక నెల పాటు సందర్?

# గడిచిన పదేళ్లలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: గడిచిన పదేళ్లలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, గత వైఫల్యాలను సరిదిద్దుకుంటూ ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలో చేసిన పనులను గమనిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఆలోచనలతో ముందుకు వెళతామో అర్థమవుతుందని అన్నారు.

తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి చాటేలా 7, 8, 9 తేదీల్లో తెలంగాణ అవతరణ ఉత్సవాలు, మొదటి సంవత్సర విజయోత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. నెక్లెస్ రోడ్డులో ఆ మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించే తెలంగాణ కార్నివాల్‌లో అందరూ పాల్గొని ఆస్వాదించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్, హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ , రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు.రాష్ట్రంలో 16 నర్సింగ్ కాలేజీలు, 28 ప్రభుత్వ పారా మెడికల్ కాలేజీలను వేదిక నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో 32 ట్రాన్స్‌జెండర్ (మైత్రి ట్రాన్స్ క్లినిక్స్) క్లినిక్కులను ఈ వేదిక నుంచి ప్రారంభించారు.కొత్తగా నియమితులైన 422 సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, 24 మంది ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్‌కు నియామక పత్రాలు అందించారు. అంతకుముందు 200 పైచిలుకు అంబులెన్స్‌లకు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎంమాట్లాడుతూ... ఈ తెలంగాణ సమాజమే మా కుటుంబం అని భావించి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోపే 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు పూర్తి చేయడంపై విడమరిచి చెప్పారు.పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పొలిటికల్ రిహాబిలిటేషన్ సెంటర్‌గా మార్చదల్చుకోలేదు. అదొక ఉన్నతమైన సంస్థ. అందుకే పూర్తిగా ప్రక్షాళన చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఏడాదిలో పేదల వైద్యానికి రికార్డు స్థాయిలో 835 కోట్ల రూపాయలు అందించాం. గత ప్రభుత్వం 450 కోట్ల రూపాయలకు మించి ఖర్చు చేయలేదు.అధికారం చేపట్టిన ఏడాదిలోపే వైద్య ఆరోగ్య శాఖలో 14 వేలకు పైచిలుకు నియామకాలు పూర్తి చేయడమే కాకుండా ఆరోగ్య తెలంగాణగా మార్చడానికి సంబంధిత శాఖ మంత్రి గారు

# ప్రజా పాలన విజయోత్సవం: మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, 02 డిసెంబర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజా పాలన విజయోత్సవం" కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి.ఈ రోజు కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ గౌతమ్ పొట్రు,అర్బన్ లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమారి రాధిక గుప్తా తో మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ను ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించే కార్యక్రమలో పాల్గొన్నారు అలాగే, 2024 నుండి ప్రారంభమవుతున్న కొత్త పారామెడికల్ కోర్సులుడిప్లొమా ఇ ఇసిజి టెక్నాలజీ (డిఇసిజి), డిప్లొమా ఇ మెడికల్ స్టెరిలైజేషన్ మరియు ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ (డిఎంఎస్టి)ప్రారంభించబడ్డాయి.మల్కాజ్గిరిలోని మెడ్చల్ మల్కాజ్‌గిరి ప్రభుత్వ వైద్య కళాశాల/ఆసుపత్రి ప్రాంగణంలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్ ప్రారంభించబడింది. ఈ క్లినిక్ వారంలో రెండు రోజులు సేవలు అందించి, ట్రాన్స్‌జెండర్ సమాజానికి సమగ్ర ఆరోగ్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించనుంది.ఈ సందర్భంగా గౌతమ్ పొట్రు, ఐఏఎస్ మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం మరియు విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉంది. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల స్థాపన, కొత్త పారామెడికల్ కోర్సుల ప్రారంభం జిల్లా యువతకు అధిక శిక్షణను అందించడం మాత్రమే కాకుండా, సమాజానికి అధునాతన ఆరోగ్య సేవలను అందించడంలో సహాయపడుతుంది అని తెలిపారు.

కళాశాల విద్యార్థులను ఉద్దేశించి, ఆయన మాట్లాడుతూ, "ఈ అవకాశాలు మీ భవిష్యత్‌కు మేల్కొలుపు గానే కాకుండా, సమాజానికి సేవ చేయడానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దోహదం చేస్తాయి. ఈ అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకొని, మీ సేవలతో సమాజానికి మేలు చేయండి" అని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, కుత్బుల్లాపూర్ (ఈసిఐఎల్ ఎక్స్ రోడ్) ప్రాంగణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ అధికారులు పాల్గొన్నారు:డా. టి. రఘునాథ స్వామి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా శోభ రాణి , ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని మల్కాజ్గిరి డివిజన్ డా. వంశీ కృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాలశ్రీమతి కె.సంపూర్ణ , ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలశ్రీమతి డి. జయంతి, వైస్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగుల్లో దైవత్వాన్ని దర్శించలేమా !

ఒక వ్యక్తి దీర్ఘ-కాలం పాటు శారీరక, మానసిక, మేధో లేదా స్పర్శ బలహీనతలు కలిగి సమాజంలో తమ సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోవడంలో విఫలం కావడాన్ని "దివ్యాంగులు, అంగవైకల్యం కల వారు లేదా వికలాంగులు" వర్గంగా చూస్తారు. ప్రపంచవ్యాప్తంగా 16 శాతం జనాభా వికలాంగులుగా జీవితాలను భారంగా గడుపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం దివ్యాంగులు అభివృద్ధి చెందిన దేశాల్లోనే ఉన్నారని, వీరిలో 46 శాతం వయోవృద్ధులు ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రతి ఐదుగురితో ఒక్క మహిళ, ప్రతి 10 మందిలో ఒక పిల్లాడు అంగవైకల్య వలయంలో చిక్కుకుంటున్నారు. దివ్యాంగుల్లో సగం మందికి వైద్య సదుపాయాలు అందడం లేదని, 70 శాతం మందికి వీల్‌చైర్ అవసరం ఉందని, 90 శాతం మందికి వినికిడి పరికరాలు అందవలసి ఉందని తేలింది. పౌర సమాజంలో దివ్యాంగులు నిరాదరణ, వివక్ష, చిన్న చూపు, చీదరింపు, అగౌరవం లాంటివని ఎదుర్కొంటున్నారు. వీరికి అందవలసిన గుర్తింపు, గౌరవం, మానవ హక్కులు, ఉద్యోగ ఉపాధులు , నాయకత్వ అవకాశాలు అందడం లేదు. దివ్యాంగుల సమస్యలను అధ్యయనం చేసిన ఐరాస-డబ్ల్యూహెచ్‌ఓ ప్రతి ఏట 03 డిసెంబర్‌న ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం" జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. అంతర్జాత దినం – 2024 థీమ్‌గా "సమ్మిళిత సుస్థిర భవితకు దివ్యాంగులకు నాయకత్వ బాధ్యతలు అప్పగిద్దాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. సామాన్య జనానికి సమానంగా దివ్యాంగులకు వైద్య ఆరోగ్య సంరక్షణ చర్యలు వేగం పుంజుకోవాలని, ఈ దిశగా ఐరాస పలు సూచనలు, సలహా సహాయాలను అందించడానికి ముందుకు రావడం హర్షదాయకం. వికలాంగులను గౌరవించడం, విద్య అందించడం, సాధికారతను శక్తివంతం చేయడం, మానవ హక్కులను పరిరక్షించడం, దివ్యాంగ విజేతలను సన్మానించడం లాంటివి ఈ వేదికపై చర్చించడం కొనసాగుతున్నది. ప్రపంచ దివ్యాంగుల్లో 56 శాతం మహిళలు, 44 శాతం పురుషులు ఉన్నారు. దివ్యాంగుల్లో 69 శాతం వరకు గ్రామీణ జనాభా మాత్రమే ఉండడం గమనించారు. భారత్‌లో దాదాపు 8 శాతం జనాభా వికాంగులుగా నమోదు అయ్యారు. దివ్యాంగుల్లో 21 రకాల వైకల్యాలు కనిపిస్తాయి. వీటిలో ముఖ్యమైనవిగా దృష్టి దోషం (అంధత్వం, మంద దృష్టి), వినికిడి లోపం (చెవుడు, వినికిడి మందగించడం), మాట్లాడలేక పోవడం (మూగతనం, మాటల్లో స్పష్టత కొరవడడం), నడక లోపం(లిప్రసీ చికిత్స పొందిన వారు, సెరిబ్రల్ పాల్సీ, మరగుజ్జు లోపం, కండరాల లోపం, ఆసిడ్ దాడి బాధితులు), మానసిక వైకల్యం, బహు అంగవైకల్యం, రక్త రుగ్మతలు(హిమోఫిలియా, తలసేమియా, సికిల్ సెల్ రుగ్మత), నరాల బలహీనత (మల్టిపుల్ స్లిరోసిస్, పార్కిన్సన్ వ్యాధి), ఇతర వైకల్యాలు వస్తాయి. దివ్యాంగుల్లో 20 శాతం నడక లోపం, 18.9 శాతం వినికిడి లోపం, 18.8 శాతం దృష్టి దోషం, 5.6 శాతం మానసిక వైకల్యం కలిగిన వారు ఉన్నారు. వైకల్యాన్ని జయించి విజేతలుగా నిలిచిన భారతీయ ప్రముఖుల్లో శాస్త్రీయ నాట్యకారిణి సుధా చంద్రన్ (నడక లోపం), సంగీత దర్శకుడు రవీంద్ర జైన్ (దృష్టి దోషం), టీవీ నిర్వాహకులు రామకృష్ణన్ (నడక లోపం), బ్యాడ్మింటన్ ఆటగాడు గిరీష్ శర్మ (నడక లోపం), క్రికెటర్ ప్రీతి శ్రీనివాసన్ (నడక లోపం), డాక్టర్ సత్యేంద్ర జైన్ (నడక లోపం), టెన్నిస్ క్రీడాకారుడు ప్రభు (నడక లోపం), స్కైడైవర్ విశ్వనాథన్ (నడక లోపం) పర్వతారోహకురాలు అరుణ సిన్హా (నడక లోపం)లాంటి పెద్దలు ఉన్నారు. వికలాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయాలు, ఉత్తమ జీవనశైలి అందించడం, అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వడం, ఉచిత విద్య, సామాజిక భద్రత, డిజిటల్ వనరుల అందుబాటు, సమాచార కల్పన, ఉచిత వైద్యం, దివ్యాంగుల హక్కుల సంరక్షణ, ఉచిత న్యాయ సేవలు, ఉద్యోగాల్లో తగిన రిజర్వేషన్లు లాంటి చేయూతను ఇవ్వడం ప్రభుత్వ పౌర సమాజ సనీస బాధ్యత అని తెలుసు కోవాలి. దివ్యాంగుల్లో ఆనందాల వెలుగులు చూడాలి. వికలాంగుల సేవలు దేశాభివృద్ధికి తోడ్పడాలి. దివ్యాంగుల్లో దైవత్వాన్ని దర్శించాలి. మేం ఉన్నామనే భరోసాను ఇవ్వాలి. వికలాంగుల ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేయాలి. వారి వారి సామర్థ్యాలను బట్టి తగు అవకాశాలను కల్పించాలి. దివ్యాంగుల ముఖాలపై నవ్వుల పువ్వులు వికసించా విధం మానవ సమాజం స్పందించాలి.

## హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్

ధ్యాన్ చంద్ (1905, ఆగస్టు 29 – 1979, డిసెంబరు 3) సాటిలేని భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందిం చడంతో పాటు, ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. భారత దేశానికి హాకీలో స్వర్ణ యుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఖేల్ రత్న అవార్డు ఇస్తారని చాలా మందికి తెలుసు. ఈ ఖేల్ రత్న అవార్డు నిన్నటి దాకా రాజీవ్ ఖేల్ రత్నగా పిలవబడగా.. ధ్యాన్ చంద్ సేవలకు, దేశ భక్తికి గుర్తింపుగా దాని పేరు ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మార్చింది. హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే దేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపు కుంటు న్నారు. దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్ చంద్ గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవచ్చు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మించారు. మెరుపు వేగంతో గేల్స్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. మైదానంలో పాదరసంలా కదిలిపోతూ బంతిని పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడంలో ఆయనకు ఎవరూ సాటిరారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందించడంతో పాటు,ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 29 ఆగస్ట 1922న తన 17వ పుట్టినరోజున చంద్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సిపాయిగా చేరాడు. ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత పురుషుల హాకీ జట్టు మూడు సార్లు ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ పతకాలు సాధించింది. 1928 ఆమ్‌స్టర్‌డామ్,1932 లాస్ ఏంజిలెస్,1936 బెర్లిన్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు బంగారు పతకాలు అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కింది. చంద్రుడి వెలుతురు లోనూ ఆయన ప్రాక్టీస్ చేసేవారు. అందుకే ఆయన్ను ముద్దుగా చంద్‌గా పిలిచేవారు. 1936నాటి ఒలంపిక్స్ సందర్భంగా బెర్లిన్‌లో పెద్ద ఎత్తున ధ్యాన్ చంద్ పోస్టర్లు వెలిశాయి. ధ్యాన్ చంద్ ఆట చూసేందుకు స్టేడియంకు రావాలంటూ ఆయన ఫ్యాన్స్ ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ ఒలంపిక్స్ హాకీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జర్మనీతో తలపడింది. ఆ ఫైనల్ మ్యాచ్ లో భారత్ 16–1 తేడాతో జర్మనీని మట్టి కరిపించింది. భారత్ పక్షాన ధ్యాన్ చంద్ 15 గోల్స్ చేసి చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్‌లో ద్వితీయార్థంలో ధ్యాన్ చంద్..తన షూ, సాక్స్‌ను తీసేసి మ్యాచ్ ఆడారు. అయినా మూడు గోల్స్ సాధించి ఔరా అనిపించే ఆట ప్రదర్శించారు. ఆ సమయంలో స్టేడియంలో దాదాపుగా 25 వేల మంది ప్రేక్షకులతో పాటు గొప్ప నియంతగా పేరొందిన ఎడల్ఫ్ హిట్లర్ కూడా ఆ మ్యాచ్ ని తిలకించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ధ్యాన్ చంద్ వద్దకి వచ్చిన హిట్లర్ తన సహచరులతో "అతడి హాకీ స్టిక్ విరగ్గొట్టి చూడండి.. అందులో తప్పకుండా ఏదో అయస్కాంతం ఉండి ఉంటుంది లేకపోతే ఇలా ఎలా ఆడతాడు" అని హాకీ స్టిక్ విరగ కొట్టగా ఎలాంటి అయస్కాంతమూ దొరకలేదు. దాంతో కంగుతిన్న హిట్లర్ అదేరోజు రాత్రి ధ్యాన్ చంద్ ని తన వద్దకు పిలిపించుకొని హాకీ ఆట కాకుండా నువ్వు ఏమేమి చేస్తావని ధ్యాన్ చంద్ ని అడగగా "నేను ఆర్మీలో సుబేదార్ గా పని చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. హిట్లర్ "ధ్యాన్ చంద్, నీ దేశము నీకేమిచ్చింది..? ఈరోజుకు నువ్వు కేవలం సుబేదార్ వి. జర్మనీ హాకీ జట్టు తరపున ఆడితే తక్షణమే నిన్ను ఎయిర్ ఫీల్డ్ మార్షల్ గా నియమిస్తానని చెప్తూతుండగా...తమరు ఎన్ని పదవులు ఇచ్చినా, ఎంత డబ్బు ఇచ్చిన నేను నా దేశానికి మాత్రమే ఆడుతాను. పరాయి దేశాలకోసం ఆడను.." అని తెగేసి చెప్పగానే హిట్లర్ నిర్ఘాంతపోయి తలదించు కున్నట్లు చెపుతారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడ వలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు. ఓ మ్యాచ్ సందర్భంగా ధ్యాన్ చంద్ ప్రత్యర్థులపై ఒక్క గోల్ కూడా చేయలేక పోయారు. గోల్ పోస్ట్ విషయంలో రిఫరీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరిశీలనలో గోల్ పోస్ట్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు రుజువు అయింది. 1926 నుండి ఆయన 185 మ్యాచ్ ల్లో 570 గోల్స్ చేసి 1949 వరకు అంతర్జా తీయంగా ఆడారు. 2002లో ఢిల్లీలోని నేషనల్ స్టేడియంకు ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంగా నామకరణం చేశారు. అలాగే అలిఘడ్ ముస్లిం యూనివర్సిటీలోని ఓ హాస్టల్‌కు ఆయన పేరు పెట్టారు. లండన్‌లోని ఇండి యన్ జింకానా క్లబ్‌కు ధ్యాన్ చంద్ పేరు పెట్టారు. ధ్యాన్ చంద్ పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేసి భారత ప్రభుత్వం గౌరవించింది. ఇప్పటి వరకు ఆ గౌరవాన్ని పొందిన ఏకైక భారత హాకీ క్రీడాకారుడు ఆయనే. 34 సంవత్సరాల సేవ తర్వాత, ఆయన 29 ఆగస్టు 1956న భారత సైన్యం నుండి లెఫ్టినెంట్ (యాక్టింగ్ కెప్టెన్ ) గా పదవీ విరమణ చేశారు . భారత ప్రభుత్వం అదే సంవత్సరం ధ్యాన్ చంద్ కు భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది.

## చరిత్ర పొరల్లో దాగిన త్యాగధనుడు

భారత స్వాతంత్ర్య పోరాటం ఒకనాటిది, ఒక ఏటిది, ఒక దశాబ్దపుది, శతాబ్దపుది కాదు. అంతకన్నా ఎక్కువ సమయం కొనసాగిన నేపథ్యం ఉంది. అనేక సాయుధ పోరాటాలు, అహింసా యుత పద్ధతిలో జరిగిన ఉద్య మాలు భారత స్వాతంత్ర్యో ద్యమంలో భాగాలు. స్వాతంత్ర్య సమర యోధులు ఉద్యమాలు అనగానే 1857 విప్లవం మరిచిపోని మంగల్ పాండే, తాత్యా తోపే, బ్రిటిష్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడిన నిర్భయమైన రాణి లక్ష్మీబాయి, కిట్టూరుకు చెందిన రాణి చెన్నమ్మ, రాణి గైడిన్లు, చంద్ర శేఖర్ ఆజాద్, రామ్ ప్రసాద్ బిస్మిల్, భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్‌గురు, గురు రామ్ సింగ్, పాల్ రామసామి, రాజేంద్ర ప్రసాద్, పండిట్ నెహ్రూ, సర్దార్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, వీర్ సావర్కర్ వంటి లెక్కలేనన్ని మంది నాయకులు, గొప్ప వ్యక్తిత్వా లన్నీ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గ దర్శకులు. అలా దేశమాత దాస్య విముక్తి గావించడం కోసం ఎందరో వీరాధివీరులు, మహ నీయులు తమ ప్రాణాలొడ్డి జీవితాలను అర్పించారు. అందులో చక్రవర్తులు, సాయుధ వీరులు, యువకులు... ఎందరో దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే త్యాగం చేశారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో రక్తం మరిగే అంశాలు, రోమాలు నిక్క పొడుచు కునే సంఘటనలు ఎన్నో ఉన్నాయి. స్వేచ్ఛా భారతా వని కోసం అశువులు బాసిన ఎంతో మంది త్యాగధనుల చరిత్ర ఇప్పటి తరాల యువతకు ఎంతో ఉద్వేగ భరితంగా, మరెంతో ఉద్విగ్నంగా పరిణ మిస్తుంటుంది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ పోరాట పటిమను, తెగువను, త్యాగాన్ని చూపించారు. ఎందరో తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. ఈ అసంఖ్యాక స్వాతంత్ర్యోద్యమాల కాలంలో ఎందరో అమరవీరులు ఉన్నారు. ఇందులో చరిత్ర చాలామందిని గ్రంథస్థం చేయలేక పోయింది. చేసినా కొందరిని చరిత్ర మరుగున పడేసింది. అలా చరిత్ర పొరల మాటున ఉన్న వారిలో యువ కిషోరం ఖుదీరాం ముఖ్యుడు. 18 ఏళ్ల నూనూగు మీసాల యువ ఖుదీరాం బోస్ దేశం గర్వించదగ్గ త్యాగాన్ని మరిచినా, యాదృచ్ఛి కంగా విస్మరించినా, దేశ స్వాతంత్ర్య చరిత్ర పరిపూర్ణం కానట్టే. ఖుదీరాం బోస్ భారతీయ స్వాతంత్ర్య సమర వీరులలో మొదటి తరానికి చెందిన అతిపిన్న వయస్కుడు. భారత దేశ వాసులను వేధించిన బ్రిటిష్ అధికారిపై బాంబు వేసిన మొదటి సాహస వీరుడు ఖుదీరాం. ఆ కారణంగా అతనిని ఉరితీసే నాటికి అతని వయసు కేవలం 18 సంవత్సరాల 7 నెలల 11 రోజులు మాత్రమే. ఖుదీరాం పశ్చిమ బెంగాల్, మిడ్నాపూర్ జిల్లా హబీబ్‌పూర్‌లో 1889 డిసెంబర్ 3న జన్మించాడు. చిన్ననాటి నుంచి స్వాతంత్ర్య కాంక్షతో రగిలి పోయేవాడు. మొదట్లో అఖ్రా అనే విప్లవ సంస్థలో చేరాడు. తన నాయకత్వ లక్ష ణాలు, సాహసో పేతమైన స్ఫూర్తితో ఆ సంస్థలో అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఆయన టీచర్ సత్యేంపూదనాథ్ బోస్, భగవద్గీతలను స్ఫూర్తిగా తీసుకు న్నాడు. 1905లో బెంగాల్ విభజన అతడిలో బ్రిటిష్ ప్రభుత్వంపై మరింత కసి రేపింది. 16 ఏళ్ల వయసులోనే ప్రభుత్వ కార్యాల యాలు, పోలీస్ స్టేషన్లను బాంబులతో పేల్చి వేశాడు. 1907 ఆగస్టు 26న ఒక కేసు విచారణ సందర్భంగా ఎంతోమంది యువకులు కోర్టు ముందర ఆసక్తిగా గుమికూడి ఉన్నారు. పరిస్థితి శాంతి యుతంగా ఉన్నప్పటికీ ఉన్నట్లుండి పోలీసులు లాఠీలను ప్రయోగించారు. ఈ వ్యవహారాన్ని అక్కడే ఉండి చూస్తున్న సుశీల్ కుమార్ సేన్ అనే 15 ఏళ్ళ యువకుడు భరించలేక ఆవేశంతో ఒక ఇంగ్లీష్ అధికారి ముక్కుమీద ఒక్కగుద్దు గుద్దాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లారు. ఈ కేసు విచారణ చేసిన జడ్జి కింగ్స్ ఫోర్డ్ అనే అధికారి చిన్నవాడన్న దయ లేకుండా సుశీల్ కుమార్ కు15 కొరడా దెబ్బలను శిక్ష విధించాడు. సాహస వంతుడైన ఆ యువకుడు ప్రతి కొరడా దెబ్బకు వందేమాతరం అని నినదించాడు. ఆ సంఘటన తరువాత స్వతంత్ర వీరులంతా కింగ్స్ ఫోర్డ్ కు గుణపాఠం చెప్పాలని నిర్ణయించు కున్నారు. మానవ రూపంలో ఉన్న మృగమైన ఫోర్డ్ లాంటి వారు ఉన్నంత వరకు దేశభక్త వీరులకు కష్టాలేనని భావించి అతనిని చంపడానికి నిశ్చయించు కున్నారు. 1908 ఏప్రిల్ మొదటి వారంలో జుగాంతర్ అనే విప్లవ సంస్థకి చెందిన విప్లవ వీరులు కొందరు కలకత్తాలో ఒక ఇంటిలో రహస్యంగా సమావేశమై కింగ్స్ ఫోర్డ్ ను అంతం చెయ్యడానికి ఒక ప్రణాళిక రూపొందించి, అమలు చేయ సంకల్పించారు. ఆ సమావేశంలో అరవింద ఘోష్ కూడా ఉన్నారు. ఖుదీరాం బోసునూ, ప్రఫుల్ల చాకి అనే మరో నవ యువకుడినీ ఈ పనికై నియమించారు. 1908 ఏప్రిల్ 30 రాత్రివేళ వీరిద్దరూ ముజఫర్ పూర్ లోని యురోపియన్ క్లబ్ కు ఒక బాంబు, రివాల్వర్ తీసుకొని వెళ్లారు. కింగ్స్ ఫోర్డ్ వాహనం క్లబ్ బయటకు రాగానే దానిపైకి బాంబును విసిరేసి ఇద్దరు పరిగెత్తి వెళ్లి పోయారు. అయితే ఖుదీరాం, ప్రఫుల్లచాకిలు గమనించని విషయం... ఆ వాహనంలో కింగ్స్ ఫోర్డ్ లేక పోవడం.. అతని భార్య, కుమార్తెలు మాత్రమే ఉండడం. వారు బలి కావడం. ఒక రైల్వే స్టేషన్‌లో టీ తాగుతుండగా ఖుదీరాం బోసును పోలీసులు పట్టుకో గలిగారు. ఖుదీరాంను నిర్బంధించి రెండు నెలల పాటు విచారణ చేశారు. ముజఫర్ పూర్ బాంబు కేసులో ఫోర్డ్ భార్య, కుమార్తెల మరణానికి కారకుడైన ఖుదీరాంకు మరణశిక్ష విధించారు. 1908 ఆగష్టు 11న ఈ శిక్ష అమలు పరచ బడింది. పెదవులపై చిరునవ్వు చెదరకుండా ఖుదీరాం మృత్యువును ఆహ్వానించాడు. దేశం కోసం బలిదానం చేశాడు. బోస్ పట్టుబడిన రైల్వే స్టేషన్‌కు ఖుదీరాం బోస్ పూసా అని ఈ మధ్యే పేరు పెట్టారు. మాతృ భూమికోసం త్యాగం చెయ్యటం అందరికీ దొరికే అదృష్టం కాదు... అది నాకు లభించింది. అందుకు నేనెంతో గర్వ పడుతు న్నాను. అయితే నేను అనుకున్నది సాధించలేదు. క్రూరుడైన కింగ్స్ ఫోర్డ్ ను శిక్షించలేక పోయాను. అదే నా బాధ... అంటూ 1908 ఆగష్టు 19 ఉదయం ఒక చేతిలో భగవ ద్గీత పట్టుకుని, ఉరికంబం దగ్గరికి వెళుతూ, ఉరితాడు బిగించమని, తలారి ఉరితాడు బిగిస్తుండగా 'వందేమాతరం' అని తుదిశ్వాస విడిచి అమరుడైన దేశ భక్తుడు ఖుదీరాం. 75ఏళ్ళ స్వతంత్ర భారతం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న వేళ...అలనాటి వీరుల, త్యాగధనుల జీవిత చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. త్యాగ మూర్తుల జీవిత కథలు, వారి జీవన పోరాటాలు, నేటి, రాబోయే తరాలకు జీవిత పాఠం నేర్ప గలగాలి. ఆ ప్రయత్నం ప్రతి దేశవాసీ చేయాలి. వారి త్యాగ పరంపరలను తర్వాతి తరానికి బోధిస్తేనే చైతన్యం కలిగి, వారిని నిరంతరం ఉత్తేజ పరచ దానికి గత చరిత్ర సాక్ష్యంగా నిలవాలి.

## వక్ఫ్ బోర్డు రద్దు

కర్నూలు, డిసెంబర్ 2, ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ బోర్డును రద్దు చేస్తూ జీవో విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు జీవో నెంబర్ 47ను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంది.రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 47ను ఉపసంహరించుకుంది. దీంతో రాష్ట్రంలోని వక్ఫ్ బోర్డు రద్దు కానుంది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు జీవో నెంబర్ 47ను ఉపసంహరిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన జీవోను రద్దు చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ జీవో నెంబర్ 75 విడుదల చేసినట్లు పేర్కొన్నారు.2023 అక్టోబర్ 21న అప్పటి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం నామినేట్ చేస్తూ జీవో నెంబర్ 47ని విడుదల చేసింది. ఎన్నికైన సభ్యులు ఎండీ. రుహుల్లా (ఎమ్మెల్సీ), హాఫీజ్ ఖాన్ (ఎమ్మెల్యే), షేక్ ఖాజా, నామినేటేడ్ సభ్యులు ఖాదీర్ బాషా, మీరా హుస్సేన్, షాఫీ అహ్మద్ ఖాద్రీ, షీరీన్ బేగం (ఐపీఎస్), బరకత్ అలీ, జే నజీర్ బాషా, పటన్ షాఫీ అహ్మద్, హాసీనా బేగంలతో వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేశారు.అయితే ఈ నియామకాల తీరుపై కొందరు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఎంపిక ప్రక్రియను నిలుపుదల చేస్తూ హైకోర్టు 2023 నవంబర్ 1న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వివిధ రకాల న్యాయపరమైన సమస్యల తలెత్తిన కారణంగా వక్ఫ్ బోర్డులో పరిపాలన శూన్యత ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం హైకోర్టు తీర్పును పరిశీలించి, గత ప్రభుత్వం జారీ చేసిన, వివాదాస్పదమైన 47 జీవోను రద్దు చేసింది. జీవో నెంబర్ 47ను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నూతనంగా జీవో నెంబర్ 75ను విడుదల చేసింది.వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, పరిరక్షణ, మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగానే ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంతోనే మైనారిటీ సంక్షేమం సాధ్యమని తెలిపారు.

## తుఫాను వస్తే ఉప్పాడ వాసుల హ్యాపీ

కాకినాడ, డిసెంబర్ 2, తుపాను వస్తే తీరప్రాంత ప్రజలు వణికిపోతుంటారు. ఈదురుగాలులు.. కెరటాల బీభత్సాలు.. మరోపక్క అధికారులు హెచ్చరికలతో తీరప్రాంతంలో ఉండే ప్రజలు అవసరమైతే తుపాను షెల్టర్లుకు వెళ్లాలని కూడా హెచ్చరికలు జారీ అవుతూ ఉంటాయి. అయితే ఇప్పుడు మీరు తెలసుకోబోయే సముద్ర తీరంలో మాత్రం సందడే సందడిగా మారుతుంది. పైగా ఈ తీరంలో గత కొన్నేళ్లుగా రాకాసి అలల తీవ్రతకు భారీగా తీరప్రాంతం కోతకు గురవుతుండగా ఇళ్లు, గుళ్లు, రోడ్లు అనే తేడాలేకుండా కోతకు గురయ్యి సముద్రగర్భంలో కలిసిపోయే పరిస్థితి కనిపిస్తోంది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండల పరిధిలోకి వచ్చే ఉప్పాడ సముద్ర తీరంలో తుపాన్లు వచ్చినప్పుడల్లా ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు చాలా మంది సముద్రతీరంలో వెతుకులాడుతూ కనిపిస్తుంటారు. ఇంతకీ సముద్రతీరంలో బంగారు రజను కొట్టుకు వస్తుందని వీరు నమ్ముతుండటంతో ఇక్కడ తీరప్రాంతంలో వచ్చిపోయే అలల మధ్య దువ్వెనలు, ఇసుక నుంచి కనిపించని బంగారు రజను వేరుచేసే వస్తువులతో తెగ అన్వేషిస్తుంటారు. ఇది అలా ఏళ్ల కాలంగా ఉప్పాడ తీరంలో కనిపిస్తూ వస్తోంది. ఎందకంటే ఇక్కడ బంగారం కోసం చేసిన అన్వేషణ చాలామందికి ప్రతిఫలాన్ని ఇచ్చిందని చెబుతున్నారు. కొందరికి ఎంతో కొంత బంగారం లభ్యమవ్వడం కనిపించిందట. లభించిన పుత్తడిని బంగారు అభరణాల దుకాణాల వద్దకు వెళ్లి అమ్మితే తగినంత డబ్బుకూడా వచ్చిందని చెబుతున్నారు. అంతెందుకు ఇప్పుడు వెతుకుతున్న మాలో చాలా మందికి చిన్నచిన్న బంగారు ముక్కలు లభ్యమయ్యాయని అక్కడున్నవారు చెప్పడం విశేషం.సముద్రంలో తుపాన్లు సంభవించినప్పుడు సముద్ర గర్భంలో ఉండే బంగారు గనులు అలల తాకిడికి రజనుగా మారి ఇలా సముద్రతీరానికి కొట్టుకొస్తుందని ఇక్కడి ప్రజల నమ్మకం. ముఖ్యంగా ఉప్పాడ సముద్రతీరంలో చాలావరకు మత్స్యకార కుటుంబాలు నివశిస్తుంటాయి.. ఈ బంగారం అన్వేషణ లోకూడా ఈ సామాజికవర్గ కుటుంబాలే ఎక్కువగా ఉండడం గమనార్హం. సముద్రంలో తుపాన్లు సంభవించినప్పడే బంగారు చిన్న చిన్న ముక్కలుగా ఇసుకతో కలిసిపోయిన బంగారు రజను దొరుకుతుందని, ఈ ప్రాంతానికి చెందిన చాలా మందికి దొరకడం వల్లనే పనులన్నీ మానుకుని బంగారం వేటలో నిమగ్నమవుతున్నామని స్థానికులు చెబుతున్నారు.తుపాన్లు సమయంలో సముద్రంలోకి దిగవద్దని, తీరంలో ఉండడం ప్రమాదకరమని పోలీసుల హెచ్చరిస్తున్నా గతంలో బంగారం లభ్యం కావడంతో చాలామంది అవేమీ పట్టకుండా ప్రమాదభరితంగా బంగారం అన్వేషణ కొనసాగిస్తున్నారు. తీరం వెంబడి పదుల సంఖ్యలో ముఖ్యంగా మహిళలు ఇసుకలో పెద్దపెద్ద కళ్లను చేసుకుని మరీ బంగారం కోసం అన్వేషిస్తున్నారు.సముద్రతీరంలో ఇంత కష్టపడి ఊరికినే వెతకం కదా.. బంగారం దొరుకుతుంది కాబట్టే ఇంతలా ప్రయాసపడి వెతుకుతున్నాం.

# పవన్ టార్గెట్ కాకినాడ...రీజనేంటీ



విజయవాడ, డిసెంబర్ 2, ప్రస్తుతం ఏపీలో కాకినాడ పోర్టు ఇష్యూ హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కాకినాడ పర్యటన తర్వాత.. పోర్టు వ్యవహారంపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాకినాడ పోర్టు నుంచి వేల కోట్ల రూపాయల దందా జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. పవన్ పోర్టుపై ఎందుకు ఫోకస్ పెట్టాలో మంత్రి నాదెండ్ల వివరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ పర్యటనతో స్మగ్లింగ్ గుట్టు బయటపడిందని.. ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. దేశ భద్రతకు ముప్పు కలిగేలా స్మగ్లింగ్ కొనసాగుతోందన్నారు. గత ఐదేళ్లుగా అక్రమంగా బియ్యం రవాణా చేశారన్న మనోహర్, కూటమి ప్రభుత్వం వచ్చాక అక్రమ నిల్వలపై దాడులు చేశామని వివరించారు. కాకినాడ పోర్టులోకి ఎవరూ రాకుండా కుట్ర చేశారని.. గత ఐదేళ్లలో అక్కడ ఏం జరిగిందో ఎవరికీ తెలియదని వ్యాఖ్యానించారు.'గత ప్రభుత్వం బియ్యం డోర్ డెలివరీ అంటూ.. కొత్త పథకం మొదలుపెట్టింది. బియ్యం అక్రమ రవాణాకు తెరలేపారు. కాకినాడ పోర్టునుంచి కోటి 30లక్షల మెట్రిక్ టన్నుల..బియ్యాన్ని అక్రమంగా ఎగుమతి చేశారు. ఈ బియ్యం విలువ రూ.45 వేల కోట్లు ఉంటుంది. మాజీ సీఎం జగన్‌కు తెలియకుండా ఇది జరగదు' అని నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.

1.ఎందుకు కాకినాడ పోర్ట్ పైన దృష్టి సారించాం అనేది అందరూ తెలుసుకోవాలి. గత 5 సంవత్సరాల్లో ఎవ్వరినీ పోర్టు లోపలికి అనుమతించలేదు. లోపల ఎటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి, ఎటువంటి బోట్లు వస్తున్నాయి, అధికారులు ఎవరున్నారు, ఏ విధమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి అని తెలుసుకోడానికి మీడియా వారిని కూడా అనుమతించలేదు.

2.ప్రభుత్వ ఆస్తి, మన రాష్ట్ర వనరుల్లో భాగం అయిన కాకినాడ పోర్టుకు ఎవరినీ రానీయకుండా గత ఐదేళ్లు పెద్ద కుట్ర చేశారు.

3.రాష్ట్రంలో బియ్యం సరఫరా చెయ్యడానికి 29,000 రేషన్ షాపులు ఉన్నాయి. కానీ.. వైసీపీ ప్రభుత్వం డోర్ డెలివరీ చేస్తామనే అబద్ధపు ప్రచారంతో రాష్ట్ర ఖజానాకు 1600 కోట్ల రూపాయల ఖర్చుతో 9260 వాన్లు కొని ఒక నెట్‌వర్క్ తయారు చేశారు.

4.రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 1వ తారీఖు నుండి 15వ తారీఖు వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు.. వినియోగదారులు ఎప్పుడు వచ్చినా సరుకు అందించే ఒక మంచి ప్రక్రియ ఉంది. దాన్ని పక్కదారి పట్టించి స్వలాభం కోసం ఈ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని బియ్యం సేకరించడం మొదలు పెట్టారు.

5.ప్రభుత్వానికి ప్రతి కిలోకి 43.40 రూపాయలు ఖర్చయ్యే ఈ బియ్యాన్ని వీళ్లు క్షేత్రస్థాయిలో 10 రూపాయలకే తీసుకున్నారు. చాలా చోట్ల సరైన సమయానికి రాలేదు కాబట్టి వ్యాను వెళ్ళిపోయిందని.. అందుకే సరుకు ఇవ్వము అని చెప్పేవారు.

6.మెడ మీద కత్తి పెట్టి ఎప్పుడైతే కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ నుండి లాగేసుకుని.. వీళ్లు అరబిందోకి అప్పజెప్పారో.. ఆరోజు నుండి లెక్కలు చూస్తే ప్రతీ ఒక్కరికీ ఆశ్చర్యం కలిగుతుంది.

7.ఒక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకుని చిత్తూరు, శ్రీకాకుళం నుంచి నేషనల్ హైవే మీద నేరుగా కాకినాడకు బియ్యం తరలించే పకడ్బందీ కుట్ర చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఏ పోర్టులో లేని విధంగా కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతి జరిగింది.

8.గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో.. గంగవరం పోర్టు నుండి - 2,20,289 మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు నుండి - 23,51,218 మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం పోర్టు నుండి - 38,02,000 మెట్రిక్ టన్నుల ఎగుమతి జరిగింది.

9.కాకినాడ లెక్కలు చెప్తే ఆశ్చర్యం వేస్తుంది. కాకినాడ పోర్టులో వీళ్లు దుర్మార్గంగా ఈ మూడు సంవత్సరాల నుండి ఎగుమతి చేసింది 1,31,18,346 మెట్రిక్ టన్నులు. ఒక్క కాకినాడలో జరిగిన దీని విలువ 48,537 కోట్ల రూపాయలు.

10.ప్రజలకు సంబంధించిన ఆస్తిని పూర్తి స్థాయిలో కుట్ర చేసి దోచుకు తింటుంటే.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాకినాడకు రావాల్సి వచ్చింది.

11.ఇదేమి ఒక వ్యక్తిపై కక్ష కట్టినట్టు కాదు. గత పాలనలో ముఖ్యమంత్రి జగన్‌కు తెలియకుండా జరగదు కదా ఈ దోపిడీ? అరబిందో రియాల్టీకి కాకినాడ సీపోర్ట్స్ ఎందుకు 41% వాటా ట్రాన్స్‌ఫర్ చేసింది? ఏ సందర్భంలో చేసింది? భారతదేశంలో కార్పొరేట్ చరిత్రలో ఏనాడు జరగని విధంగా కేవీ రావు, వారి కుటుంబాన్ని బెదిరించి ఏ విధంగా వీళ్లు 41 శాతం వాటా రాయించుకున్నారో కచ్చితంగా బయటకు రావాలి.

డాన్ ఎవరు...

కాకినాడ పోర్టును స్మగ్లింగ్ డెన్ గా గత వైసీపీ ప్రభుత్వం మార్చిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గత మూడేళ్లలో కోటి 60 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి చేశారన్నారు. కోవిడ్ సమయంలోనూ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు పంపిణీ చేయమని ఇచ్చిన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ అక్రమార్జనకు పాల్పడ్డారన్నారు. గత ఐదేళ్లలో కాకినాడ పోర్టును బియ్యం ఎగుమతులకు కేరాఫ్ అడ్రస్ గా మార్చేశారన్నారు. కాకినాడ పోర్టులో గత ప్రభుత్వ హయాంలో కేవలం ఇరవై మంది పోలీసులను మాత్రమే పెట్టారన్నారు. పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టు పర్యటనతో స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఎందుకు జీఎంఆర్ నుంచిఎస్ఈఆర్ ను లాగేసుకోవాల్సి వచ్చిందని నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. ఆ స్మగ్లింగ్ డెన్ కు బాస్ ఎవరని నాదెండ్ల నిలదీశారు. కాకినాడ పోర్టుపై తాము ఎందుకు దృష్టి పెట్టామోప్రజలకు తెలియాలని నాదెండ్ల అన్నారు. పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించెదవరో అందరికీ తెలియాలన్నారు. కాకినాడ పోర్టును అడ్డాగా చేసుకుని స్మగ్లింగ్ చేసే వారందరిపేర్లను బయటకు తీసుకువస్తామని నాదెండ్ల తెలిపారు.

# నిండు కుండలా మారిన జలాశయాలు

తిరుమల, డిసెంబర్ 2, తిరుమలలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఐదు ప్రధాన జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. తిరుమలలో పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి. వరదనీటి ప్రవాహంతో తిరుమలలోని మొత్తం ఐదు జలాశయాల్లోకి నీరు చేరుకుంటోంది. గోగర్భం డ్యామ్ పూర్తిగా నిండిపోవడంతో గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుత నీటి నిల్వలు తిరుమలకు 200 రోజుల తాగునీటి అవసరాలకు సరిపోతాయి.

ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి జలాశయాల నీటిమట్టం వివరాలు ఇలా ఉన్నాయి.పాపవినాశనం డ్యామ్ :- 694.25 మీ(ఈఖీఒ - 697.14 మీ)నిల్వ సామర్థ్యం - 5240 లక్షల గ్యాలన్లుప్రస్తుత నిల్వ - 4345 లక్షల గ్యాలన్లుగోగర్భం డ్యామ్ - 2894 అడుగులు(ఈఖీఒ :- 2894 అడుగులు)నిల్వ సామర్థ్యం :- 2833.00 లక్షల గ్యాలన్లుడనిఎబజూ;ప్రస్తుత నిల్వ :- 2833.00 లక్షల గ్యాలన్లుఆకాశగంగ డ్యామ్ :- 857.85 మీ(ఈఖీఒ :- 865.00 మీ)నిల్వ సామర్థ్యం :- 685.00 లక్షల గ్యాలన్లు ప్రస్తుత నిల్వ :- 306.50 లక్షల గ్యాలన్లు కుమారధార డ్యామ్ :- 891 మీ (ఈఖీఒ :- 898.24 మీ)నిల్వ సామర్థ్యం :- 4258.98 లక్షల గ్యాలన్లు ప్రస్తుత నిల్వ :- 2372.76 లక్షల గ్యాలన్లు పసుపుధార డ్యామ్ :- 896.40 మీ (ఈఖీఒ :- 898.24మీ) నిల్వ సామర్థ్యం :- 1287.51 లక్షల గ్యాలన్లు ప్రస్తుత నిల్వ :- 950.39 లక్షల గ్యాలన్లు తుపాను ప్రభావతో తిరుమలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఘాట్ రోడ్డులో చరియలు విరిగిపడ్డాయి. టీటీడీ సిబ్బంది కొండ చరియలు తొలగించారు. ఘాట్ రోడ్డులో భక్తులు జాగ్రత్తగా ప్రయాణం చేయాలని టీటీడీ సూచించింది. తిరుమలలో మంచు దృశ్యాలు ఎంతో సుందరంగా ఉన్నాయి. తుపాను ప్రభావంతో ఆకాశం మేఘావృతమై ఉంది. తిరుమల కొండపై భారీగా మంచు కురుస్తోంది.

రోడ్లపై భారీ చెట్లు

ఫెంగల్ తుపాను తమిళనాడు, పుదుచ్చేరితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ తీవ్ర ప్రభావం చూపుతోంది. తుపాను ఏపీలో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. తిరుమలలో రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో స్థానికులు, శ్రీవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తిరుమల రెండో ఘాట్ రోడ్డులో ఆదివారం నాడు కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో ఈ మార్గంలో కొంత సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అయితే టీటీడీ సిబ్బంది అప్రమత్తమై ఎప్పటికప్పుడు జేసీబీలతో రోడ్ల మీదకు వచ్చిన బండరాళ్లను తొలగించి రోడ్డు మార్గాన్ని క్లియర్ చేస్తున్నారు.ఫెంగల్ తుపాను ఏపీలోని దక్షిణ కోస్తాంధ్రతో పాటు రాయలసీమ జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలకు భారత వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విశాఖపట్నం నుంచి పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తిరుపతిలో వర్షాల కారణంగా విశాఖపట్నం- తిరుపతి విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. భారీ వర్షాలతో చెన్నై ఎయిర్ పోర్టును సైతం తాత్కాలికంగా మూసివేశారు. దాంతో విశాఖపట్నం- చెన్నై విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిర్ లైన్స్, విమనాశ్రయ అధికారులు తెలిపారు.

## కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతి...

కడప జిల్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పోరుమామిళ్ల కాలువ కట్ట సమీపంలో ఆటోను ఆర్వీటి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. సంఘం స్థలంలో ఇద్దరు మృతి చెందారు. మరనో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. మృతిచెందిన వారు రామేశ్వరం గ్రామానికి చెందిన రోశయ్య (55) అక్కల రెడ్డిపల్లి గ్రామానికి చెందినసుబ్బయ్య ఆచారి (65) ఆటో డ్రైవర్. ఇతగాత్రులను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. ఆర్విటి ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవరు అతివేగంతో నిర్లక్ష్యంగావ్యవహరించడంతో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# కేడర్ సపోర్ట్ అంతంత మాత్రమే



నెల్లూరు, డిసెంబర్ 2, వైఎస్ జగన్ సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనకు వెళతామంటున్నారు.పార్టీ కార్యకర్తలతో జగన్ సమావేశమవ్వాలని నిర్ణయించారు. ప్రతి బుధ, గురువారాల్లో కార్యకర్తల్లో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించాలని నిర్ణయించారు. అలాగే ప్రతి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జగన్ సమీక్ష చేయనున్నారు. ఆయన అధికారికంగా చేసిన ప్రకటన ఇది. అంటే ఆయన జనంలో ఉండేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకున్న నిర్ణయంగానే చూడాలి. అలాగే క్యాడర్ లో ఉత్సాహం నింపేందుకు ఆయన చేస్తున్న తొలి ప్రయత్నం ఇది అనుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పటి వరకూ ఆయన కార్యకర్తలను పట్టించుకోలేదన్న విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కార్యకర్తలతో భేటీకి జగన్ సిద్ధమవుతున్నారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తలను పూర్తిగా పట్టించుకోకుండా వదిలేశారు. వారిని అస్సలు నేతల నుంచి జగన్ వరకూ ఎవరూ పట్టించుకోవడం లేదు. క్యాడర్ నుచూసి పురుగులును చూసి చూశారు. కనీసం వారు పడ్డ కష్టానికి సాయం చేయాలని కూడా జగన్ కానీ నేతలు కానీ ఆలోచించలేదు. పూర్తిగా తనను రెండోసారి వాలంటీర్లు అధికారంలోకి తెస్తారని భావించారు. వాలంటీర్లతో పాటు తాను అమలు చేసిన సంక్షేమ పథకాలు, బటన్ నొక్కుడు కార్యక్రమాలు తనను మరోసారి అందలం ఎక్కిస్తాయన్న భ్రమలో పడి జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోలేదు. దీంతో మొన్నటి ఎన్నికల సమయంలో కార్యకర్తలు పెద్దగా పట్టించుకోలేదు. పార్టీకి పోటీ చేసిన అభ్యర్థులకు చెందిన ముఖ్య అనుచరుల హడావిడి మాత్రమే పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది. చొక్కాలు చించుకుని ఎవరూ ముందుకు రాలేదు. అందుకే అనేక పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి పార్టీలదే పై చేయిగా మారింది. పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లోనూ క్యాడర్ మొహం చాటేసింది. ఎన్నికల ఫలితాల తర్వాత అసలు విషయం అర్థమయింది. జగన్ కు క్యాడర్ పార్టీ గెలుపునకు ఎంత ముఖ్యమో అవగతమయింది. క్యాడర్ లేనిదే లీడర్లు లేరు. లీడర్లు లేనిదే పార్టీ లేదన్న విషయాన్ని జగన్ గుర్తించడానికి ఇన్నాళ్లు సమయం పట్టింది. అయితే ఐదేళ్లు పుణ్యకాలం గడిచిపోయిన తర్వాత, వారు ఆర్థికంగా చితికపోయిన తర్వాత కార్యకర్తల్లో తిరిగి నూతనోత్తేజం నింపాలని జగన్ చేస్తున్న ప్రయత్నాలు ఎంత మేరకు ఫలిస్తాయో ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే జగన్ ను నమ్మి బయటకు వస్తే కేసులు తమపై నమోదవుతాయన్న భయం క్యాడర్ లో ఉంటుంది. అందుకే కరడుగట్టిన వారు తప్ప సానుభూతి పరులు, జగన్ ను అభిమానించే వారు ఎవరూ అటువైపు చూడరన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఏపీ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కాలేదు. ఇంకా నాలుగున్నరేళు ఎన్నికలకు సమయం ఉంది. ఈ టైంలో బయటకు వచ్చి జిందాబాద్ లు కొడితే జైలు తప్పదన్నబెంగ క్యాడర్ లో ఉంటుంది. అందుకే జగన్ జిల్లా పర్యటనలకు క్యాడర్ అనుకున్న స్థాయిలో రాకపోవచ్చన్న భావన పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతుంది. జగన్ ను నమ్మి, స్థానిక నేతలను విశ్వసించి జనంలోకి జెండా పట్టుకుని వస్తే కష్టాలు పడేది తామేనని వారికి తెలుసు. అందుకే మనసులో అభిమానం ఉన్నప్పటికీ ఇంత త్వరగా బయటపడి తాము ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకన్న భావన ఖచ్చితంగా కార్యకర్తల్లో ఉంటుంది. అందుకే జగన్ జిల్లా పర్యటనలకు ఇది సరన సమయం కాదంటున్నారు. ఇంకా కూటమి ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చి హామీలు అమలుపర్చకుండా కొంత కాలం నెట్టుకొస్తే,ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని, అప్పుడు జగన్ పర్యటనలకు వెళితే మరింత ఉత్సాహంగా క్యాడర్ పాల్గొనే అవకాశముంటుందని పార్టీ నేతలే చెబుతున్నారు. జగన్ ఇప్పటి నుంచి జిల్లాల పర్యటనకు వస్తే అనవసరపు ఖర్చు తప్ప మరో ప్రయోజనం ఉండదని కూడా చెబుతున్నారు. అందుకే జగన్ పర్యటనలకు క్యాడర్ నుంచి పెద్దగా రెస్పాన్స్ ఉండకపోవచ్చని, కేవలం అభిమానులు, జనం మాత్రమే హాజరవుతారన్న అంచనాలు వినిపడుతున్నాయి

# కొత్త ఫించన్ కోసం దరఖాస్తులు

కడప, డిసెంబర్ 2, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా పింఛను కావాలనుకునే వారికి గుడ్ న్యూస్ చెప్పింది. ఈ నెల తొలి వారం నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో 65 లక్షల మంది వరకూ పింఛనుదారులున్నారు. వారిలో వృద్ధులకు నెలకు నాలుగు వేల రూపాయలు, వితంతువులకు నాలుగు వేలు, దివ్యాంగులకు ఆరు వేల రూపాయలు ఇస్తున్నారు. ఇది చిన్న మొత్తం కాదు. ఒక వ్యక్తికి నెలలో నాలుగు వేల రూపాయలంటే చాలా వరకూ ఖర్చులు మిగిలినట్లే. కూటమి ప్రభుత్వం ఒక్కసారిగా నాలుగు వేల రూపాయలకు పింఛను మొత్తం అందిస్తుండటంతో వృద్ధులు, వితంతువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాల తరహాలో ఇంటికి వచ్చి మరీ పింఛను చెల్లిస్తుండటంతో వారి ఆనందానికి అవధులు లేకుండా ఉన్నాయి. ఈ స్థాయిలో పింఛను మరే రాష్ట్రంలో ఇవ్వడం లేదు. పొరుగున ఉన్న తెలంగాణలోనూ నెలకు 2,116 మాత్రమే చెల్లిస్తున్నారు. కానీ ఏపీ ప్రభుత్వం మాత్రం నాలుగు వేల రూపాయలు చెల్లిస్తున్నారు. ఇంత పెద్దమొత్తాన్ని పొందేందుకు అనేక మంది ఎదురు చూస్తున్నారు. సుదీర్ఘకాలంగా పింఛను కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో వారి ఆశలు ఫలించలేదు. కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కొత్త రేషన్ కార్డులను కూడా ఇవ్వలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేయడానికి సిద్ధమయింది. జనవరి నెలలో కొత్త పింఛను దారులకు పెన్షన్ అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ఈ నెల మొదటి వారం నుంచి దరఖాస్తులను సచివాలయాలలో స్వీకరించనున్నారు. వృద్ధాప్య పెన్షన్, వితంతువు పెన్షన్, ఒంటరి మహిళా పెన్షన్, వికలాంగుల పెన్షన్, డప్పు కళాకారుల పెన్షన్, చర్మ కళాకారుల పెన్షన్, కల్లు గీత కార్మికుల పెన్షన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోదలచుకున్న వారు ఈ క్రింది డాకుమెంట్స్ ను సిద్ధంగా ఉంచుకోవాలని ప్రభుత్వం తెలిపింది. ఈ డాక్యుమెంట్ల ఆధారంగా పింఛనుకు అర్హులా? కాదా? అన్నది నిర్ణయించి ఈ నెలాఖరులోగా ఒక జాబితాను ఏపీ ప్రభుత్వంవిడుదల చేసే అవకాశముంది. వారికి జనవరి నెల నుంచి పింఛను అందనుంది. కావాల్సిన డాక్యుమెంట్లు ఇవే... 1.ఆధార్ కార్డు జిరాక్స్ 2.ఆధార్ కార్డు అప్డేట్ హిస్టరీ జిరాక్స్ 3.కులధ్రువీకరణ పత్రం జిరాక్స్ 4.ఆదాయ ధ్రువీకరణ పత్రం జిరాక్స్ 5.బియ్యం కార్డు జిరాక్స్ 6. గడిచిన 6 నెలల కరెంటు బిల్లు జిరాక్స్,

# మెంబర్ షిప్ డ్రైవ్ లో అధికార కూటమి

విజయవాడ, డిసెంబర్ 2, అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ పరిస్థితి దారుణంగా తయారైంది. ఏరి కోరి నేతలకు పదవులు ఇచ్చారు జగన్. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నేతలు ముఖం చాటేస్తున్నారు. కొందరైతే పార్టీకి రాం రాం చెప్పేస్తున్నారు. దీంతో ఏం చెయ్యాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది కేడర్.కొద్దిమంది నేతలు కలిసిరావడం లేదు. పార్టీ పరిస్థితి గమనించిన జగన్, నేరుగా రంగంలోకి దిగుతున్నారు. జగన్ జనంలోకి వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. సంక్రాంతి తర్వాత వారంలో రెండు రోజుల పాటు జిల్లా పర్యటనలు చేయనున్నారు.పార్లమెంట్ యూనిట్‌గా ప్రతి బుధ, గురువారం జిల్లాల్లో ఉంటూ కార్యకర్తలతో మమేకం కానున్నారు అధినేత. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు.. నష్టాలు ఉంటాయని, పోరాట పటిమతో ముందుకు సాగాలని కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు.కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు-నేను-దేవుడు అని పదే పదే సభల్లో చెప్పేవారు జగన్. కార్యకర్తలను పక్కనపెట్టేశారు. దీంతో కొందరు దిగువ స్థాయి నేతలు మండిపడిన సందర్భాలు లేకపోలేదు.చెదిరిపోయిన కేడర్‌ను మళ్లీ ఒక తాటిమీదకు తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కేడర్ మళ్లీ పాత గూటికి చేరుకుంటుందా? అన్నదే అసలు పాయింట్. నేతలు కొంతమంది జనసేన వైపు, మరికొందరు టీడీపీ వెళ్లిపోయారు. వారితోపాటు కొంత కేడర్ వెళ్లిపోయింది. దీంతో వైసీపీ హార్డ్‌కోర్ కేడర్ డీలా పడిపోయింది.ఇంకోవైపు అటు అధికార టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలను కేడర్‌ను పెంచుకునే పనిలో పడ్డాయి. మెంబర్ షిప్‌కు కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. కార్యకర్తలకు ఇన్యూరెన్స్ స్కీమ్‌ని వర్తింప చేస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ కేడర్ నిలబడుతుందా? అధికార పార్టీకి ధీటుగా వైసీపీ కూడా కార్యకర్తలకు సదుపాయాలు కల్పిస్తుందా? లేదా అన్నది చూడాలిఈ క్రమంలోనే తన పట్టు తగ్గకుండా, ఉనికి చాటుకునేందుకు బాలినేని వైసిపిపై, జగన్‌పై కాస్త ఘాటైన విమర్శలు చేస్తున్నారంట.

# పవిత్ర తిరుమల కొండ జలం

# మురుగు కాలువ పాలు

తుపాను తీవ్రతకు శేషాచలం కొండలు ఉధృతంగా,భారీ వర్షాలు కురుస్తున్న నేడు మాలాడీగుండం జలపాతం ఉధృతంగా ప్రవహిస్తూ ఎన్జీవో కాలనీ నుంచి సాగుతూ... లీలా మహల్ జంక్షన్ సమీపంలో యస్ కే పార్క్ పుద్సంజయ్ గాంధీ కాలనీ వైపు ఉన్న పెద్ద మురుగు నీరు కాలువలో కలిసి ప్రవాహం సాగుతోంది ఈవిధంగా సీజనల్ వర్షాకాలం నీరు పెద్దయెత్తునప్రజలకు ఉపయోగపడని విధంగా దశాబ్దాలుగా కొనసాగుతోంది, అడవులనుండి కలుషితం లేని స్వచ్ఛమైన తీయని నీరు ప్రభుత్వం, కార్పొరేషన్ తితిదే సద్వినియోగం చేయడానికి ముందుకు వచ్చి సమీపంలో జలాశయం లేదా పంపింగ్ ప్రక్రియ ప్రణాళిక అమలు చేస్తే తిరుపతి ప్రజలు దాహార్తిని తీర్చడానికి అనుకూలంగా ఉంటుంది

# బాలినేనికి మంత్రి పదవి..



ఒంగోలు, డిసెంబర్ 2 ప్రకాశం జిల్లా రాజకీయలలో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైసీపీ ఆవిర్భావం నుంచి ఒంగోలుతో పాటుగా ప్రకాశం జిల్లాలో అన్నీ తానై వ్యవహరించిన మాజి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపికి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు. ఎన్నికల ముందే బాలినేని సిఎం చంద్రబాబుతో సమావేశం అయినట్లు.. ఆ సమయం లోనే టీడీపీకి రావాలని.. అధికారంలోకి వచ్చిన తరువాత తగిన ప్రాధాన్యత ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారని ప్రచారం జరిగింది. తాజాగా బిగ్ టీవీ ఇంటర్యూలో టీడీపీలోకి వస్తే.. చంద్రబాబు మంత్రి పదవి ఆఫర్ చెసినట్లు బాలినేని వెల్లడించారు . అప్పట్లో తనకు లక్ బాగా లేక టీడీపీలోకి వెళ్లలేదని పేర్కొన్నారు.బాలినేని శ్రీనివాసరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలలో ఒంగోలులో వైసిపి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బాలినేని ఒంగోలు ఎంపీతో పాటు దర్శి ఎమ్మెల్యే విషయంతో తాను సూచించిన వారికి సీట్లు ఇవ్వాలని పట్టు బట్టారు. కానీ, జగన్ అంగీకరించ లేదు. ఎన్నికల్లో ఓటమి తరువాత ఈవీఎంల పైన బాలినేని కోర్టుకు ఎక్కారు. పార్టీ నుంచి మద్దతు లభించ లేదు. తరువాతి పరిణామాల్లో బాలినేని జనసేనలో చేరారు. జనసేనాని పవన్‌కళ్యాణ్‌తో సత్సంబంధాలు ఉన్న బాలినేని జనసేనలో చేరే సమయంలోనే రాజకీయ భవిష్యత్ పైన హామీ పొందారంట.ఆయనకు ఎమ్మెల్సీ పదవితో పాటుగా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగిస్తామని డిప్యూటీ సీఎం పవన్ హామీ ఇచ్చారని సమాచారం. అయితే, బాలినేని జనసేనలో ఎంట్రీ సమయం నుంచి ఒంగోలు టీడీపీ నేతలు ఓపెన్ గానే విమ్మలు గుప్పిస్తున్నారు. బాలినేని జనసేన లో చేరినా.. వైసీపీఅధికారంలో ఉన్న సమయంలో చేసిన పనులకు సమాధానం ఇవ్వకుండా వదిలేది లేదని హెచ్చరిస్తున్నారు. జనసేన లోని కొందరు నేతలు సైతం బాలినేనికి దూరంగా ఉంటున్నారు.ఇక వైసీపీ హయాంలో సెకీ ఒప్పందాలు, సోలార్ విద్యుత్తు ఒప్పందాలకు సంబంధించి జగన్‌పై ముప్పేట దాడి జరుగుతుంది. సెకీ ఒప్పందాలు జరిగినప్పుడు బాలినేని శ్రీనివాసరెడ్డి విద్యుత్తు శాఖ మంత్రిగా ఉన్నారు. అప్పటి జగన్ నిర్ణయాలపైన బాలినేని ఇటీవల కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. జగన్ ను ఇరకాటంలోకి నెట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. అసలు బాలినేని ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతున్నారు. కేవలం వైసీపీని ఇరకాటంలో పెట్టి రివెంజ్ తీర్చుకోవడానికేనా.. లేక అంతకు మించిన వ్యవహారం ఇంకేదన్నా ఉందా అని ఆరా తీస్తున్న వాళ్ళకు కొత్త విషయం తెలుస్తోందట. బాలినేనికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇప్పించాలన్నది పవన్ కళ్యాణ్ ఆలోచనగా తెలుస్తోందని.. పొలిటికల్ సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జనసేన నుంచి పవన్ కళ్యాణ్, మరో ఇద్దరు మంత్రులు ఉన్నారు. కాపు, కమ్మ కాంబినేషన్ ఉన్నందున బాలినేనికి పదవి ఇప్పిస్తే.. రెడ్డి సామాజికవర్గంనికి జనసేన నుంచి అవకాశం కల్పించినట్లు అవుతుందన్నది జనసేనాని ఆలోచనట. బాలినేనికి ఇటు ప్రకాశం జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన గుంటురు, నెల్లూరులతో పాటు రాయలసీమలో మంచి రాజకీయ పరిచయాలున్నాయి. ఆ పరిచయాలతో పార్టీని బలోపేతం చేసుకోవచ్చన్నది పవన్ కళ్యాణ్ ఆలోచనగా చెప్తున్నారు.ప్రస్తుతం ఏపీ క్యాబినెట్ లో ఓ మంత్రి పదవి ఖాళీగా ఉంది. కూటమి సర్కారు ఏర్పడి అయిదు నెలలు అవుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ పదవి ఖాళీగానే ఉంచారు. అన్ని బాలినేనితో భర్తీ చేయవచ్చున్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణచక్రవర్తి, జయమంగళ వెంకట రమణ రాజీనామాలు చేశారు. శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు ఇవాళ కాకుంటే రేపైనా వాటిని ఆమోదించక తప్పదని, ఆ తర్వాత కూటమి కోటాలోకి వచ్చే ఆ ఎమ్మెల్సీ సీట్లలో ఒకటి బాలినేనికి దక్కే ఛాన్స్ ఉందని తెలుస్తోంది.ఎమ్మెల్సీ పదవి దక్కిన వెంటనే పవన్ తో ఒంగోలు లో భారీ బహిరంగ సభను కూడా బాలినేని ఏర్పాటు చేసే అవకాశం ఉందన్న ప్రచారం ప్రచారం ప్రకాశంలో జోరందుకుంది. అయితే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, బాలినేని మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో వివాదాలు ఉన్నాయి. ఇప్పుడు బాలినేనికి ఎమ్మెల్సీ పదవి ఇస్తే ఒంగోలు వరలో ఆ రెండు కత్తులు ఎలా ఇముడుతాయనేది ఆసక్తికరంగా మారింది. కారణం ఏదైనా మాజీ మంత్రి కామెంట్స్ మాత్రం వైసీపీని ఉక్కిరి బిక్కిరి చేస్తూ.. వైసీపీని ఇరకాటంలో పడేస్తున్నాయట. బాలినేనికి ఎమ్మెల్సీ ,మంత్రి పదవి దక్కుతే ప్రకాశం జిల్లాలో మళ్లీ బాలినేని తన హవా కొనసాగించే అవకాశం ఉంది.

# రాజ్యసభకు చింతకాయల విజయ్..

శ్రీకాకుళం, డిసెంబర్ 2 రాజకీయాల్లో ఎంత దూకుడుగా ఉంటే అంత మనుగడ ఉంటుంది. వాగ్ధాటితో పాటు సబ్జెక్ట్ ఉన్న వారికి పాలిటిక్స్‌లో మంచి ఫ్యూచర్ ఉంటుంది. అలా తన వాక్ చాతుర్యంతో చిన్న వయసులోనే రాజకీయాల్లో ఉద్దండులను సైతం మెప్పించిన యువ నాయకుడు చింతకాయల విజయ్.. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో నుంచి ఏడుసార్లు గెలుపొంది , అనకాపల్లి ఎంపీగా ఒకసారి గెలిచి, మంత్రిగా పనిచేసి, ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడైన చింతకాయల విజయ్ ఇప్పుడు పెద్దల సభ రేసులో ముందంజలో ఉన్నాడు. ఏపీలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒక సీటును చింతకాయల విజయ్ ఆశిస్తున్నారంట.గత సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలని చింతకాయల విజయ్ ఆశించారు. అయ్యన్నపాత్రుడు సైతం తన కొడుక్కి ఎంపీ సీటు ఇవ్వాలని అప్లికేషన్ పెట్టుకున్నట్లు బహిరంగంగానే ప్రకటించారు. అయితే పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటు బీజెపికి వెళ్లడంతో కొంత నిరాశకు చెందిన చింతకాయల విజయ్ తర్వాత తన తండ్రి గెలుపులో కీలక పాత్ర వహించారు.తన తండ్రి సీటు వరకే పరిమితం కాకుండా వైసీపీ ప్రభుత్వ అరాచకాలను తనదైన శైలిలో ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. తన తండ్రిని అరెస్టు చేయాలనే ఆలోచన చేసినప్పుడు కానీ, ఇంటిని కూల్చాలనే ప్రయత్నం చేసినప్పుడు కానీ చింతకాయల విజయ్ అన్ని తానే వ్యవహరించి అటు కుటుంబంలో, ఇటు పార్టీ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపారు. 2019 నుండి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఆయన పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం మాత్రం మానలేదు.చింతకాయల విజయ్ అయ్యన్నపాత్రుడు కొడుకుగానే కాకుండా తనకు తాను తన సొంత ఐడెంటిటీని క్రియేట్ చేసుకునే క్రమంలో సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం టీడీపీలో సీఎం చంద్రబాబు తర్వాత అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న నారా లోకేష్ కి అత్యంత సన్నిహితుడుగా పేరు తెచ్చుకున్న చింతకాయల విజయ్ తనను రాజ్యసభకు పంపాలనే మనసులోని కోరికను లోకేష్ దగ్గర బయటపెట్టినట్లు తెలుస్తుంది. 2019 నుంచి 24 మధ్యకాలంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడుతూ, టిడిపిపై పెడుతున్న కేసులను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో కీలకంగా వ్యవహరించిన విజయ్.. లోకేష్ కు అత్యంత సన్నిహితుడిగా మారాడంటారు.తోడు 2024 సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు వస్తుందని భావించి గ్రౌండ్ వర్క్ చేసుకున్న చింతకాయల విజయ్ కి సీటు దక్కలేదు. బీజేపీ కోసం సీటు త్యాగం చేసిన విజయ్‌కు ప్రతిఫలంగా రాజ్యసభ సీటు ఇవ్వాలని టీడీపీ అధిష్టానం కూడా భావిస్తున్నట్లు చెప్తున్నారు. ఇప్పటికే టిడిపి తొలితరం నాయకుల్లో చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ రాష్ట్ర మంత్రిగా, మాజీ కేంద్రమంత్రి ఎర్రం నాయుడు కుమారుడు రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నారు. రాజకీయాల్లో ఆనాటి నుండి నేటి వరకు టిడిపిలోనే కొనసాగుతున్న అయ్యన్నపాత్రుడు కుమారుడిగా విజయ్‌ని రాజ్యసభకు పంపడానికి టీడీపీ పెద్దలు సుముఖంగానే ఉన్నారంటున్నారు.రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న మూడు రాజ్యసభ సీట్లపై టిడిపి తో పాటు జనసేన పార్టీ కూడా కన్నేసింది. మూడు సీట్లలో ఒక సీటు జనసేనకు కేటాయిస్తే మిగిలిన రెండు రాజ్యసభ సీట్లలో చంద్రబాబు తనకు కావలసిన వాళ్లకు కేటాయించే అవకాశం ఉంటుంది. ఆ క్రమంలో విజయ్ పేరు ఫోకస్ అవుతుంది. తన కోసం లోక్‌సభ ఎంపీ సీటు వదులుకున్న విజయ్‌కి రాజ్యసభ సభ్యత్వం కోసం అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ కూడా సిఫార్సు చేస్తున్నారంట. ఏపీలో ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకటి టీడీపీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి కేటాయించి, మరో సీటు జనసేన కోటాలో వెళ్లిపోయినా ప్రభుత్వంలో మూడో పార్టీగా ఉన్న బిజెపి తనకు కావలసిన వాళ్లకు సీటు ఇప్పించుకునే ప్రయత్నంలో ఉందనే ప్రచారం జరుగుతుంది.అందులో భాగంగానే చింతకాయల విజయ్ ని రాజ్యసభకు పంపించవచ్చు అనే ఊహాగానాలు ఉమ్మడి విశాఖ జిల్లాలో చెక్కర్లు కొడుతున్నాయి. తన తండ్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏపీ అసెంబ్లీ స్పీకర్ కావడం, చంద్రబాబుకి సన్నిహితమైన వ్యక్తి కావడం, నారా లోకేష్ ఆశీస్సులు విజయ్‌కి ఉండడం, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ విజయ్ కి సహకరించడం .. ఈ ఈక్వేషన్స్ అన్ని చూస్తుంటే చింతకాయల విజయ్ త్వరలో రాజ్యసభలో అడుగు పెడతారన్న ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి ? మరి చింతకాయల వారి వారసుడి అదృష్టం ఎలా ఉండబోతుందో చూడాలి.

# వాజేడు ఎస్సై ఆత్మహత్య

ములుగు జిల్లాలో మరో విషాద సంఘటన జరిగింది. వాజేడు ఎస్సై హరీష్ ఆత్మహత్య చేసుకున్నాడు. సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ముళ్లకట్ట సమీపంలోని హరిత రిసార్ట్స్ లో ఘటన జరిగింది. కుటుంబ కలహాలు కారణమా..? వరుస ఘటనలతో మానసిక ఒత్తిడి తో ఆత్మహత్య..? అనే అనుమానాలు వున్నాయి. సోమవారం ఉదయం 6 గంటలకు తన డ్రైవర్ కి ఎస్సై హరీశ్ కాల్ చేసాడు. తనను హోటల్ నుండి పిక్ అప్ చేసుకొమ్మని చెప్పాడు. డ్రైవర్ వచ్చే వరకే తుపాకీతో కాల్చుకున్నాడు. అంతకుముందు హరిశ్, మరో అమ్మాయి గోదవపడ్డట్టు, తనను వదలిపెట్టాలంటూ హరీష్ బ్రతిమిలాడినట్లు ఆమె ససేమిరా అనడంతో మనస్తాపానికి గురై కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

# 2025 యుగాంతానికి ఎంట్రీ పాయింటా

రాబోయేదంతా వినాశనమేనా..? మనుషులంతా నశించి పోతారా..? భూమి మనుగడ ఇక కష్టమైనా..? ఇప్పటి వరకూ ఊహిస్తున్న డూమ్స్ డేకు రోజులు దగ్గర పడ్డాయా..? మరో నెల రోజుల్లో కళ్లముందుకొస్తున్న కొత్త సంవత్సరమే మన అంతానికి ఎంట్రీ పాయింటా..? ప్రపంచమంతా నమ్ముతున్న ఓ జోస్యాన్ని వింటుంటే ఈ భయాలన్నీ నిజమేనని నమ్మాల్సి వస్తుంది. రాబోయే విలయం గురించి ప్రపంచ ప్రఖ్యాత భవిష్యవాణి బాబా వంగా షాకింగ్ జోస్యం చెప్పింది. ఆమె చెప్పిన మాటలు తేలికగా కొట్టి పారేయలేం. ఎందుకంటే, 50 ఏళ్ల క్రితమే భవిష్యత్తును ఊహించిన బాబా వంగ చెప్పిన చాలా విషయాలు ఇప్పటికే నిజమై కనిపించాయి. రాబోయే కాలం గురించి ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు ప్రపంచాన్ని కలవరానికి గురిచేస్తోంది. 2025 ఘోర కలిని చూపిస్తుందనే కంగారు పుడుతోంది. ప్రస్తుతం పెద్దగా కనిపించని కమ్యూనిజం భవిష్యత్తులో ప్రపంచాన్ని ఏలుతుందనే జోస్యం నుండి యూరప్‌లో యుద్ధాలు.. తెల్లవాళ్లకు ముస్లీం రాజుగా మారడం.. భూమి బద్దలై పోవడం వంటి భారీ షాక్ ఇచ్చే అంశాలు ఆమె ప్రిడిక్షన్‌లో ఉన్నాయి. 2025లో యూరప్‌లో భయంకరైన యుద్ధం జరుగుతుందనీ.. ఇది చాలా విధ్వంసానికి కారణం అవుతుందనీ.. ప్రపంచ నాశనానికి ఇదే మొదలని బాబా వంగా జోస్యం చెప్పారు.బాబా వంగ బతికున్న కాలంలో ఓ ఇంటర్వ్యూలో రష్యా అధ్యక్షుడు పుతిన్ గురించి చెప్పింది. అలాగే, కమ్యూనిజం ప్రపంచాన్ని ఏలుతుందని అంచానా వేసింది. దీన్ని బట్టి, పుతిన్ నాయకత్వంలో కమ్యూనిజం ప్రపంచ ఆధిపత్య శక్తిగా అవతరిస్తుందని తెలుస్తుంది. ఆమె జోస్యం ప్రకారం, 2043 కల్లా ప్రపంచమంతా కమ్యూనిజం చేతుల్లోకి వెళ్తుంది. ఇది 2025లోనే ప్రారంభం అవుతుంది. దీనికి 2025లో జరిగే అత్యంత భయంకరమైన యుద్ధం కారణం అవుతుందని కూడా బాబా వంగా అంచనా వేసింది. 2025లో యూరప్‌లో ఘోరమైన యుద్ధం జరుగుతుందనీ.. ఇది ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందనీ? భారీ స్థాయిలో ధన, ప్రాణ నష్టం వాటిల్లుతుందని ఆమె ఊహించింది.ఈ జోస్యంలో నిజం ఎంతనేది అటుంచితే? ప్రస్తుత పరిస్థితులను బట్టి.. కమ్యూనిస్ట్ దేశాలైన రష్యా, చైనాలకు అమెరికాకు మధ్య ఆధిపత్య పోరు పీక్స్‌లో ఉంది. ఇటీవల పుతిన్ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే.. పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు ఇచ్చిన ఆయుధాలు రష్యా లోపల ప్రయోగిస్తే అది భయానక యుద్ధానికి దారి తీస్తుందనే సూచనలు ఉన్నాయ్. దానికి నాటో దేశాలు, అమెరికా, యూరప్ కంట్రీలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కూడా పుతిన్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. తాజాగా, ఓ16 మాజీ చీఫ్ రిచర్డ్ డీర్లవ్ కూడా దీనిపై యూకే పీఎంకు సూచనలు చేశారు. పుతిన్ యూకేపై యుద్ధానికి దిగుతారని హెచ్చరించారు.ఇక, ఐరోపాలో యుద్ధం గురించి బాబా వంగ అంచనాతో పాటు, 2043 నాటికి యూరప్ ముస్లింల పాలనలోకి వస్తుందని.. 2076 నాటికి ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం తిరిగి వస్తుందని అంచనా వేశారు. అంటే, కమ్యూనిస్ట్ కంట్రీలుగా ఉన్న రష్యా, చైనాలు ప్రపంచాన్ని ఏలతాయనే అనుమానాలకు ఇది బలం చేకూరుస్తుంది. బాబా వంగ, 2025లో ఐరోపాలో క్రూరమైన యుద్ధాలు జరుగుతాయని హెచ్చరించింది. ఇదే విషయాన్ని, నోస్ట్రడమస్‌గా పాపులర్ అయిన, 16వ శతాబ్దానికి చెందిన మిచెల్ డి నోస్ట్రెడామ్ కూడా చెప్పాడు. ఐరోపా భూభాగాలు క్రూరమైన యుద్ధాల్లో పాల్గొంటాయని హెచ్చరించాడు.భారీ విధ్వంసం, భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగిస్తుందని అంచనా వేశాడు. అయితే, పుతిన్ ప్రారంభించిన ఉక్రెయిన్ యుద్ధం ఈ అంచనాలను నిజం చేస్తున్నట్లు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక, నోస్ట్రడమస్ చెప్పిన విషయాల్లో.. "పురాతన ప్లేగు శత్రువుల కంటే ఘోరంగా నష్టాన్ని కలిగిస్తుందని" కూడా చెప్పాడు. ఇది బ్రెజిల్‌లో అగ్రిపర్వతాల బూడిద, భారీ వరదలతో సహా ఇతర విపత్తులను సూచిస్తుంది. అలాగే, 2043 నాటికి యూరప్ ముస్లీంల వశం అవుతుందనే ఊహకు, బలం చేకూరుస్తూ.. మిడిల్ ఈస్ట్ యుద్ధంలో భాగంగా ఇరాన్‌తో పాటు కొన్ని ఇస్లామిక్ దేశాలు యూరప్‌కు వార్నింగ్ ఇస్తూనే ఉన్నాయి.ఫ్రెంచ్ ఆధ్యాత్మికవేత్త నోస్ట్రడామస్ కన్నా ఎక్కువ కచ్చితంగా ప్రపంచ భవిష్యత్ పరిణామాలు అంచనా వేసింది బల్గేరియాకు చెందిన బాబా వంగ.. 1996లో తన 85వ ఏట చనిపోయిన బాబా వంగ.. ఇప్పుడు జరుగుతున్న చాలా పరిణామాలు ఆమె బతికున్నప్పుడే అంచనా వేసింది. చిన్నప్పుడు వచ్చిన ఓ భయంకర పెనుతుపానులో కళ్లు పోగొట్టుకున్న బాబా వంగ, దూరదృష్టితో భవిష్యత్ పరిణామాలు చూసిందనీ.. ఆమె చెప్పినవి చెప్పినట్లు కచ్చితంగా జరుగుతున్నాయని చాలా మంది నమ్ముతారు.దానికి తగ్గట్లే, ఆమె చెప్పిన వాటిలో దాదాపు 85 శాతం నిజంగా జరగడమే ఇప్పుడు అందర్నీ ఆందోళనకు గురిచేస్తుంది.

రెండు లోహ విహంగాలు అమెరికాను తీవ్రంగా దెబ్బతీస్తాయని, వేలాది మంది అమాయక ప్రజలు మరణిస్తారని బాబా వాంగ 1989లో చెప్పిన తర్వాత.. 2001, సెప్టెంబరు 11న అమెరికా ట్విన్ టవర్స్‌పై జరిగిన దాడి దానికి నిదర్శనంగా నిలిచింది. అలాగే 1950లో సముద్రపు అలలు భూభాగాన్ని కబళించివేస్తాయని చెప్పడం.. 2004, డిసెంబరు 26వ తేదీన ఇండోనేషియా, సుమిత్ర దీవులను సునామీ కుదిపేయడాన్ని ప్రపంచంలో అంతా చూశారు.ఇక, భూమిపై వచ్చే పెను వాతావరణ మార్పుల గురించి కూడా బాబా వంగ 60 ఏళ్ల క్రితమే ఊహించారు. ధ్రువ ప్రాంతాల్లో మంచుకొండలు కరిగిపోతాయని, ఫలితంగా సముద్ర మట్టాలు పెరిగిపోతాయని, వేడి ప్రాంతాలు చల్లగాను, చల్లటి ప్రాంతాలు వేడిగాను మారిపోతాయని, అగ్ని పర్వతాలు బుసలకొడతాయని చెప్పింది. దానికి తగ్గట్లే ప్రస్తుతం క్లైమెట్ ఛేంజ్, మనిషి మనుగడకే ప్రమాదాన్ని తెచ్చే స్థాయిలో పెరిగింది.ఎల్ నినో, లా నినోలు గతి తప్పాయి. సముద్ర వ్యవస్థల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మంచుకొండలు కరిగి అకాల వర్షాలు, వరదలకు కారణం అవుతున్నాయి. భయంకరమైన ఎండ భూమిని కాల్చేస్తుంది. చలి తీవ్రత నానాటికీ పెరుగుతోంది. ఈ ఏడాది వచ్చిన భీకర వరదలు, వర్షాలు రికార్డు స్థాయిలో నష్టాన్ని మిగిల్చాయి. ఈ సంవత్సరం నమోదైన వేడి ఇది వరకూ ఎప్పుడూ చూడని విధంగా పాశ్చాత్య దేశాలను మాడ్చేసింది. ఇవన్నీ బాబా వంగ చెప్పినట్లే జరిగాయని కాదు గానీ, ఇలా జరుగుతుందని ఆమె ఊహించడమే ఇందులో అర్థం చేసుకోవాల్సిన అంశం.ఇక, అమెరికా 44వ అధ్యక్షుడిగా ఓ ఆఫ్రికన్–అమెరికన్ ఎన్నికవుతారని, ఆయనే అమెరికాకు ఆఖరి అధ్యక్షుడవుతారని కూడా బాబా వంగ ముందుగానే అంచనా వేసింది. అయితే, 44వ అధ్యక్షుడిగా బరాక్ ఒబామా ఎన్నికైన తర్వాత 2017 లో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడయ్యారు. తర్వాత, జో బైడెన్? ఇప్పుడు, అమెరికాలో అధ్యక్ష ఎన్నికల జోరు నడుస్తోంది. కానీ, ఇందులో ఓ ఆఫ్రికన్ అధ్యక్షుడవ్వడం బాబా వంగా అంచనాను నిజం చేసిందని కొందరు వాదిస్తారు. అదే సమయంలో, చెర్నోబిల్ విపత్తు, బల్గేరియా భూకంపం, రెండో ప్రపంచ యుద్ధం, యువరాణి దయానా మరణం కూడా బాబా వంగ ప్రవచనాలకు తగ్గట్లే జరిగాయి.ఇక, బాబా వంగ చెప్పిన అంచనాల్లో.. 2130 సంవత్సరం నాటికల్లా భూభాగంపై ఒక్క జీవి కూడా మిగలకుండా నశించి పోతుందని, అంతరిక్షవాసుల సహకారంతో సముద్ర గర్భంలో మానవులు జీవిస్తారని ఉంది. అలాగే, 3005 నాటికి అంగారక గ్రహంపై కూడా యుద్ధం జరుగుతుందని.. 3 వేల 797 సంవత్సరం నాటికి ఈ భూమండలమంతా నశించి పోతుందని.. 5079 సంవత్సరానికి మానవ జాతి అంతా తుడిచి పెట్టుకుపోతుందని అంచనా వేసింది. అప్పటికే భూమి మీద మిగిలిన మానవులు మరో సౌర వ్యవస్థలోకి వెళ్లిపోతారని కూడా బాబా వంగ జోస్యం చెప్పింది.బాబా వంగ చెప్పిన కాలజ్ఞానంలో నిజానిజాలు పక్కనపెడితే.. సూచనలు మాత్రం స్పష్టంగానే కనిపిస్తున్నాయి. బాబా వంగ చెప్పిన అంచనాలను ప్రపంచంలో అందరూ ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా? ఇప్పటి వరకూ కనిపించిన ఉదాహరణలే ఆమె అంచనాలను రూఢీ చేస్తున్నాయి. అవి ప్రపంచవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించాయనడంలో మాత్రం సందేహం లేదు. అందుకే, 2025లో ఆమె చెప్పిన యుద్ధాలు, పర్యావరణ విపత్తుల నుండి భూమి నాశనమయ్యే వరకు.. భవిష్యత్తులో ఎలా ఉండబోతుందోననే భయం పట్టుకుంది.ఇప్పటికే, మూడో ప్రపంచ యుద్ధం గురించి అంతర్జాతీయంగా ఆందోళన ఉన్న పరిస్థితుల్లో 2025లో యూరప్ యుద్ధం దానికి దారి తీస్తుందనే అనుమానాలు వస్తున్నాయి. అదే ఇప్పుడు ప్రపంచ కలవరానికి కారణం అయ్యింది. ఇవి నిజమైతే పరిస్థితి ఏంటా అనే ఆందోళనను పెంచింది. ఇక, ఇవన్నీ చివరికి ఊహలగానే మిగిలిపోతాయా లేదా అన్నది భవిష్యత్తులో చూసి తెలుసుకోవాల్సిందే.

# సీమ నేతలకు బాబు సాఫ్ట్ వార్నింగ్

విజయవాడ, డిసెంబర్ 2, ఏపీలో కూటమినేతల మధ్య విభేదాల పర్వం ప్రారంభం అయ్యింది. అందుకు రాయలసీమ వేదికగా నిలిచింది. సిమెంట్ కంపెనీలకు బూడిద తరలింపులో వివాదం ప్రకంపనలకు కారణమవుతోంది.రాయలసీమలో 'బూడిద' పంచాయితీ వివాదానికి కారణమవుతోంది.ముఖ్యంగా కూటమిలో విభేదాలకు అవకాశం కల్పిస్తోంది.ఈ తరుణంలో సీఎం చంద్రబాబు కలుగజేసుకున్నారు. దిద్దుబాటు చర్యలకు దిగనున్నారు. సిమెంట్ పరిశ్రమలకు బూడిద తరలించే విషయంలో జెసి దివాకర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి వర్గీయుల మధ్య వివాదం తలెత్తింది. ఇప్పటివరకు జెసి వర్గీయులే బూడిద తరలిస్తుండగా.. రవాణాలో తమకు వాటా కావాలని ఆదినారాయణ రెడ్డి వర్గీయులు పట్టుపట్టారు. అప్పటినుంచి వివాదం నడుస్తోంది. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగ చేసుకోవాల్సి వచ్చింది. అయితే ఇది కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరుగా నిలుస్తోంది. జెసి ప్రభాకర్ రెడ్డి టిడిపిలో సీనియర్ నేత. ఆదినారాయణ రెడ్డి సైతం బిజెపి ఎమ్మెల్యే. తాజా వివాదం కూటమి ప్రభుత్వం పై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే టిడిపి ఇన్చార్జ్ భూపేష్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, జెసి ప్రభాకర్ రెడ్డిలకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. సీఎం చంద్రబాబును కలుసుకోవాలని వర్తమానం అందింది. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయంలో దీనిపై పంచాయితీ జరగనుంది. దీనికి చంద్రబాబు ఒక పరిష్కార మార్గం చూపి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే అవకాశం కనిపిస్తోంది.ఆర్టీపీపీ నుంచి సిమెంట్ పరిశ్రమలకు బూడిద తరలిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో చాలా ఏళ్లుగా జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు ఇలా బూడిద తరలిస్తూ వచ్చారు. అయితే తమకు కూడా వాటాలు కావాలని ఆదినారాయణ రెడ్డి వర్గీయులు కోరారు. ఈ నేపథ్యంలో బూడిదను వాహనాల్లో నింపకుండా ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. అదే సమయంలో ఆదినారాయణ రెడ్డి వర్గీయుల బూడిద లారీలు తాడిపత్రి రాకుండా జేసీ ప్రభాకర్ రెడ్డి అడ్డగించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.కూటమి పార్టీల మధ్య విభేదాల పర్వం అంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం నడిచింది. దీనిపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిద్దుబాటు చర్యలకు దిగారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడబోమంటూ నేతలకు హెచ్చరించారు. అందుకే ముగ్గురు నేతలకు ముఖ్యమంత్రి కార్యాలయానికి రావాలని సూచించారు.మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అయింది. తాడిపత్రి జాతీయ రహదారిలోని కొండాపురం మండలం సుగుమంచిపల్లె చెక్ పోస్ట్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఈ వివాదాన్ని ఆదిలోనే తుంచేయ్యాలని చంద్రబాబు భావిస్తున్నారు. వీలైనంత త్వరగా పరిష్కార మార్గం చూపి ఎండ్ కార్డు వేయాలని చూస్తున్నారు.

## తుఫాన్ ఎఫెక్ట్..

## విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

చెన్నై ఫెంగల్ తుఫాన్ కారణంగా చెన్నైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ మధ్యలో చెన్నై ఎయిర్పోర్టులో ల్యాండ్ అయ్యేందుకు ట్రై చేసిన ఇండిగో విమానం తృటిలో ప్రమాదాన్ని తప్పించుకుంది. గాలుల తీవ్రతకు కుదుపునకు గురవుతున్నట్లు కనిపించిన ఫ్లైట్, ల్యాండింగ్ సాధ్యం కాక గాల్లోకి లేచింది. వెనుక భాగం రన్వేకు తాకేలా కనిపించినా లక్కీగా ప్రమాదం కాలేదు. తుఫాన్ దృష్ట్యా మంగళవారం వరకు చెన్నై ఎయిర్ పోర్టుకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

## 5న ఫడ్నవిస్ ప్రమాణం



ముంబై, డిసెంబర్ 2, (న్యూస్ పల్స్) మహారాష్ట్ర సీఎం పీఠంపై ఉత్కంఠ వీడింది. ఆ రాష్ట్ర తదుపరి సీఎంగా దేవేంద్ర ఫడణవీస్ పేరును బీజేపీ అధిష్టానం దాదాపు ఖరారు చేసినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఎమ్మెల్యేలతో జరిగే సమావేశంలో ఫడణవీస్‌ను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారని ఆ పార్టీ సీనియర్ నేత వెల్లడించారు. కాగా, సీఎం ఎంపిక విషయంలో మహాయుతిలో గత కొద్ది రోజులుగా ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. ముందు నుంచీ మహారాష్ట్ర బీజేపీలో కీలకంగా ఉన్న ఫడ్నవీస్ పేరే సీఎం రేసులో ప్రముఖంగా వినిపించింది. ఎట్టకేలకు ఫడణవీస్‌ను సీఎంగా నిర్ణయించిన బీజేపీ సోమవారం దీనిపై అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది.అటు, మహాయుతి కూటమిలో కీలకంగా వ్యవహరించిన ఏక్‌నాథ్ షిండే (శివసేన) సీఎం రేసులో ఉన్నట్లు వార్తలొచ్చాయి. అయితే, దీనిపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. కూటమిలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. బీజేపీ, శివసేన, ఎన్సీపీ కలిసి ఏకాభిప్రాయానికి రానున్నట్లు షిండే తెలిపారు. అమిత్ షాతో భేటీ అనంతరం షిండే మెత్తబడినట్లు తెలుస్తోంది. అయితే, కీలక మంత్రిత్వ శాఖలను ఆయన ఆశిస్తున్నట్లు సమాచారం. డిసెంబర్ 5 మధ్యాహ్నం 1 గంటకు కొత్త సీఎం ప్రమాణ స్వీకారం ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో నిర్వహించనున్నారు.

# ఐసీసీ ఛీఫ్ గా జైషా...



ముంబై, డిసెంబర్ 2, (న్యూస్ పల్స్) క్రికెట్ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన నియంత్రణ మండలి ఐసీసీకి భారత్ కు చెందిన జై షా చైర్మన్ గా ఆదివారం నుంచి పగ్గాలు చేపట్టబోతున్నారు. 2019 నుంచి భారత క్రికెట్ నియంత్రణ బోర్డు కార్యదర్శిగా పని చేస్తున్న జై షా.. ఐసీసీ పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దీంతో డిసెంబర్ 1 నుంచి ఈ పదవి చేపట్టనున్నారు. ఐసీసీలో డిసెంబర్ 1 నుంచి చైర్మన్ గా జై షా శకం మొదలైంది.చైర్మన్ గా పగ్గాలు చేపట్టిన జై షా ముందు కొన్ని సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలిస్ లో జరిగే ఒలింపిక్స్ లో క్రికెట్ ను చేర్చడంపై కార్యచరణ రూపొందించాల్సి ఉంటుంది. అలాగే మహిళా క్రికెట్ ను మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవశ్యకత కూడా ఉంది. మరోవైపు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన జై షా మాట్లాడుతూ.. ఈ పదవికి ఎన్నుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఐసీసీ డైరెక్టర్లు, వివిధ బోర్డు మెంబర్లకు ఆయన థాంక్స్ తెలిపారు. రాబోయే ఒలింపిక్స్ లో క్రికెట్ ను నిర్వహించడంపై ఇంకా చాలా చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు మరింత మజా పంచే విధంగా గేమ్ ను తీర్చదిద్దడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. టెస్టు, వన్డే, టీ20 లాంటి మల్టిపుల్ ఫార్మాట్లు ఉండటంతో ప్రస్తుతం క్రికెట్ కీలకమైన దశలో ఉందని, అలాగే మహిళా క్రికెట్ ను మరింత డెవలప్ చేయాల్సిన అవసరముందని జై షా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తగా ఆట విస్తరించేందుకు చాలా అవకాశాలున్నాయని, నూతన అవకాశాలను అందిపుచ్చుకుని గేమ్ మరింత విస్తరించేందుకుగాను బోర్డులు, అసోసియేట్ దేశాల సహకారాన్ని తీసుకుంటానని వెల్లడించారు. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ లో 2009లో జై షా తన జెర్నీని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. ముఖ్యంగా జై షా పాలన కాలంలోనే అహ్మదాబాద్ లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం (నరేంద్ర మోదీ స్టేడియం)ను నిర్మించారు. ఇక, 2019లో బీసీసీఐలో కార్యదర్శిగా జై షా కాలు పెట్టారు. అక్కడినుంచి ప్రస్తుతం శక్తివంతమైన ఐసీసీ చైర్మన్ లెవల్ కి ఎదిగారు. జై షాకు ముందు ఐసీసీ చైర్మన్ గా 2020 నుంచి గ్రెగ్ బార్క్లే వ్యవహరించారు. రెండుసార్లు ఈ పదవిని చేపట్టిన బార్ క్లే.. మూడోసారి సంసిద్ధంగా లేకపోవడంతో జై షా రేసులోకి వచ్చారు.

## ఘంటసాల బయోపిక్
## ది గ్రేట్ రిలీజ్ డేట్ పోస్టర్ రిలీజ్

హైదరాబాద్, డిసెంబర్ 2, ఘంటసాల గానం వినని తెలుగు ప్రజలు ఉండాలని చెబితే అస్సలు అతిశయోక్తి కాదు. అమర గాయకుడిగా అందరి హృదయాలలో ఆయన స్థానం ఎప్పటికీ సుస్థిరం. అటువంటి మహనీయుడు జీవితం మీద రూపొందించిన బయోపిక్ 'ఘంటసాల ది గ్రేట్' మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ రోజు రిలీజ్ డేట్ పోస్టర్ లాంచ్ చేశారు.ఘంటసాల వెంకటేశ్వర రావు పాత్రలో గాయకుడు కృష్ణ చైతన్య, ఘంటసాల భార్య సావిత్రి పాత్రలో కృష్ణ చైతన్య భార్య మృదుల నటించగా... 'ఘంటసాల ది గ్రేట్' చిత్రానికి సిహెచ్ రామారావు దర్శకత్వం వహించారు. సతీమణి సిహెచ్ ఫణీతో కలిసి ప్రొడ్యూస్ చేశారు. ఫిబ్రవరి 14న థియేటర్లలోకి సినిమాను తీసుకురానున్నట్లు ఈ రోజు హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో వెల్లడించారు. ఘంటసాల బయోపిక్ చూడడం తెలుగు ప్రజల కర్తవ్యం అని ఎం వెంకయ్య నాయుడు అన్నారు. ఒక సాధారణ వ్యక్తిగా మొదలైన ఆయన ప్రయాణం... భావితరాలకు ఎంతో స్ఫూర్తి ఇచ్చే విధంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఘంటసాల మీద సినిమా తీయడం సాహసం అని పేర్కొన్న వెంకయ్య... ఆర్థికపరమైన విషయాల గురించి ఆలోచించకుండా ప్రజలలో సామాజిక చైతన్యం కలిగించేందుకు, వెండితెరపై ఒక సుమధుర గాయకుడి జీవితాన్ని ఆవిష్కరించేందుకు చేసిన ప్రయత్నంగా ఈ సినిమాను చూడాలని ఆయన వివరించారు.ఘంటసాల కేవలం అమర గాయకుడు మాత్రమే కాదు అని, స్వతంత్ర సంగ్రామంలో దేశం తరఫున పాల్గొన్నారని, అటువంటి మహనీయుని జీవితం మీద ఎటువంటి లాభాపేక్ష లేకుండా రామారావు, ఫణి దంపతులు సినిమా తీశారని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఈ తరం ప్రేక్షకులు ఆయన జీవితం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన చెప్పారు.ఘంటసాలకు భారతరత్న పురస్కారం ఇచ్చి గౌరవించాలని పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి డిమాండ్ చేశారు. ఉత్తరాదిలో కొంత మంది గాయకులకు భారతరత్న ఇచ్చారని, ఘంటసాలకు ఎందుకు ఇవ్వరు? ఆయన ప్రశ్నించారు. తమిళనాడులో ఎంజీ రామచంద్రన్ భారతరత్న అందుకున్నారని, మన తెలుగునాట నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వలేదని, ఆయనకు కూడా ఆ అవార్డు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఘంటసాల గానం గురించి ప్రజలు అందరికీ తెలుసు అని, కానీ ఆయన వ్యక్తిత్వం కొంతమందికి మాత్రమే తెలుసని చిత్ర దర్శకులు సిహెచ్ రామారావు అన్నారు. కృషితో నాస్తి దుర్భిక్షం అని చెప్పడానికి వినయంతో విద్య ప్రకాశిస్తుందని ఉదాహరణ ఇవ్వడానికి నిలువెత్తు నిదర్శనం ఘంటసాల జీవితం అని తెలిపిన ఆయన తమ సినిమాలో ఘంటసాల వ్యక్తిత్వాన్ని, జీవితాన్ని ఆవిష్కరించామని వివరించారు. భారత సినిమా చరిత్రలో ఇప్పటివరకు ఏ గాయకుడు మీద పూర్తిస్థాయి నిడివి ఉన్న సినిమా రాలేదని, ఆ అవకాశం తనకు 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్ ద్వారా కలిగినందుకు ఆ భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని సిహెచ్ రామారావు ముగించారు.

## తగ్గిన కోడి, చికెన్ ధరలు

హైదరాబాద్, డిసెంబర్ 2, కార్తీక మాసం సందర్భంగా ప్రజలు మాంసాహారం తినడం తగ్గించేయడంతో గత నెల రోజులుగా చికెన్ ధరలు తగ్గాయి. తాజాగా, చికెన్ ధర మరింత తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కేజీ చికెన్ ధర రూ.180 నుంచి రూ.220 వరకూ ఉంది. ఒకప్పుడు ఇది రూ.300 నుంచి రూ.350 వరకూ వెళ్లింది. అయితే, వచ్చేది క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి సీజన్ కనుక చికెన్ ధరలు మళ్లీ పెరిగే ఛాన్స్ ఉందని వ్యాపారులు అంటున్నారు.తెలుగు రాష్ట్రాల్లో కోడిగుడ్ల ధరలు మాత్రం భారీగా పెరిగాయి. ఔఇఅఅ హోల్ సేల్ కోడిగుడ్ల ధర రూ.5.90 గా నిర్ణయించగా.. రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6.50 నుంచి రూ.7 వరకూ పలుకుతోంది. ప్రస్తుతం డజన్ కోడిగుడ్ల ధర రూ.80గా ఉంది. చికెన్ ధరలు తగ్గాయని ఆనందించే లోపే గుడ్ల ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. ఏపీ, తెలంగాణల్లో డజన్ కోడిగుడ్ల ధర రూ.80 - రూ.84గా పలుకుతోంది. రానున్న రోజుల్లో కోడిగుడ్ల ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. చలికాలంలో గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంటుందని.. కోళ్ల దాణా రేట్లు, రవాణా ఖర్చులు కూడా ధరలపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

# రైతు భరోసాపై ఆంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 2 తెలంగాణలో తాము అధికారంలోకి రాగానే రైతులకు ఇస్తున్న రైతుబంధు సాయాన్ని రైతు భరోసా కింద పంటకు రూ.7 వేల చొప్పున చెల్లిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి 2023లో ప్రకటించారు. ఏడాది గడిచినా అమలు కాలేదుతెలంగాణలో 2018 నుంచి అప్పటి బీఆర్ఎస్ సర్కార్ రైతులకు రైతుంబంధు పేరుతో పెట్టుబడి సాయం అందించింది. పరిమితితో సంబంధం లేకుండా బీఆర్ఎస్ సర్కార్.. రైతులకు ఎకరాకు రూ.5 వేల చొప్పున పెట్టుబడి అందించింది. గత రబీలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొంత మందికి పెట్టుబడి అందించింది. అయితే గడిచిన ఖరీఫ్ నుంచి రైతులకు పెట్టుబడి అందడం లేదు. పెట్టుబడి సాయంపై పరిమితి విధించాలని రేవంత్ సర్కార్ భావించింది. ఈమేరకు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుచేసి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఖరీఫ్ కాలం పూర్తయినా రైతు భరోసా ఎవరికి ఇవ్వాలో స్పష్టత రాలేదు. ఈ క్రమంలో ఖరీఫ్ పెట్టుబడి లేకుండానే సాగింది. ఇక ఇప్పుడు రబీ సీజన్ మొదలైంది. ఈనేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించక తప్పని పరిస్థితి నెలకొంది. ఒకవైపు విపక్షాలు రైతుబంధు ఎత్తివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఆరోపిస్తున్నాయి. మరోవైపు సంక్రాంతి తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి అనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. రబీ పంటలకు అందించాల్సిన రైతు భరోసా డబ్బులను సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారురైతు భరోసాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏరాపటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో రైతు భరోసా ఎవరికి ఇవ్వాలనే అంశంపై త్వరలోనే విధి విధానాలు ఖరారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా ఎవరెవరికి ఇవ్వాలనే అంశంపై చర్చించి.. విధి విధానాలు ప్రకటించే అవకాశం ఉంది. ఆ తర్వాతే రుణ మాఫీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారని సమాచారంఇదిలా ఉంటే.. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరు రూ.21 వేల కోట్ల రుణాలు మాఫీ చేసింది. రూ.2 లక్షల లోపురుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. గత ఆగస్టు 15 నాటికి రూ.18 వేల కోట్లు మాఫీ చేసింది. తాజాగా నాలుగో విడతలో మరో రూ.3 వేల కోటుల మాఫీ చేసింది. ఈ నేపథ్యంలోనే రైతు భరోసా చెల్లింపు జాప్యం జరిగింది.రైతు భరోసా చెల్లింపు ఆలస్యంపై రైతుల అసంతృప్తితో ఉన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ కూడా సన్న వడ్లకే ఇస్తున్నారు. దీంతో త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలపై ప్రభావం చూసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి తర్వాత నుంచి రైతు భరోసా డబ్బులు చెల్లించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని భావిస్తున్నారు.

### సై అంటే సై అంటున్న టీపీసీసీ బాస్

హైదరాబాద్, డిసెంబర్ 2, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టిన సంక్షేమ పథకాలను మరచి, తెలంగాణ బీజేపీ చార్జిషీట్ ప్రకటించిందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తమ ఏడాది కాలం పాలనపై, అలాగే కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనపై తాము చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ఏడాది కాలవ్యవధిలోనే రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ కు దక్కుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ వ్యాప్తంగా చీకటి పాలన సాగిస్తుందని, తాము చేసే సవాళ్లు స్వీకరించే సత్తా బీజేపీ నేతలకు ఉందా అంటూ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.ఎన్నికలకు ముందు నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి అకౌంట్ కు రూ.15 లక్షల రూపాయలు జమ చేస్తామని హామీ ఇచ్చారని, అంతే కాకుండా 100 రోజుల్లో అన్ని రకాల ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, నేడు ఆ హామీలను తుంగలో తొక్కిన ఘనత బీజేపీకే దక్కుతుందని తెలిపారు. దేశంలో 411 మంది ఎమ్మెల్యేలను వివిధ పార్టీల నుండి బీజేపీలోకి మార్చారని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి చేరికలపై మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు.మతతత్వ రాజకీయాలు చేస్తూ పార్టీలను చీలిస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్న బీజేపీ సుద్దపూస మాటలు మాట్లాడుతుందని ఎద్దేవా చేశారు. ఏడాదిలో తాము ఏమి చేసామో చెప్పేందుకు తాము సిద్ధమని, కానీ 11 ఏళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏమి చేసిందో చెప్పేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ కిషన్ రెడ్డికి సవాల్ విసిరారు.తెలంగాణలో బీజేపీ పూర్తిగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడంతో కొత్తగా చార్జిషీట్ అంటూ బీజేపీ కొత్త రాజకీయాలకు తెర తీసిందని ఆయన విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ తో బీజేపీ అంట కాగుతుండడంతో స్వయాన ప్రధాని మోడీ చివాట్లు పెట్టడంతో తెలంగాణ బిజెపి నేతలకు అర్థం కాని పరిస్థితి ఉందని, అందుకే వారు చార్జిషీట్ అంటూ హడావుడి చేస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కవల పిల్లలని ఎన్నోసార్లు అది రుజువైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్న మాట వాస్తవం కాదా అంటూ కిషన్ రెడ్డిని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. 2014 నుండి 24 వరకు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు ఎన్నిసార్లు పెంచారో చెప్పాలని, లేకుంటే ప్రజల ముందే చర్చకు తాను సిద్ధమంటూ మహేష్ గౌడ్ మరోమారు సీరియస్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రాగానే పెండింగ్ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గృహజ్యోతి రుణమాఫీ, మహిళలకు ఫ్రీ బస్సు ఇలాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినా కూడా బీజేపీ నేతలకు కనిపించని పరిస్థితి ఉందన్నారు. అసలు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందో చర్చించడానికి సిద్ధంగా ఉంటే, కాంగ్రెస్ పార్టీ తరపున తాను చర్చకు వచ్చేందుకు రెడీ అంటూ మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. మరి మహేష్ గౌడ్ కామెంట్స్ కి బీజేపీ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# కేటీఆర్ విరామం బ్రేక్ వెనుకేంటీ..



హైదరాబాద్, డిసెంబర్ 2, కేటీఆర్ రాజకీయాలకు విరామం ప్రకటడం చర్చనీయాంశంగా మారింది. ఆయన అంత సడన్‌గా బ్రేక్ తీసుకోవడంపై పార్టీలో పెద్ద చర్చే జరుగుతుంది.. రాజకీయాలకు తాత్కాలిక విరామం ప్రకటించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ విషయాన్ని ఆయనే ఎక్స్ వేదికగా ప్రకటించారు. వెల్‌నెస్ రిట్రీట్ కోసం కొన్ని రోజులు వెళ్తున్నానంటూ స్పష్టంచేశారు కేటీఆర్. రాజకీయ ప్రత్యర్థులు తనను.. ఎక్కువగా మిస్ కారనే అనుకుంటున్నానంటూ చెణుకులు కూడా విసిరారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత మజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాం హౌస్‌కు పరిమితమైతే.. పార్టీ వ్యవహారాలు, కార్యక్రమాలన్నీ మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులే చక్కబెడుతున్నారు.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అటు పార్టీలో ఇటు ప్రభుత్వంలో నెంబరు టూగా కేటీఆర్ చక్రం తిప్పారు. నెక్స్ట్ సీఎంగా పార్టీలోని భజనపరులు ఆయన్ని ఫోకస్ చేసుకున్నారు. కేసీఆర్ కూడా తన తనయుడికే ప్రాధాన్యత ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించుకుంటూ వచ్చిన హరీష్‌రావు.. ఇప్పుడు పార్టీపై గ్రిప్ కోసం స్పీడ్ పెంచుతున్నారు. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ పార్టీలో కేటీఆర్‌కి చెక్ పెట్టడానికి చూస్తున్నారంట. దాంతో అలెర్ట్ అయిన కేటీఆర్ తానే నెంబర్ టూ అనిపించుకోవడానికి హడావుడి మొదలు పెట్టినట్లు కనిపించారు.పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ తిరిగి పోరుబాట పట్టలేరని. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో వయస్సు, ఆరోగ్యం కూడా కేసీఆర్‌కు సహకరించవన్న సంగతి హరీష్‌రావుకి తెలియని సంగతి కాదంటున్నారు. అటు కేటీఆర్‌ను చూస్తే కేసీఆర్ తరహాలో రాజకీయం చేయలేరు. హరీష్ స్టైల్లో దూకుడు ప్రదర్శించలేరన్న టాక్ ఉంది. అందుకే ప్రతిపక్షంలో ఉండే ఈ అయిదేళ్లు అటు క్యాడర్ ఇటు ప్రజలలో తన ఇమేజ్ మరింతపెంచుకునే దిశగా హరీష్ అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నారు.అది గమనించారో ఏమో కేటీఆర్ అలెర్ట్ అయ్యే ప్రయత్నాలు చేశారు. ఈ మధ్య ఆయన బయటకు వస్తే భజనపరులు సీఎం, సీఎం అంటూ స్లోగన్స్‌తో హోరెత్తిస్తున్నారు. అదంతా అరెంజ్డ్ డ్రామానే అని ఫ్యూచర్‌లో పార్టీకి తానే దిక్కని చెప్పుకోవడానికి కేటీఆరే ఆ మెలో డ్రామా నడిపిస్తున్నారన్న వాదన వినిపించింది. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ మనుగడ ఏంటో ఆ పార్టీ నేతలకే అంతుపట్టడం లేదు. మరిలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ సీఎం ఆశలపై సెటైర్లు వినిపిస్తున్న తరుణంలో ఆయన సడన్‌గా రాజకీయాలపైనే విరక్తి ప్రకటించడం హాట్ టాపిక్‌గా మారింది.కేటీఆర్ అలిగారని అందుకే అందుకే పార్టీకి సెలవు పెట్టారంటున్నారు. సభలు, సమావేశాల్లో సీఎం సీఎం అంటూ ఫ్యూచర్ లీడర్ తానే అంటూ అనుచరులతో నినాదాలు చేయించుకుంటున్నారు కేటీఆర్.. తాజాగా పార్టీ ఆఫీసుకి వచ్చినప్పుడు కూడా పెద్దపెద్ద గజమాలలతో హడావుడి చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా.. వచ్చే వారమంతా సంబరాలు జరగనున్నాయి. వాటిపై కౌంటర్ ఇవ్వాల్సిన టైమ్‌లో కేటీఆర్ అస్త్ర సన్యాసం చేశారు. ఆయన సడన్‌గా పొలిటికల్ బ్రేక్ తీసుకోవడం వెనుకపెద్దకారణం ఉంది. ఒకవైపు బావ హరీష్‌రావుతో పార్టీలో ఆధిపత్యపోరుతో సతమతమవుతుంటే.. చెల్లెలు ఎమ్మెల్సీ కవిత కూడా పొలిటికల్‌గా రీ యాక్టివ్ అవుతుండటం కేటీఆర్‌కు నచ్చడం లేదంట. గత పది రోజులుగా యాక్టివ్ అయిన కేటీఆర్ చెల్లెలు కవిత తన జాగృతి టీమ్‌ని గాడిలో పెడుతున్నారు. నెలల తరబడి లిక్కర్ స్కామ్ కేసులోలో జైలు జీవితం గడిపి బెయిల్ వచ్చాక రెండు నెలల పాటు ఇంటికే పరిమితమైన కవిత. ఇక రాజకీయాలకు దూరంగా ఉంటారని అప్పట్లో ప్రచారం జరిగింది. జైల్లో అనారోగ్య సమస్యలకు గురైన ఆమె ఇక పాలిటిక్స్‌లో కనిపించరనుకుంటున్న టైంలో సడన్‌గా యాక్టివ్ అయ్యారు.కవిత రీఎంట్రీపై కేటీఆర్ ఆగ్రహంతో ఉన్నారంట. కవిత మళ్లీ రాజకీయాల్లోకి రావడానికి వీల్లేదంటూ పంతం పట్టిన కేటీఆర్ .. అదే విషయమై తండ్రి కేసీఆర్ తోనూ గొడవ పడ్డారంట .. అయతే కేటీఆర్ మాటలను కేసీఆర్ పట్టించుకోలేదంటున్నారు. మరోవైపు అన్న మాటలను కవిత కూడా లెక్కచేయడం లేదంట. అలా ఫ్యామిలీలో తన మాట చెల్లుబాటు కాకపోవడంతో అలిగిన కేటీఆర్‌కు సడన్‌గా కేరళలో ప్రకృతి వైద్యం గుర్తుకొచ్చిందంటున్నారు.తన మాట చెల్లనప్పుడు కేటీఆర్ అలగడం మామూలే అని ఆయన సన్నిహితులు చెప్తున్నారు.. ఎన్నికల ముందు కూడా తాను కోరిన వారికి టికెట్లు ఇవ్వనందుకు అలిగి యూఎస్ వెళ్లిన విషయం గుర్తు చేస్తున్నారు. ఇక ఎన్నికల తర్వాత కేటీఆర్‌ను గ్రేటర్ పార్టీకి పరిమితమవ్వమని, జిల్లాల్లో బీఆర్ఎస్ బాధ్యతలు హరీష్ రావు చూసుకుంటారని కేసీఆర్ చెప్పారంట. అప్పుడు కూడా కేటీఆర్ అలిగి తండ్రి ఫాం హౌస్ నుంచి వెళ్లిపోయారంట.చెల్లి విషయంలో కేటీఆర్ అలకేంటో కాని.. లగచర్లలో మళ్లీ భూసేకరణ నోటిఫికేషన్ వచ్చిన సమయంలో ఆయన ఎలా వెళ్లిపోతారన్న చర్చ పార్టీలో జరుగుతుంది. కొన్ని రోజుల పాటు ఎవరికీ అందుబాటులో ఉండననే మీనింగ్ వచ్చేలా కేటీఆర్ పెట్టిన ట్వీట్‌పై టీఆర్ఎస్ భవన్లో పెద్ద చర్చే జరుగుతుందిప్పుడు. వెల్‌నెస్ ట్రీట్‌మెంట్‌కి వెళ్తే రాజకీయాలల్లో బ్రేక్ తీసుకోవడమేంటని గులాబీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. మొత్తానికి ఎప్పుడూ సైలెంట్‌గా అలిగే కేటీఆర్.. ఇప్పుడు ట్వీట్ పెట్టి మరీ తన రిటైర్‌మెంట్ ప్రకటించి గులాబీ శ్రేణులకు మంచి షాకే ఇచ్చారు.

# నిఖేష్ ఆస్తులు...

# ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద ఆపరేషన్

హైదరాబాద్, డిసెంబర్ 2, తెలంగాణలో ఇప్పుడు ట్రెండింగ్ టాపిక్.. ఇరిగేషన్ ఏఈఈ నిఖేష్ ఆస్తులు ఎంత.. అవును ఎవరి నోట విన్నా ఇదే మాట వినిపిస్తోంది. అటు మరో విషయం వైరల్ అవుతోంది. ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద ఆపరేషన్ అని అధికారులు చెబుతున్నారు. ఇటు ఏసీబీ దాడుల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఇరిగేషన్ ఏఈఈ నిఖేష్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది ఏసీబీ చరిత్రలోనే రెండో అతిపెద్ద ఆపరేషన్ అని అధికారులు చెబుతున్నారు. బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి.. కోట్లాది రూపాయలు కూడబెట్టాడు ఏఈఈ నిఖేష్‌కుమార్. అతని ఆస్తుల మార్కెట్ విలువ రూ.600 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.నానక్‌రాంగూడ, శంషాబాద్, గచ్చిబౌలిలో విల్లాలు, నార్సింగిలో నాలుగు అంతస్తుల హాస్టల్ భవనం, మొయినాబాద్‌లో మూడు ఫామ్‌హౌస్‌లు, తాండూరులో మూడు ఎకరాలు ఉన్నట్టు ఏసీబీ తేల్చింది. ఇవే కాకుండా ఇంకా నిఖేష్ బంధువుల పేర్లపైనా ఆస్తులు ఉన్నట్టు తెలుస్తోంది. అతి త్వరలో వారి లాకర్లను ఏసీబీ తెరవనుంది. ఇప్పటికే నిఖేష్ బంధువుల ఇళ్లలో కిలో బంగారంస్వాధీనం చేసుకున్నారు. నిఖేష్‌కుమార్ బినామీ ఆస్తులు గుర్తించే పనిలో పడ్డారు,నిఖేష్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఆయన్ను అధికారులు అదుపులోకి తీసుకుని నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఉదయం 6 గంటలకు న్యాయమూర్తి నివాసంలో హాజరుపర్చారు. జడ్జి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. ఏసీబీ అధికారులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.శనివారం ఉదయమే ఏసీబీ అధికారులు నికేష్ కుమార్ ఇంటికి వెళ్లారు. ఆయన సమక్షంలోనే సోదాలు ప్రారంభించారు. మరికొన్ని బృందాలు మొయినాబాద్ మండలం తోల్కట్ట, సజ్జన్‌పల్లి, నక్కలపల్లి ఫాంహౌస్‌లలో, అతని బంధువులు, సన్నిహితులకు సంబంధించిన 19 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. ఈ సోదాల్లో అక్రమాస్తుల దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిఖేష్‌ను అరెస్టు చేసినట్లు ఏసీబీ వెల్లడించింది.గండిపేట ఏఈఈగా పనిచేస్తున్న నిఖేష్ అనూహ్య పరిస్థితుల్లో మే 30న ఏసీబీకి చిక్కి కటకటాల పాలయ్యాడు. నిఖేష్ కుమార్ ఉద్యోగంలో చేరి పదేళ్లు కూడా కాలేదు. కానీ.. అతని అవినీతి సంపాదన రోజుకు లక్షల్లోనే ఉంటుందట. నిఖేష్ గతంలో.. వరంగల్, తాండూరులలో పనిచేశాడు. గండిపేటలో ఎక్కువ కాలం విధులు నిర్వర్తించాడు. గండిపేటలో పనిచేయడంతో నిఖేష్‌కు బాగా లంచాలు వచ్చాయి.నిఖేష్ దగ్గరకు ఏ ఫైల్ వచ్చినా.. అది అక్రమమైనా సక్రమం అవుతుందనే టాక్ ఉంది. బఫర్ జోన్ అయినా.. ఎఫ్‌టీఎల్ అయినా సరే ఎన్‌వోసీ తీసుకొస్తాడని ప్రచారం జరుగుతోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇళ్లకు, గేటెడ్ కమ్యూనిటీలకు, భవనాల నిర్మాణాలకు అనుమతులిచ్చేది హెచ్ఎండీఏ. కానీ.. నీటిపారుదల శాఖ ఇచ్చే ఎన్‌వోసీనే కీలకం. సరిగ్గా ఇదే పాయింట్‌ను నిఖేష్ క్యాష్ చేసుకున్నాడు. కోట్లు కూడబెట్టాడు.

# తెలంగాణలో తగ్గిన నిరుద్యోగం...

హైదరాబాద్, డిసెంబర్ 2, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులతో పాటు నియామకాల్లో అన్యాయం జరుగుతోందని నిరుద్యోగులు ఆందోళన చెందేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఉద్యమాలు, ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను సాధించుకున్నారు. 2014లో సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణకు అనుమతి ఇవ్వగా? ఉద్యమ పార్టీగా టిఆర్ఎస్ ఇప్పటి బీఆర్ఎస్ భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చింది.అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే కాకుండా తాను ఆ మాటే అనలేదని ఇంటికో ఉద్యోగం అసలు సాధ్యమయ్యే ముచ్చట కాదని మాట మార్చారు. కేసీఆర్ మాటలతో నిరుద్యోగుల ఆశలన్నీ ఆవిరైపోయాయి. 2014 నుండి 2018 వరకు ఉద్యోగ నియామకాల కోసం వేచి చూసి నిరుద్యోగులు నిరాశ చెందారు. అయినప్పటికీ 2018లో మరోసారి టీఆర్ఎస్ కు అధికారమిచ్చి ఉద్యోగాల కోసం ఎదురుచూశారు.అయినప్పటికీ ప్రభుత్వం తీరులో మార్పు రాలేదు. పదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్-1 పరీక్షను నిర్వహించకుండా అసమర్ధ పాలనతో బీఆర్ఎస్ చరిత్రలో నిలిచిపోయింది. పక్క రాష్ట్రాల్లో మూడు నాలుగు డీఎస్సీలు నిర్వహిస్తే తెలంగాణలో కేవలం ఒకే ఒక్క డీఎస్సీ నిర్వహించారు. మరోవైపు పేపర్ లీకేజీలు నిరుద్యోగులను తీవ్ర ఆగ్రహానికి, ఆందోళనకు గురి చేశాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ను గద్దె దింపాలని నిరుద్యోగులు నిర్ణయించుకున్నారు.తన కుటుంబంలోని వ్యక్తులందరికీ ఉద్యోగాలు ఇచ్చిన కేసీఆర్ నిరుద్యోగులను పట్టించుకోకపోవడంతో మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గద్దె దింపి తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు హామీలు ఇచ్చింది. దీంతో నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. ఎన్నికల్లో ముందుండి నడిపించి కాంగ్రెస్ పార్టీని విజయతీరానికి చేర్చారు. అధికారంలో వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ పార్టీ ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు, గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకు ఎలాంటి అవకతవకలు జరగకుండా వీలైనంత త్వరగా జాయినింగ్ లెటర్లు ఇచ్చింది.మరోవైపు ప్రైవేట్ సెక్టార్ లోను ఉద్యోగ అవకాశాలు పెంచుతోంది. తాజాగా వచ్చిన ఓ నివేదిక ప్రకారం ఆరు నెలలోనే రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టింది. చదువుకుంటున్న 15 నుండి 29 ఏళ్ల యువతలో నిరుద్యోగం తగ్గుముఖం పట్టినట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది జూలై సెప్టెంబర్ తో పోలిస్తే నిరుద్యోగ రేటు 22.9శాతం నుండి 18.1 శాతానికి తగ్గినట్టు జాతీయ కార్మిక బలగం త్రైమాసిక నివేదికలో వెల్లడైంది. ఆరు నెలలుగా ఉద్యోగ అవకాశాలు పెరగడంతో యువతకు ఉపాధికి లభిస్తోందని నివేదిక పేర్కొంది.అన్ని వయసుల వారిని పరిగణంలోకి తీసుకుంటే ఉద్యోగ రేటు 6.6% ఉందని నివేదిక పేర్కొంది. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే సగటు నిరుద్యోగ రేటులో కేరళ 10.1%తో ముందు వరుసలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 7.3%తో రెండో స్థానంలో ఉంది. ఇక తెలంగాణ 10వ స్థానంలో ఉంది. ప్రజాప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకుంటూ ఇదే విధంగా పాలనకొనసాగిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగం మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీంతో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరే అవకాశం ఉంది.

# 33 ఏళ్ల తర్వాత పోలీసుల ప్రతీకారం

వరంగల్, డిసెంబర్ 2, ములుగు జిల్లా చల్పాక ఫారెస్ట్ ఏరియాలో జరిగిన ఎన్ కౌంటర్ లో 7గురు మావోయిస్టులు హతమయ్యారు. 33 ఏళ్ల క్రితం మావోయిస్టుల దాడిలో ఈ ప్రాంతంలోనే 7గురు పోలీసులు మరణించారు. సరిగ్గా ఇప్పుడు ఏడుగురు మావోలు ఎన్ కౌంటర్ లో మరణించడంతో.... పోలీసులు రివేంజ్ తీసుకున్నారనే చర్చ జరుగుతోంది.ములుగు జిల్లా చల్పాక ఎన్ కౌంటర్ తో పోలీసులు మావోయిస్టులపై రివేంజ్ తీర్చుకున్నారా? అంటే అవుననే చర్చ జరుగుతోంది. 33 ఏళ్ల కిందట మావోయిస్టులు మందు పాతర పేల్చడం.. అందులో ఏడుగురు పోలీస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం.. ఇప్పుడు సేమ్ అదే తీరుగా పోలీసులు ఏడుగురు మావోయిస్టులను ఎన్ కౌంటర్ చేయడం.. ఈ రెండు ఘటనల స్పాట్ కూడా చల్పాక ఫారెస్ట్ ఏరియానే కావడంతో ప్రతీకార దాడుల చర్చ నడుస్తోంది. మందు పాతర పెట్టి పోలీస్ జీపును పేల్చేసిన ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపగా.. ఇప్పుడు అదే ప్రాంతంలో ఏడుగురు మావోలు ఎన్ కౌంటర్ కావడం ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల కూడా ములుగు జిల్లా వాజేడు మండలంలో ఇద్దరు యువకులను ఇన్ ఫార్మర్ నెపంతో మావోయిస్టులు నరికి చంపగా, కొంతకాలంగా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న పోలీసులు రివేంజ్ దాడులు మొదలు పెట్టారనే ప్రచారం జరుగుతోంది.ములుగు జిల్లా చల్పాక ఫారెస్ట్ ఏరియా సమీపంలో 1991, జూన్ 12వ తేదీన దారుణ ఘటన చోటుచేసుకుంది. రాజీవ్ గాంధీ హత్య అనంతరం జరిగిన లోక్ సభ ఎన్నికల సమయంలోనే ఈ ఘటన జరిగింది. లోక్ సభ ఎన్నికల కోసం చల్పాక వద్ద పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. జూన్ 12న ఇక్కడ పోలింగ్ జరగాల్సి ఉంది. కాగా అప్పటికే రాష్ట్రంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండగా, చల్పాక పోలింగ్ కేంద్రంలోని బ్యాలెట్ బాక్స్ లో మావోయిస్టులు సిరా పోశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందేలా చేసి, వారిని గ్రామానికి రప్పించే ప్రయత్నం చేశారు. దీంతో అప్పటి ఏటూరు నాగారం సీఐ సంతోష్ కుమార్, ఎస్సై కిషోర్ కుమార్, మరో ఐదుగురు సీఆర్పీఎఫ్ సిబ్బంది జీపులో చల్పాక గ్రామానికి బయలు దేరారు. అప్పటికే తమ పథకంలో భాగంగా పోలీసులు వచ్చే మార్గంలో మావోయిస్టులు భారీ మందు పాతర అమర్చారు. అనంతరం పోలీసు జీపు ఆ మార్గంలో స్పాట్ కు చేరుకోగానే మావోయిస్టులు మందు పాతర పేల్చేశారు. దీంతో ఏటూరు నాగారం సీఐ సంతోష్ కుమార్, ఎస్సై కిషోర్ కుమార్, ఐదుగురు సీఆర్పీఎఫ్ పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తంగా ఏడుగురు పోలీస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోగా.. ఈ ఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా కలకలం సృష్టించింది.1991 జూన్ 12న మందు పాతర పేలి ఏడుగురు పోలీసులు మృత్యువాత పడిన ఘటన జరిగి.. 33 ఏళ్లు పూర్తయ్యింది.

ఇప్పుడు అదే చల్పాక సమీపంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎన్ కౌంటర్ జరగగా.. ఈసారి ఏడుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అందులో మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న, జిల్లా కమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు అలియాస్ కోటి, ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి కరుణాకర్ అలియాస్ దేవల్, జమున, జైసింగ్, కిషోర్, కామేష్ హతమైన విషయం తెలిసిందే. దీంతో అప్పుడు ఏడుగురు పోలీసులు, ఇప్పుడు ఏడుగురు మావోయిస్టులు హతమవడం.. రెండు ఘటనల స్పాట్ కూడా చల్పాక ఫారెస్ట్ ఏరియానే కావడంతో పోలీసులు నాటి ఘటనకు రివేంజ్ తీర్చుకున్నారనే చర్చ జరుగుతోంది.

# చెంచుల జీవన స్థితిగతులను మారుస్తాం

నాగర్ కర్నూలు అడవులను రక్షిస్తూ నే అడవులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న చెంచుల జీవన స్థితిగతులను మార్చేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, శ్రీ శివు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల్ల అడవి ప్రాంతంలో నీ చెంచులకు సిపిఎం ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తో కలిసి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరితగతిన అంతరించిపోతున్న ఆదిమ జాతి చెంచు బిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. అడవులను రక్షించడంతోపాటు అడవిని నమ్ముకుని జీవిస్తున్న చెంచులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అమ్రాబాద్ నల్లమల్ల ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను టూరిజం హబ్ లోకి తీసుకువెళ్లి సీఎం రేవంత్ రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక చెంచు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మల్లెల తీర్థం పర్యాటక ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. నల్లమల్ల కు వచ్చిన మంత్రి సీతక్కకు స్థానిక ఆదివాసి గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు..

# ఓరుగల్లు కమలంలో కలహాలు...

వరంగల్, డిసెంబర్ 2, రుగల్లు బీజేపీలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీలోని నేతల మధ్య అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. జిల్లా అధ్యక్షురాలు లేకుండానే మిగతా నేతలు కలిసి కాజీపేట్ రైల్వే కోచ్ పై సంబరాల కార్యక్రమం చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై అధినాయకత్వానికి కూడా ఫిర్యాదు అందినట్లు తెలిసింది.ఓరుగల్లు బీజేపీలో కొద్దిరోజులుగా కోల్డ్ వార్ నడుస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షురాలికి, ఇతర నేతలకు మధ్య అంతర్గ విభేదాల కారణంగా సయోధ్య కుదరడం లేదని తెలుస్తోంది. ఇందులో మాజీ ఎమ్మెల్యేలతో పాటు ఎలక్షన్స్ టైమ్ లో పార్టీ చేరిన నేతలంతా ఒక వైపుంటే.. పార్టీ జిల్లా అధ్యక్షురాలు మరో వైపున్నట్లు స్పష్టమవుతోంది. కాజీపేటలోని వ్యాగన్ మ్యానుఫ్యాక్షరింగ్ యూనిట్ ను కోచ్ ఫ్యాక్టరీ గా అప్ గ్రేడ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. సంబరాలు జరుపుకునే సందర్భంలోనే ఈ విషయం బయటపడింది. కొద్దిరోజుల్లోనే పంచాయతీ ఎలక్షన్స్ జరగనున్న తరుణంలో ఓరుగల్లు బీజేపీ నేతల తీరుపై చర్చ జరుగుతోంది. ఓ వైపు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఫీల్డ్ లో బలమైన క్యాడర్ ను కలిగి ఉన్న బీఆర్ఎస్ కు పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ పోటీ ఇవ్వగలదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా ప్రస్తుతం రావు పద్మారెడ్డి కొనసాగుతున్నారు. కొంతకాలంగా పార్టీని బలోపేతం చేస్తూ క్యాడర్ ను కాపాడుకునే ప్రయత్నం చేయడమే కాకుండా.. గత ప్రభుత్వ హయాంలో ఏ సందర్భం వచ్చినా నిరసనలు, ఆందోళనలతో పార్టీని జిల్లాలో యాక్టీవ్ చేశారు. దీంతో గత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 10 కార్పొరేటర్ స్థానాలు గెలవడంలో కీలక పాత్ర పోషించారు. ఇంతవరకు బాగానే ఉండగా.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రావు పద్మారెడ్డి వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి చవి చూశారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గం జనరల్ స్థానం కాగా.. ఆ టికెట్ కోసం రావు పద్మారెడ్డితో పాటు మార్తినేని ధర్మారావు, చాడ శ్రీనివాస్ రెడ్డి, మరికొందరు నేతలు పోటీ పడ్డారు. కానీ అధిష్టానం రావు పద్మారెడ్డికి టికెట్ కేటాయించడంతో ఆశావహులంతా నిరాశకు గురయ్యారు. ఇదిలాఉంటే 2018లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన మార్తినేని ధర్మారావు 5,979 ఓట్లు సాధించగా.. గతంలో ఎన్నడూ లేనంతగా 2023 శాసనసభ ఎలక్షన్స్ లో రావు పద్మారెడ్డి 30 వేల మార్క్ దాటింది. మొత్తంగా 30,826 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. కాగా పార్టీలో ఉన్న కొందరు నేతలు కూడా ఆమె ఓటమికి కారణమయ్యారనే టాక్ నడిచింది. అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యేలంతా ఒక్కటయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఆ తరువాత ఎంపీ ఎలక్షన్స్ జరగగా.. వరంగల్ ఎస్సీ రిజర్వ్ స్థానం కావడంతో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన అరూరి రమేష్ కు పోటీ చేసే అవకాశం దక్కింది. ఎంపీ ఎన్నికల్లో ఓటమి తరువాత ఆయన కూడా మాజీల చెంతనే చేరాడనే ప్రచారం ఉంది.కాజీపేటలో నిర్మిస్తున్న వ్యాగన్ మ్యానుఫాక్షరింగ్ యూనిట్ ను కేంద్ర ప్రభుత్వం నవంబర్ 28న 'ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ'గా అప్ గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం కోచ్ ఫ్యాక్టరీ ఇచ్చిందన్న ఉద్దేశంతో 30వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు జరిపేందుకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ నేతలకు కూడా సమాచారం ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉండగా.. పార్టీ జిల్లా అధ్యక్షురాలిని పక్కన పెట్టేసి 29వ తేదీనే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన అరూరి రమేశ్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, మాజీ మేయర్ రాజేశ్వరరావు, ఇతర నేతలంతా కోచ్ ఫ్యాక్టరీ నిర్మించనున్న అయోధ్యపురం స్థలాన్ని పరిశీలనకు వెళ్లారు. జిల్లా అధ్యక్షురాలు లేకుండానే కాజీపేట మీడియా పాయింట్ లో ప్రెస్ మీట్ కూడా నిర్వహించారు. వారితో పార్టీ జిల్లా అధ్యక్షురాలు కనిపించకపోవడం పట్ల చర్చ జరగగా.. 30వ తేదీన రావు పద్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సంబరాల కార్యక్రమాన్ని రద్దు చేశారు. దీంతో పార్టీలో అంతర్గత విభేదాలున్నాయనే విషయం బయట పడింది.కోచ్ ఫ్యాక్టరీ సంబరాలతో బీజేపీలో విభేదాలు బయట పడగా.. తనను కాదని పాలాభిషేకాలు, ఇతర సెలబ్రేషన్స్ నిర్వహించిన నేతల పట్ల రావు పద్మారెడ్డి అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. జిల్లా అధ్యక్షురాలి ప్రొటోకాల్ పాటించకుండా తనకు ప్రాధాన్యం ఇవ్వకుండా సంబరాలు జరిపిన విషయాన్ని రావు పద్మారెడ్డి పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అందరూ కలిసి ముందుకెళ్లాలని సూచించినట్లు సమాచారం. ఇదిలాఉంటే పార్టీ జిల్లా నేతల మధ్య అంతర్గత విభేదాలు.. క్షేత్రస్థాయిలో సరైన నాయకత్వం లేదనే అభిప్రాయాలు వినిపిస్తుండగా.. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ ఏమాత్రం ప్రభావం చూపుతుందోననే చర్చ జరుగుతోంది. ఇప్పటికే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, రూట్ లెవల్ లో బలమైన క్యాడర్ తో బీఆర్ఎస్ పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం అవుతుండగా.. బీజేపీ పరిస్థితి ఎలా ఉంటుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్

## -నేడు ఆయన వర్ధంతి




హాకీ వీరుడుగా, హాకీ మాంత్రికుడుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేజర్ ధ్యాన్ చంద్ 29 ఆగస్టు 1905న ప్రయాగలో జన్మించారు. ఆయన జయంతి రోజుని జాతీయ క్రీడా దినంగా మనం జరుపుకుంటాం.1926 నుంచి 1948 వరకు 22 సంవత్సరాలలో ఆయన కెరీర్‌లో 400 అంతర్జాతీయ గోల్స్ కలిపి మొత్తం 1,000 గోల్స్ సాధించాడు. ధ్యాన్ చంద్ నాయకత్వంలో, భారత హాకీ జట్టు అనేక విజయాలు సాధించింది.ఆయన 1928, 1932, 1936లో భారతదేశానికి 3 ఒలింపిక్ బంగారు పతకాలు సాధించంలో ముఖ్య పాత్ర పోషించాడు. మూడు సార్లు వరుసగా ఒలింపిక్ బంగారు పతకాన్ని గెలుచుకొని తన పేరు చరిత్ర పుటలలో ఎక్కించుకున్నారు. తన క్రీడా పాటవం ద్వారా ప్రపంచదేశాలలో భారత విజయ పతాకాన్ని రెపరెపలాడించినధ్యాన్ చంద్ జీవిత విశేషాలను కొన్నింటినిగుర్తుచేసుకుందాం.1. 1928లో అంస్టర్డామ్, 1932 లాస్ ఏంజిల్స్, 1936 బెర్లిన్ లలోజరిగిన ఒలంపిక్ క్రీడలలో ధ్యాన్ చంద్ నాయకత్వంలోని హాకీజట్టుస్వర్ణపతకాలను సాధించింది. ఈ క్రీడలలో జరిగిన మొత్తం 48 మ్యాచ్ లనూ భారత హాకీ జట్టుగెలుపొందడం విశేషం. భారత హాకీజట్టుకి ప్రపంచంలో 20 ఏళ్ళ పాటుఎదురే లేకపోయింది. భారత్ తో తలబడిన అన్ని మ్యాచ్లలోనూ అమెరికా అతి ఘోరంగా పరాజయం పాలయ్యింది. ఇదిజీర్ణించుకోలేని అమెరికా కొన్నేళ్ళ పాటు దేశంలో హాకీనినిషేధించింది. ఇంతకన్నా అద్భుత విజయం ప్రపంచక్రీడారంగంలో ఇంకేముంటుంది?. జర్మన్ తో జరిగిన ఒక మ్యాచ్ లో జర్మన్ గోల్ కీపర్ధ్యాన్ చంద్ ని బాగా గాయపరిచాడు. ఇందుకు తగినవిధంగా బదులు తీర్చుకోవాలని ధ్యాన్ చంద్ తనజట్టుకి సూచించేడు. అంతే .. ప్రతిసారీ బంతిని భారతజట్టు గోల్ దాకా తీసుకువెళ్ళి గోల్ చెయ్యకుండావదిలేసింది. భారత క్రీడాకారులు ఇలా చెయ్యడంతో జర్మన్ క్రీడాకారులకు, జర్మన్ ప్రేక్షకులకు తలకొట్టేసినట్లయ్యింది. జర్మన్ నియంత హిట్లర్ ఆ ఆటను ప్రత్యక్షంగా తిలకిస్తున్నాడు. హిట్లర్ సాక్షిగా జర్మన్ ఆటగాళ్ళను సవాలు చేయడం అక్కడున్నవారందరినీ ఆశ్చర్యపరిచింది. ధ్యాన్ చంద్ చూపిన తెగువ హిట్లర్ ని ఆకర్షించింది. ధ్యాన్ చంద్ కి జర్మన్ నియంత హిట్లర్ వీరాభిమాని. తనదేశం తరఫున ఆడమనీ, జర్మన్ పౌరసత్వం ఇస్తాననీ, కోరినంత ధనం ఇస్తాననీ, తన సైన్యంలో పెద్దహోదా ఇస్తాననీ హిట్లర్ ధ్యాన్ చంద్ ని ఆహ్వానించాడు. కానీధ్యాన్ చంద్ తాన దేశం కోసమే గాని డబ్బు కోసం ఆడటంలేదనీ చెప్పి హిట్లర్ ఆహ్వానాన్ని తిరస్కరించాడు. మనదేశానికి స్వాతంత్ర్యం రాక ముందే భారతజయకేతనాన్ని దేశం వెలుపల (జర్మనీలో) ఎగురవేసిన ఏకైక భారతీయుడు ధ్యాన్ చంద్. మన దేశాన్ని పరిపాలిస్తున్న బ్రిటిష్ వారు మన పతాకాన్ని ఇతర దేశాలకు తీసుకెళ్ళనిచ్చేవారు కాదు. కానీ ధ్యాన్ చంద్ ఎవరు గుర్తించకుండా తన నైట్ డ్రెస్ లో జెండాని దాచి జర్మనీలో ఎగురవేయడానికి తీసుకెళ్ళాడు. ఇందుకు ఎంతో ధైర్యం కావాలి. జర్మనీలో భారత పతాకాన్ని ఎగురవేయడంపై ఆగ్రహించిన బ్రిటిష్ ప్రభుత్వం ధ్యాన్ చంద్ ని అరెస్టుచెయ్యాలని ప్రకటించింది. అయితే జర్మనీలో ధ్యాన్చంద్ అరెస్ట్ కాబడకుండా హిట్లర్ జాగ్రత్తలు తీసుకున్నాడు. క్రీడారంగంలో భారతదేశానికి అంతర్జాతీయంగా ఖ్యాతినార్జించి పెట్టిన ధ్యాన్ చంద్ తన చివరి రోజులలోఎటువంటి గుర్తింపు లేకుండా కడు దుర్భరజీవితాన్ని గడిపేడు. పొట్ట నింపుకోవడానికి కూడా సరిపడ డబ్బుల్లేని పేదరికంలో జీవించేడు. అటువంటిసమయంలో తమ దేశాలలోని హాకీ జట్టులకు శిక్షణనివ్వమంటూ అమెరికా, జర్మనీలు ధ్యాన్ చంద్ ని ఆహ్వానించేయి. పరాయి దేశాలకు శిక్షణనివ్వడం ద్వారా భవిష్యత్తులో భారత క్రీడాకారులకు విజయాలను దూరం చెయ్యలేనని చెప్తూ ధ్యాన్ చంద్ ఆ ఆహ్వానాలను త్రోసిపుచ్చేడు. ఇటువంటి గొప్పదేశభక్తుడిని స్వతంత్ర భారత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం విచారకరం. చివరి రోజులలో ఇండియన్ ఆర్మీ అతనిని ఆదుకుంది. ఒకసారి అహ్మదాబాదులో జరిగిన హాకీ మ్యాచ్ చూడటానికి ధ్యాన్ చంద్ వెళ్తే అతనిని గుర్తించకపోవడం వల్ల స్టేడియం లోనికి వెళ్ళనివ్వలేదు. అదే స్టేడియంలో ఆమ్యాచ్ ని జవహర్లాల్ నెహ్రూ తిలకిస్తూన్నాడు. మన దేశంలో ఏమాత్రం గుర్తింపుకు నోచుకోని ధ్యాన్చాంద్ ని స్వాతంత్ర్యానికి పూర్వమే ఏభైకి పైగా దేశాలు 400కి పైగా అవార్డులతో సత్కరించేయి. 1979 డిసెంబర్ 3 న ధ్యాన్ చాంద్ స్వర్గాస్తులయ్యారు.

# 17,85,000 విలువగల అరవై కిలోల గంజాయి ని పట్టుకున్న సైబరాబాద్ యస్ఓటీ పోలీసులు

హైదరాబాద్ సైబరాబాద్ యస్ఓటీ పోలీసులకు నమ్మకమైన సమాచారం అందడంతో చందానగర్ పోలీసులతో కలిసి ఒరిస్సా నుండి వస్తున్న మహీంద్రా కారును చందానగర్ లోని గంగారం చెరువు వద్ద ఆపి లోపల తనిఖీ చేసి కార్ ఇంజన్ లో ఉన్న కాళి స్థలం లో అలాగే కార్ డోర్ లలో దాచి ఉంచిన 60 కిలోల ప్యాకెట్లను (విలువ రూ17,85,000) స్వాధీనం చేసుకున్నారు.
చమన్, శివ్వంపేట ఉమాకాంత్,అర్జున సాయి కృష్ణ లను అదుపులోకి తీసుకున్నారు. రాకేష్ ఏ దాస్ పరారీలో వున్నాడు.

## సినిమా





# 'లూసిఫర్ 2' షూటింగ్ పూర్తి



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృధ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'లూసిఫర్' 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకు సీక్వెల్ 'లూసిఫర్2: ఎంపురాన్ (రాజు కన్నా గొప్పవాడు)' షూటింగ్ పూర్తయిందని మోహన్‌లాల్ తాజాగా పోస్ట్ పెట్టారు. "సినిమా చిత్రీకరణ ముగిసింది. 14 నెలల సమయం.. ఎనిమిది రాష్ట్రాలు.. అమెరికా, బ్రిటన్, యుఎఇ సహా దాదాపు నాలుగు దేశాలు.. ఇదొక అద్భుతమైన ప్రయాణం. ప్రతి ఫ్రేమ్‌ని ఎలివేట్ చేసే సృజనాత్మకత పృధ్వీరాజ్ సుకుమారన్ సొంతం. స్క్రీన్ ప్లేతో ఈ కథకు ప్రాణం పోసిన మురళీ గోపీ, మాపై నమ్మకం ఉంచి ఎంతోగానో సపోర్ట్ చేసిన నిర్మాతలకు ధన్యవాదాలు. నటీనటులు, టెక్నికల్ టీమ్ సమష్టి సహకారంతోనే మేము దీనిని సాధించగలిగాం. మమ్మల్ని ఎంతగానో ఆరాధించే అభిమానుల ప్రేమే.. మాపై బాధ్యతను పెంచింది" అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో పృధ్వీరాజ్ సుకుమార్, మంజు వారియర్, టొవినో థామస్ కీలక పాత్రలు పోషించారు. గతేడాది అక్టోబర్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై ఇది నిర్మితమైంది. వచ్చే ఏడాది మార్చి 27న ఇది విడుదల కానుంది.

# నా భార్యను ఇందులోకి లాగవద్దు



హద్దులను గౌరవించి అనవసర వ్యవహారాలలో తన భార్య, బాలీవుడ్ నటి శిల్పా శెట్టి పేరును లాగవద్దని వ్యాపారవేత్త రాజ్ కుంద్రా శనివారం మీడియాకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాజ్ కుంద్రా నివాసంపై ఇడి దాడులు నిర్వహించింది. పోర్నోగ్రఫి, అశ్లీల సినిమాలను పంపిణీ చేశారన్న ఆరోపణలకు సంబంధించి నమోదైన మనీ లాండరింగ్ కేసులో భాగంగా కుంద్రాతోపాటు మరి కొందరి ఇళ్లు, కార్యాలయాలలో ఇడి సోదాలు నిర్వహించినట్లు అధికార వర్గాలు శనివారం తెలిపాయి. తాను ఇడి దర్యాప్తునకు సహకరించడం లేదంటూ కొన్ని పత్రికలలో వచ్చిన కథనాలను కుంద్రా ఖండించారు. గడచిన నాలుగేళ్లుగా జాగుతున్న ఈ కేసు దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తున్నట్లు ఆయన చెప్పారు. సహచరులు, ప్రోర్నోగ్రఫి, మనీ లాండరింగ్ వంటి ఆరోపణల విషయానికి వస్తే నిజాలను సంచలనాలు మరుగు పరచాలని, చివరకు న్యాయమే గెలుస్తుందని తన నివాసాలపై ఇడి దాడుల తర్వాత మొదటిసారి స్పందిస్తూ రాజ్ కుంద్ర తెలిపారు. సంబంధం లేని వ్యవహారాలలో తన భార్య పేరును పదేపదే లాగడం మీడియాకు తగదని ఆయన హితవు పలికారు. దయచేసి హద్దులను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2009లో రాజ్ కుంద్రాను వివాహ ం చేసుకున్న శిల్పా శెట్టి దీనిపై ఇంకా స్పందించాల్సి ఉంది.

# క్రిస్మస్ కానుకగా రిలీజ్



క్రిస్మస్ సీజన్‌ని క్యాష్ చేసుకోవడానికి మరో సినిమా రంగంలోకి దిగింది. ఇప్పటికే క్రిస్మస్ పండగ సందర్భంగా నితిన్ 'రాబిన్ హుడ్', వెన్నెలకిషోర్ 'శ్రీకాకుళం షెర్లాకహోమ్', కొత్త నటీనటులు నటించిన 'పతంగ్'తోపాటు కీర్తిసురేష్ బాలీవుడ్‌లోకి అడుగిడుతూ నటించిన 'బేజీ జాన్' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో హీరో కిచ్చా సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్' చిత్రం కూడా క్రిస్మస్ పండగ కానుకగా ఈనెల 25న విడుదల కానుంది. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని వీ క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్ బ్యానర్స్ పై కలైపులి ఎస్ థాను నిర్మించారు. విజరు కార్తికేయ దర్శకత్వం వహించారు. ఈ సినిమా కన్నడ, హిందీతోపాటు తెలుగులోనూ ఈనెల 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోందని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రంలో అర్జున్ మహాక్షరు అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కిచ్చా సుదీప్ కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ సినిమా టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో తెలుగులోనూ ఈ సినిమాపై హై ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి. అలాగే ఈనెల 25న పలు చిత్రాలు విడుదలవు తున్నప్పటికీ తెలుగులో సుదీప్‌కి ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రానికి కూడా భారీ ఓపెనింగ్స్ వస్తాయని మేకర్స్ నమ్మకంతో ఉన్నారు అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - శేఖర్ చంద్ర, ఎడిటింగ్ - ఎస్ఆర్ గణేష్ బాబు, మ్యూజిక్ - అజనీష్ లోకనాథ్.

# స్టార్ నటులతో 'ఆర్‌సి16'




ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ సక్సెస్‌ను సాధించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను మెప్పించిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఇప్పుడు తన 'ఆర్‌సి16' సినిమా షూటింగ్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా షూటింగ్‌ను మైసూర్‌లో ప్రారంభించారు. తొలి చిత్రం ఉప్పెనతో బ్లాక్‌బస్టర్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సమర్పణలో ఈ భారీ పాన్ ఇండియా సినిమాను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా సినిమాలో భారీ తారాగణం కూడా నటిస్తున్నారు. కరుణడ చక్రవర్తి శివరాజ్ కుమార్ ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రలో మెప్పించబోతున్నారు. తాజాగా ఇప్పుడు బాలీవుడ్ యంగ్ సెన్సేషన్ దివ్యేందు ఇందులో కీలక పాత్రలో అలరించబోతున్నారు. మీర్జాపూర్‌లో మున్నాభాయ్ పాత్రలో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన దివ్యేందు ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. అలాగే టాలీవుడ్ వర్సటైల్ యాక్టర్ జగపతి బాబు, కన్నడ స్టార్ హీరో శివన్న ముఖ్య పాత్రలో మెప్పించనున్నారు. ఈ సందర్భంగా దివ్యేందు పాత్రకు సంబంధించి దర్శకుడు బుచ్చిబాబు స్పందిస్తూ తనకు ఆర్‌సి16లో ఎంతో ఇష్టమైన పాత్ర ఇదేనని పేర్కొంటూ తన లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మెలి తిప్పిన మీసం, రగ్డ్ లుక్‌లో దివ్యేందు సరికొత్త పాత్రలో మెప్పించబోతున్నారని స్పష్టమవుతుంది. ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ క్వీన్ జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా మెప్పించనున్నారు.

# ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో 'పీలింగ్స్..'




క్రియేటివ్ జీనియస్ సుకుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్ విత్ సుకుమార్ రైటింగ్స్ పతాకంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం పుష్ప 2. 2021లో విడుదల అయిన పుష్ప 1 చిత్రానికి సీక్వెల్ గా ఈ చిత్రం డిసెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సునీల్, ఫహాద్ ఫాసిల్, జగపతి బాబు, రావు రమేష్, అనసూయ భరద్వాజ్, ధనుంజయ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, రవిశంకర్ యెలమంచిలి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం నుండి నేడు పీలింగ్స్ సాంగ్ విడుదల కావడం జరిగింది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించినా ఈ పాటకు చంద్ర బోస్ లిరిక్స్ రాయగా శంకర్ బాబు కందుకూరి, లక్ష్మి దాస తమ స్వరాన్ని జోడించి ఈ పాటను పాడడం జరిగింది. ఈ లిరికల్ సాంగ్ చూస్తుంటే అల్లు అర్జున్, రష్మిక మందన్నతో కలిసి ఎంతో ఎనర్జిటిక్ గా డాన్స్ స్టెప్పులు వేసినట్లు తెలుస్తుంది. ఈ పాటలో వింటేజ్ అల్లు అర్జును చూస్తారు, మలయాళం లిరిక్స్ తో మొదలై ఆ తర్వాత తెలుగు లిరిక్స్ తో కొనసాగుతుంది. 'ఇప్పటికే ఈ చిత్రం నుండి మూడు పాటలు విడుదల కాగా అన్ని పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మరోసారి ఈ సాంగ్ తో చిత్ర బృందం ప్రేక్షకులను అలరించనుంది.

# ఎన్టీఆర్‌కు జోడీగా అందాల రాశి..



తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ, లెజెండరీ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు ఫిలిమ్స్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు. డైనమిక్ డైరెక్టర్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని న్యూ టాలెంట్ రోర్స్ ఏబ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన నందమూరి తారక రామారావు ఫస్ట్ దర్శన్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ చిత్రం ద్వారా ప్రతిభావంతులైన కూచిపూడి డ్యాన్సర్, తెలుగు అమ్మాయి వీణారావు కథానాయికగా పరిచయం అవుతున్నారు. శనివారం వీణారావు ఫస్ట్ దర్శన్‌ని నిర్మాతలు సుప్రియ యార్లగడ్డ, స్వప్న దత్ లాంచ్ చేశారు. అచ్చ తెలుగు అందాలరాశి వీణారావు ఫస్ట్ దర్శన్ అందరినీ మైమరపిస్తోంది. ఫస్ట్ దర్శన్ షో రీల్‌లో సంప్రదాయక, మోడ్రన్ అవుట్ ఫిట్స్‌లో వీణారావు డిఫరెంట్ బ్యూటీఫుల్ లుక్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన షో రీల్ గ్లింప్స్ అందరినీ అలరించింది. "కథలు, సన్నివేశాలు, పాత్రలకు అనుగుణంగా నటించి ప్రేక్షకుల్ని రంజింప చేయడంలో తన వంతు నిరంతర కృషి చేస్తానని, తన అభిమాన నటి డాక్టర్ పి.భానుమతి రామకృష్ణ సాక్షిగా ప్రమాణం చేశారు వీణారావు. డైరెక్టర్ వైవీఎస్ చౌదరి వద్ద గత 18 నెలల అన్ని విభాగాల్లో శిక్షణ పొందానని%ొా% సినిమా, నటన పట్ల తన అంకితభావాన్ని ఆమె తెలియజేశారు. వీణారావు ఫస్ట్ దర్శన్ ప్రెస్ మీట్‌లో డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మాట్లాడుతూ "వీణా మన తెలుగమ్మాయి. మంచి కూచిపూడి డ్యాన్సర్. అందాల రాశి. తనకి మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. నిర్మాత స్వప్నదత్ మాట్లాడుతూ "వీణా మా విజయవాడ అమ్మాయి. చాలా అందంగా కనిపిస్తుంది. తెలుగు అమ్మాయిలు హీరోయిన్స్‌గా రావాల్సిన సమయం ఇది"అని తెలిపారు. నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ "వీణారావు ఎంతో అదృష్టవంతురాలు. ఇలాంటి లాంచ్ దొరకడం మామూలు విషయం కాదు. వీణా ఎన్నో సినిమాలు చేయాలని కోరుకుంటున్నా. ఈ సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నాను"అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత యలమంచిలి గీత పాల్గొన్నారు.

# గాజాలో మారణహోమం ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి

జెరూసలేం : గాజాలో ఇజ్రాయిల్ చర్యలను యుద్ధ నేరాలు, మారణహోమంగా ఇజ్రాయిల్ మాజీ రక్షణ మంత్రి మోషే యాలోన్ఞ్రా పేర్కొన్నారు. మోషే యాలోన్ ఇజ్రాయెల్ మీడియాతో మాట్లాడుతూ.. ఉత్తర గాజా నుండి పాలస్తీనియన్లను బహిష్కరించాలని, అక్కడ యూదుల స్థావరాలను పునరుద్ధరించాలని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరియు తీవ్రవాదులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. మోషే యాలోన్ 2013-16 నుండి నెతన్యాహు ఆధ్వర్యంలో రక్షణ మంత్రిగా పనిచేశారు. యాలోన్ అప్పటి నుంచి నెతన్యాహుపై తీవ్ర విమర్శకుడిగా ఉన్నారు. గత నెలలో, నెతన్యాహు, అతని మాజీ డిఫెన్స్ చీఫ్ యోవ్ గాలంట్‌లకు గాజా వివాదంలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాల ఆరోపణలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసిసి) అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఏడాదికి పైగా గాజాలో ఇజ్రాయిల్ తీవ్ర మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. మహిళలు, పిల్లలను చంపడం, గాజా నివాసులకు ఆహారాన్ని అందించే వరల్డ్ సెంట్రల్ కిచెన్ కార్మికులపై బాంబులు వేయడం వంటి అనేక యుద్ధ నేరాలకు ఇజ్రాయిల్ పాల్పడుతోంది.

# తైవాన్‌కు ఆయుధాలిస్తే ప్రతిఘటన తప్పదు



బీజింగ్: తైవాన్ ప్రాంతానికి 38,5 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను అమ్మాలన్న అమెరికా నిర్ణయంపై చైనా తీవ్రంగా స్పందించింది. తైవాన్‌కు ఆయుధాలిస్తే తాము గట్టి ప్రతిఘటన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చైటనా విదేశాంగ శాఖ ప్రతినిధి ఆదివారం స్పష్టం చేశారు. తైవాన్‌కు ఎఫ్-16 యుద్ధ విమానాలు, ఎలక్ట్రానికల్ స్కాన్డ్ ఎరే రాడార్లు, వాటి విడి భాగాలు, ఇతర ఆయుధాలను విక్రయించాలని నిర్ణయించినట్లు అమెరికా రక్షణ శాఖ గత శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం ఒకే చైనా అన్న సూత్రాన్ని, అలాగే అమెరికా- చైనా సంయుక్త ప్రకటనలను మరీ ముఖ్యంగా 1982 ఆగస్టు17 నాటి ప్రకటనను బాహాటంగా ఉల్లంఘించడమేనని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి విమర్శించారు. అంతేకాదు, అంతర్జాతీయ చట్టాన్ని కూడా అతిక్రమించడమేనని అన్నారు. తైవాన్ స్వాతంత్ర్యాన్ని సమర్థించబోమన్న ప్రకటిత వైఖరికి అమెరికా కట్టుబడకుండా అవకాశవాదంతో వ్యవహరిస్తోందని చైనా ఆరోపించింది. తైవాన్‌కు ఆయుధాల అమ్మకాన్ని తక్షణమే ఆపేయాలని చైనా కోరింది.

# ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ తన సన్నిహితుడు కాష్ పటేల్ (కశ్యప్ పటేల్)ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా శనివారం ఎంపిక చేశారు. తన యంత్రాంగంలో పలువురు భారత సంతతికి చెందిన వ్యక్తులకు కీలక పదవులను కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. "ఎఫ్‌బిఐ తదుపరి డైరెక్టర్‌గా కాష్ (కశ్యప్) పటేల్‌ను ఎంపిక చేసినందుకు నేను గర్విస్తున్నాను. గొప్ప న్యాయవాది, పరిశోధకులు, అమెరికా మొదటి పోరాట యోధుడు. అమెరికా ప్రజల కోసం తన వృత్తిని అంకితం చేశారు" అని ట్రంప్ సొంత సోషల్‌మీడియా 'ట్రూత్'లో పోస్ట్ చేశారు. గతంలో ట్రంప్ ప్రభుత్వంలో అమెరికా తాత్కాలిక రక్షణ కార్యదర్శి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేశారు. నేషనల్ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఉగ్రవాదం) సీనియర్ డైరెక్టర్‌గా పనిచేశారు. న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్‌కు గుజరాత్ మూలాలున్నాయి. ఆయనతల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాకు చెందినవారు. తల్లి టాంజానియా, తండ్రి ఉగాండాకు చెందినవారు. 1970లో కెనడా నుండి అమెరికాకు వలస వచ్చారు. న్యూయార్క్‌లో జన్మించిన కశ్యప్ యూనివర్శిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. మియామీ కోర్టులో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు.

# యువతులు, బాలికల్లో అధికంగా హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్లు !

న్యూయార్క్ : యువతులు, బాలికల్లో గతేడాది అత్యధికంగా హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్లు సోకడం పట్ల ఐక్యరాజ్య సమితి బాలల నిధి (యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. వారికి చికిత్స అందుబాటులో వుండడం లేదని, పైగా ఈ ఇన్ఫెక్షన్లు సోకకుండా ముందస్తు నివారణ చర్యలు కూడా లేవని హెచ్చరించింది. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యునిసెఫ్ ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో 15 నుండి 19ఏళ్ళ లోపు వయస్సు గల వారిలో 96 వేల మంది బాలికలకు, 41 వేల మంది బాలురకు హెచ్‌ఐవి సోకిందని ఆ నివేదిక పేర్కొంది. అంటే యుక్త వయస్సుకు వచ్చిన బాలికల్లో ప్రతి 10 మందిలో ఏడుగురు ఈ మహమ్మారి బారిన పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చింది. సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో, ఈ సంఖ్య ప్రతి పది మందిలో 9గా వుంది. 2023లో దాదాపు 13 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యుఎన్‌ఎయిడ్స్ సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. వారిలో ఎయిడ్స్ కారణాలతో 6.3 లక్షల మంది మరణించారని తెలిపింది. 2030 కల్లా ప్రజారోగ్యానికి ముప్పుగా వున్న ఎయిడ్స్‌ను నిర్మూలించాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన దాని కన్నా మూడు రెట్లు ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడ్డారని యునిసెఫ్ అసోసియేట్ డైరెక్టర్ అనురిత బెయిన్స్ తెలిపారు.

# భారత్ సహా బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

అంతర్జాతీయ వర్తకంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. డాలర్‌ను దూరం పెట్టే ప్రయత్నాలు చేసే దేశాలు అమెరికాతో వర్తకానికి కూడా దూరం కావలిందేనని ట్రంప్ 'ట్రూత్ స్పెషల్' పోస్ట్‌లో హెచ్చరించారు. ట్రంప్ ఈ మేరకు బ్రిక్స్ దేశాలు భారత్, బ్రెజిల్, చైనా, రష్యా. దక్షిణాఫ్రికాలకు నేరుగా హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ లావాదేవీలకు డాలర్ స్థానంలో మరొక కరెన్సీ ఉపయోగించాలని బ్రిక్స్ దేశాలు ఇటీవల నిర్ణయించాయి.దీనిపై ట్రంప్ స్పందిస్తూ, డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీ ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని ఆయన తెలిపారు. అమెరికాకు ఆయా దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై 100 శాతం పన్నులు పెంచుతామని ట్రంప్ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల యత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటు ఉండదని ఆయన హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మరచిపోవలసి వస్తుందని ట్రంప్ సూచించారు. కాగా, అక్టోబర్ రష్యాలోని కజన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీల్లో డాలర్‌కు బదులు స్థానిక కరెన్సీ ఉపయోగించాలని అవి నిర్ణయించాయి. దీని వల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అవి అభిప్రాయం వ్యక్తం చేశాయి.

# ఇటలీలో కార్మికవర్గం కన్నెర్ర



రోమ్: ఇటలీలో కార్మిక వర్గం అపూర్వమైన సమ్మె చేసింది. పచ్చి మితవాది మెలోనియా ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా ఇటలీలోని కార్మిక సంఘాలన్నీ కలసి శుక్రవారం 8 గంటల సార్వత్రిక సమ్మె చేశాయి. వేలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె వల్ల దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు స్తంభించిపోయాయి. స్కూల్స్, ఆస్పత్రులు, స్థానిక రవాణాకు తీవ్ర అంతరాయమేర్పడింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుండడం, తక్కువ వేతనాలు, ప్రజా సేవలను నిర్వీర్యం చేయడం వంటి చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. దేశంలో వేతనాలు తక్కువగా ఉండడం వల్ల చాలా మంది ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారని, దీని వల్ల హెల్త్ కేర్ సెక్టార్‌లో నర్సుల కొరత తీవ్రంగా ఉందని రోమ్‌కు చెందిన కార్యకర్త అన్నా సల్నా చెప్పారు. సిబ్బంది తక్కువగా ఉన్నారని ఒకరికి రోజుకు రెండు మూడు షిఫ్టులు వేస్తున్నారని అన్నారు.

# ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల మధ్య ఘర్షణ..



పశ్చిమాఫ్రికా దేశం గినియాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. గినియాలోని రెండవ అతిపెద్ద నగరమైన ఎన్‌జెరెకోర్‌లో ఆదివారం ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల అభిమానులు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో దాదాపు 100 మందికి పైగా మరణించినట్లు తెలుస్తోంది. రిఫరీ వివాదాస్పద నిర్ణయంతో ఇరువర్గాల ఫ్యాన్స్ రెచ్చిపోయారు. అనంతరం స్టేడియం బయటకు వచ్చి కొట్టుకున్నారు. దీంతో వీధుల్లో మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అంతేకాదు.. స్థానిక పోలీస్ స్టేషన్ కు నిప్పు పెట్టారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో భారీగా రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ దాడుల్లో మందలమంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఇక, మృతదేహాలతో ఆస్పత్రి నిండిపోయిందని ఓ డాక్టర్ మీడియాకు వెల్లడించాడు. అభిమానులు దాడులు చేసుకున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన స్థానిక పోలీసులు రద్యాప్తు చేపట్టారు.

# భోపాల్ విషాదంపై ముందే హెచ్చరించిన న్యాయవాది !




భోపాల్ : నలభై ఏళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లో జరిగిన దుర్ఘటన గురించి ఒక న్యాయవాది ముందే హెచ్చరించారు. భోపాల్‌ని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన విషవాయువులు పెను విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. అయితే, ఆ ఘటనకు సంబంధించిన పలు కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఫ్యాక్టరీ నుంచి విషవాయువులు వెలువడుతున్నాయని, దాన్ని మూసివేయాలని ఘటనకు ముందే నోటీసులు పంపినట్లు షానవాజ్ ఖాన్ (75) అనే న్యాయవాది తెలిపారు. అయితే, ఈ హెచ్చరికలను ఫ్యాక్టరీ యాజమాన్యం కొట్టిపారేసిందని వెల్లడించారు. 1983 మార్చి 4న యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెట్‌కు షానవాజ్ లీగల్ నోటీసులు పంపారట. 'ప్లాంట్ జనావాసాల మధ్య ఉంది. దీని నుంచి వెలువడుతున్న విషపూరిత వాయువులు, రసాయనాల నిల్వలతో సమీప కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే 50 వేల మంది ప్రాణాలకు హాని కలుగుతుంది. 15 రోజుల్లోపు మీ ఫ్యాక్టరీలో విషవాయువులు, ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని నిలిపివేయాలి. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి ఉంటుంది' అని తాను నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. 1981లో ఆ ఫ్యాక్టరీలో పనిచేసే ఓ కార్మికుడు విషవాయువు లీకవడంతో మృది చెందారని ఖాన్ తెలిపారు. ఆ తర్వాత అక్కడ పలు మార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని వెల్లడించారు. ఈ క్రమంలోనే తాను యూసీఐఎల్‌కి లీగల్ నోటీసులు పంపించానన్నారు. అయితే, వాటిని యూసీఐఎల్ కొట్టిపారేసిందని ఖాన్ తెలిపారు. భోపాల్‌లో 1984 డిసెంబర్ 2న అర్ధరాత్రి విష వాయువులు లీక్‌అయిన దుర్ఘటనలో 3,787 మంది ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 5లక్షల మంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దాని బాధితులు ఇంకా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు.

# ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి

న్యూఢిల్లీ: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానాలతో ఆదివాసీల హక్కులపై ముప్పేట దాడి జరుగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ, రిజర్వేషన్ల కుదింపు, మినహాయింపు చర్యల వల్ల ఆదివాసీలు, ఇతర అణగారిన తరగతులకు చెందిన ప్రజలు ఉద్యోగాలకు, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని చెప్పారు. ఆదివారం స్థానిక హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఎఎఆర్‌ఎం), సెంటర్ ఫర్ ఆదివాసీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. ఆదివాసులను ఉద్యోగాల నుండి దూరం చేస్తున్నారన్న అంశంపై ఎఎఆర్‌ఎం ఛైర్మన్ జితేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి వందలాది మంది గిరిజన సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఆదివాసీ హక్కులు, ఉద్యోగాలపై దాడికి పూనుకుందని విమర్శించారు. అలాగే ఆదివాసుల భూములను అక్రమంగా గుంజుకొని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. దీంతో అటవీ సంపదపైనా కార్పొరేట్ కంపెనీలు పెత్తనం సాగిస్తున్నాయని చెప్పారు. వీటిపై ఎఎఆర్‌ఎం పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కేంద్రంలోని బిజెపి విధానాల వల్ల ఆదివాసీ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణ, వివిధ మినహాయింపులతో ప్రభుత్వ ఉద్యోగాల నుంచి ఆదివాసీలను దూరం చేస్తున్న తీరుపై సదస్సులో డేటాను ప్రదర్శించారు. ఈ డేటాను ప్రస్తావిస్తూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల హక్కును కూడా మోడీ సర్కార్ నీరుగారుస్తోందని తెలిపారు.

## ఇండియా అంతటా యువత కోసం ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌ని మెరుగుపరచడానికి GMR ఏరో అకాడమీ మరియు ATFSసహకరిస్తాయి.




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**బిగ్ బ్రదర్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ (TBBP LLP) ప్రారంభించబడింది.

హైదరాబాద్ -2024-ఏవియేషన్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న GMR ఏరో అకాడమీ, ఈరోజు ప్రకటించింది

యువతకు ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌ని అందించడం ద్వారా ATFSతో భాగస్వామ్యం

విద్య మరియు విద్య మధ్య అంతరాన్ని తగ్గించడానికి ప్రత్యేకంగా రూపొందించబడిన సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ల సమగ్ర సూట్

పరిశ్రమ అవసరాలు. బిగ్ బ్రదర్ మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ (TBBP LLP) హైదరాబాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఈ కూటమి విమానయాన రంగ అవసరాలకు అనుగుణంగా పటిష్టమైన శిక్షణా కార్యక్రమాన్ని ప్రవేశపెడుతుం

విమానాశ్రయంలో సర్టిఫికేషన్, ఎయిర్‌లైన్ & కార్గో ఆపరేషన్స్ (CAACO), సర్టిఫైడ్ వంటి భాగాలు

కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ (CCSE), మరియు కార్పొరేట్ రెడీనెస్ ప్రోగ్రామ్‌లో సర్టిఫికేషన్ (%CCRా).

భాగస్వామ్యం గురించి మాట్లాడుతూ GMR ఏరో టెక్నిక్ & GMR ఏరో అధ్యక్షుడు అశోక్ గోపీనాథ్

అకాడమీ, "విమానయాన రంగం నైపుణ్యం కలిగిన నిపుణుల కొరతను ఎదుర్కొంటోంది, ముఖ్యంగా

కస్టమర్ సేవ మరియు విమానాశ్రయ నిర్వహణ పాత్రలు. ఈ భాగస్వామ్యం ద్వారా, మేము ఈ అంతరాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము యువతకు ఉద్యోగ ఆధారిత శిక్షణ మరియు ఉపాధి అవకాశాలను కల్పించడం. ఈ చొరవ ఆడుతుంది

పరిశ్రమ యొక్క నైపుణ్యాన్ని పెంపొందించడంలో మరియు దాని వృద్ధికి మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తుంది."

%జూూాజూ% ప్రోగ్రామ్ త్రైమాసికానికి అందించబడుతుంది, ప్రతి బ్యాచ్‌కు కనీసం 50 మంది పాల్గొనేవారు అవసరం.

శిక్షణ రెండు దశల్లో నిర్మితమవుతుంది: మొదటి దశ CCSE మాడ్యూల్‌ను కలిగి ఉంటుంది, ఇది ఒకటిన్నర నెలల్లో కవర్ చేయబడింది, తర్వాత ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. రెండవ దశ విమానాశ్రయాన్ని కలిగి ఉంటుంది,

ఎయిర్‌లైన్ & కార్గో మాడ్యూల్ మరియు CCRP మాడ్యూల్, ఒకటిన్నర నెలల పాటు కొనసాగుతుంది

పరీక్షజి

కోర్సులు ఆన్‌లైన్‌లో పంపిణీ చేయబడతాయి, GMR ఏరో అకాడమీలో ఆఫ్‌లైన్ శిక్షణ చివరి వారంలో ముగుస్తుంది

క్యాంపస్, ఇక్కడ పూర్తయిన తర్వాత సర్టిఫికేట్లు ఇవ్వబడతాయి.

శ్రీ రాహుల్ పులుపూడి, ATFS Pvt. Ltd., "విమానయాన పరిశ్రమ అంచున ఉంది

గణనీయమైన విస్తరణ, మరియు నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి కోసం పెరుగుతున్న అవసరం ఉంది. GMR ఏరోతో మా సహకారం

అకాడమీ మరియు TBBP ఔత్సాహిక యువత ఇందులో రాణించడానికి అవసరమైన శిక్షణ మరియు ధృవీకరణను అందిస్తాయి.

డైనమిక్ ఫీల్డ్. ఈ కార్యక్రమం వ్యక్తిగత విజయాన్ని పెంపొందించడమే కాకుండా దానికి దోహదం చేస్తుందని మేము నమ్ముతున్నాము

విమానయాన రంగం యొక్క విస్తృత వృద్ధి."

టిబిబిపి ఎల్ఎల్‌పి వ్యవస్థాపకుడు శ్రీ సయ్యద్ అస్కారీ ఇలా అన్నారు, "ఈ భాగస్వామ్యం సాధికారత కోసం మా మిషన్‌ను ప్రతిబింబిస్తుంది మెంటార్‌షిప్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా యువకులు. పరిశ్రమతో మా వనరులను కలపడం ద్వారా

GMR ఏరో అకాడమీ మరియు %గాుఖీూ% యొక్క నైపుణ్యం, మేము గోవా యువతకు ఉజ్వల భవిష్యత్తు కోసం వేదికను ఏర్పాటు చేస్తున్నాము.

విద్య మరియు ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గించడం, స్థానికులకు మరిన్ని అవకాశాలను కల్పించడం మా లక్ష్యం

ప్రతిభ."ATFS దాని విస్తృతమైన పరపతిని ఉపయోగించడం ద్వారా పరిశ్రమ పోకడలు మరియు నైపుణ్యాల అంతరాలను గుర్తించడానికి దాని నైపుణ్యాన్ని దోహదపడుతుంది

ప్రోగ్రామ్ యొక్క ఔచిత్యం మరియు ప్రభావాన్ని నిర్ధారించడానికి నెట్‌వర్క్ మరియు మార్కెట్ అంతర్దృష్టులు.

# వైభవంగా తెలుగు వర్సిటీ 39వ వ్యవస్థాపన దినోత్సవం

## అంతర్జాతీయ స్థాయిలో తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుంది - మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 2:**తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి ప్రాంగణంలోని వంద ఎకరాల విస్తీర్ణంలో గల సువిశాల ప్రాంగణంలో 39వ వ్యవస్థాపన దినోత్సవం సోమవారం వైభవోపేతంగా జరిగింది.

తెలుగు భాష, సాహిత్యం, లలితకళలు. సాంస్కృతిక రంగాల అభ్యున్నతికి కృషి చేస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం ప్రతియేటా వ్యవస్థాపన దినోత్సవ సందర్భంగా ఆయా రంగాలకు విశేష సేవలందిస్తున్న ప్రముఖునికి విశ్వవిద్యాలయ ప్రతిష్ఠాత్మకమైన విశిష్ఠ పురస్కారాన్ని అందజేస్తుంది. సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవలనందిస్తున్న శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డా.కె.ఐ.వరప్రసాద రెడ్డికి 2023 సంవత్సరానికి గాను లక్ష రూపాయిల నగదు, ప్రశంసాపత్రంతో విశిష్ఠ పురస్కారాన్ని అందజేశారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐ.టి., వాణిజ్యం మరియు పరిశ్రమల శాఖామాత్యుల, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఇంఛార్జ్ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వర్సిటీ విశిష్ట పురస్కారాన్ని వరప్రసాద రెడ్డిగారికి ప్రదానం చేసి మాట్లాడుతూ దేశ విదేశాలలో తెలుగుభాష, సాహిత్యం, లలితకళల ఔన్నత్యాన్ని చాటుతున్న తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తుందని అభినందించారు. ఐ.టి., ఫార్మా, సేవారంగాలలో ఉపాధి ఉన్నప్పటికినీ లలితకళా రంగాలలో కూడా ఉపాధిని పొందే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం గొప్ప నైపుణ్య శిక్షణా కేంద్రంగా నిలిచినందుకు సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ నుండి విశ్వవిద్యాలయానికి అన్నివిధాలుగా సాంకేతిక పరమైన సహకారాన్ని అందిస్తుందనీ, తక్షణమే వర్సిటీకి అవసరమైన కంప్యూటర్లను, డిజిటల్ బోర్డులను, సంబంధిత సాంకేతిక పరికరాలను సమకూర్చుతామని హామి ఇచ్చారు.

విశ్వవిద్యాలయం ప్రదానం చేస్తున్న విశిష్ట పురస్కారాన్ని పొందిన వరప్రసాద రెడ్డి వ్యక్తి కాదు వైద్య రంగంలో అసమాన కీర్తిని పొందిన శక్తిగా నిలిచారని, పురస్కారానికే ప్రత్యేక గౌరవాన్ని అపాదించారని ప్రశంసించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ బాచుపల్లిలో ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయ నూతన ప్రాంగణానికై పూర్వ ఉపాధ్యక్షులు, రిజిస్ట్రార్లు చేసిన కృషిని గుర్తుచేస్తూ వారందించిన సేవల ప్రతిఫలమే ఈనాటి ఈ సువిశాల విశ్వవిద్యాలయ ప్రాంగణమని వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు విశ్వ విద్యాలయం కేవలం రాష్ట్ర విశ్వవిద్యాలయమే కాదని, అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా పనిచేస్తూ అమెరికా, మలేషియా, మారషస్ మొదలగు దేశాలలో తమ అనుబంధ సంస్థలు తెలుగు భాషా సాహిత్య వికాసానికై అవిరళ కృషి చేస్తున్నదని గుర్తుచేశారు. విశ్వవిద్యాలయాన్ని మరింత ప్రగతిపథంలో నడిపించడానికి ప్రభుత్వ సహకారంతో భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకుంటుందని వివరించారు.

పురస్కార గ్రహీత పద్మభూషణ్ డా. కె.ఐ. వరప్రసాద రెడ్డి తన ప్రతిస్పందనలో మాట్లాడుతూ మన సంస్కృతే తెలుగువారికి బలం, అస్తిత్వం అని వాటిని సమాజంలో కాపాడుకోవడానికి, అవి మరింత పరిఢవిల్లడానికి తెలుగు విశ్వవిద్యాలయం అవసరమని అందుకు ప్రభుత్వ సహకారం వాంఛనీయమని వరప్రసాదరెడ్డిగారు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను సంస్కృతి. భాష పట్ల అవగాహన కల్పించాలని అప్పుడే మంచి పౌర సమాజం నెలకొంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

వృత్తి పరంగా అందించిన వైద్య సేవల కన్నా ప్రవృత్తి పరంగా తెలుగు భాషా సాహిత్యానికి చేస్తున్న సేవలే నా జీవితానికి సంతృప్తి నిస్తాయని తెలియజేస్తూ, విశ్వవిద్యాలయం అందించిన విశిష్ట పురస్కార నగదుతో పాటు మరో కోటి రూపాయలను వర్సిటీకి అవసరమయ్యే మౌలిక సదుపాయాల నిర్మాణానికై విరాళంగా చెక్కును మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమక్షంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావుకు అందజేశారు.

ఆత్మీయ అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉన్నతవిద్యామండలి అధ్యక్షులు ఆచార్య వి. బాలక్రిష్ణారెడ్డిగారు ప్రసంగించారు

కార్యక్రమానికి తొలుత విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులకు స్వాగతం పలుకుతూ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సుల వివరాలను, తెలుగు భాష, సాహిత్యాల ఔన్నత్యాన్ని, వాటి ప్రాభవాన్ని పెంచేందుకు విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాలిటీ మేయర్ శ్రీమతి కొలను నీలా గోపాల్ రెడ్డి, మేడ్చల్ %-% మల్కాజ్ గిరి కలెక్టర్, శ్రీ గౌతంపోట్రు ఐఏఎస్, అడిషనల్ కలెక్టర్ రాధిక ఐఏఎస్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్, ఎం.డి. సాబేర్ అలీ లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు విశ్వవిద్యాలయం ఆత్మీయ సత్కారంతో పాటు చిత్ర, శిల్పకళల విద్యార్థులు చిత్రించిన చిత్రపటాలను అందించారు. విస్తరణ సేవా విభాగం ఇంఛార్జ్ సహాయ సంచాలకుడు రింగురామమూర్తి పురస్కార ప్రదాన కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించారు.

సాంస్కృతిక పదర్శనలు :

తెలుగు విశ్వవిద్యాలయం శిల్పం-చిత్రలేఖన విభాగానికి చెందిన బోధనా సిబ్బంది డా.వెంకటేశం, మహేష్, గ్లోరీ పాల్‌ల ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు చిత్ర శిల్ప కళా నైపుణ్యంతో విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని అంగరంగ వైభవంగా, అందంగా అలంకరించి తమ కుంచెతో జాలువారిన చిత్రకళా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

పురస్కార ప్రదానానికి ముందుగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో రంగస్థల కళల శాఖాధిపతి డా. బి.హెచ్.పద్మప్రియ పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించిన మత్తువదలరా! నాటకం సామాజిక రుగ్మతలను ఎత్తిచూపుతూ తద్వారా జరిగే పరిణామలను విశదీకరిస్తూ సందేశాత్మక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

నృత్యశాఖాధిపతి డా. వనజా ఉదయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, పేరిణి, ఆంధ్రనాట్య కళారూపాల ప్రద్శరన సభికులను ఎంతగానో అలరించింది.

జానపద కళలశాఖాధిపతి డా. లింగయ్య తన జానపద విద్యార్థులచే డప్పు నృత్యాన్ని ప్రదర్శించారు.

విశ్వవిద్యాలయం విద్యార్థులైన జాతీయ స్థాయి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీతలైన పేరిణి రాజ్ కుమార్, ఒగ్గు రవి, అందె భాస్కర్ తమ బృందాలతో ప్రదర్శించిన కళారూపాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ప్రముఖ సంగీత కళాకారిణి శ్రీమతి శ్వేతా ప్రసాద్ తన గానామృతంతో సభికులను అలరించింది.

# ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

## ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

### మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 2:**జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ( 72 ) ఫిర్యాదులు అందాయన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ఆన్ లైన్ పెండింగ్ అప్లికేషన్లను సంఖ్యను వివరిస్తూ , ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

# ట్రాఫిక్ జామ్ ను చక్కదిద్దిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్‌ట్యాంక్ బండ్ వైపు నుంచి వస్తున్న కారు అంబేద్కర్ కూడలి వద్ద అదుపు తప్పి ఫుట్ పాత్ పైకి దూసుకుపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రాత్రి 9 గంటల సమయంలో ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్సు నుంచి యు టర్న్ తీసుకుని సెక్రటేరియట్ వైపు వెళ్తున్న మంత్రి శ్రీధర్ బాబు వాహనం దిగి స్వయంగా ట్రాఫిక్ ను చక్కదిద్దారు. ఆయన సెక్యూరిటీ సిబ్బంది కారును అక్కడి నుంచి పక్కకు జరిపారు. ఈ లోగా శ్రీధర్ బాబు వ్యక్తిగత సహాయకులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు దెబ్బతిన్న కారును దూరంగా తీసుకెళ్లి ట్రాఫిక్ ను క్లియర్ చేసారు. దాదాపు పది నిమిషాల సేపు అక్కడే ఉన్న శ్రీధర్ బాబు ట్రాఫిక్ అవాంతరం తొలగిన తర్వాత బయలు దేరి వెళ్లారు.

# రైలు ఢీకొని పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం

నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సతీష్ అనే గిరిజన విద్యార్థి సోమవారం ఉదయం రైలు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి.. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ప్రథమ సంవత్సరం చదువుతున్న సతీష్ అనే గిరిజన విద్యార్థి స్థానిక బొమ్మల సత్రం సమీపంలోని ఎస్టీ హాస్టల్ నందు ఆశ్రయం పొందుతున్నాడు. అయితే సోమవారం ఉదయం కాల కృత్యాలను తీర్చుకునేందుకు సమీప రైల్వే ట్రాక్ పై వెళ్తుండగా వెనక నుండి వచ్చిన రైలు విద్యార్థిని ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించకపోవడంతో , విద్యార్థులు ఇలా బయటికి వెళ్లి ప్రమాదాలకు గురి అవుతున్నారు. హాస్టల్ నందు అత్యంత దారుణాతి దారుణంగా బాత్రూములు వంటశాలలు నిద్రించే గదులు హాస్టల్ యొక్క చుట్టుపక్కల వాతావరణం వర్ణనాతీతంగా ఉన్న పరిస్థితిని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ కు వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులు, విద్యార్థి నాయకులు తమ గోడును వెలబుచ్చారు. అయితే జిల్లా సర్వోన్నత అధికారి సైతం విద్యార్థుల యొక్క బాగోగులను పట్టించుకోలేదు. విద్యార్థులు చుట్టుపక్కల సమీప ప్రాంతాలలో కాలకృత్యాలను తీర్చుకొని వెళ్తూ ఇలా ప్రమాదాలకు గురై నిండు ప్రాణాలను కోల్పోతున్నారు. విద్యార్థి యొక్క విలువైన బంగారు భవిష్యత్తు రైలు ఢీకొన్న ప్రమాదంలో ముగియడం ఎంతో విషాదకరం. దీనికంతటికీ కారణం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు వారి వసతి గృహాల్లో సరియైన సదుపాయాలు కల్పించకపోవడమేనని విద్యార్థులు విమర్శిస్తున్నారు. ఇటువంటి దుర్ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

# ప్రముఖ సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



ప్రజాబలం కొల్చారం మండలం నవంబర్ 2మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రముఖ సంఘ సేవకుడు గట్టు ప్రశాంత్ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో 200 పైగా ప్రజలకు ఉచిత టాబ్లెట్లు బిపి షుగర్ టెస్టులు మరియు అవసరమైన వారికి 60 మందికి పైగాచెవి ముక్కు గొంతు థైరాయిడ్ గర్భసంచి సంబంధిత శరీర సంబంధవ్యాధులకు గాను ఉచితంగాను ఆపరేషన్ చేయించడానికి 60 మందికి పైగా రిఫర్ మల్లారెడ్డి సౌజన్యంతో చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక వరిగుంతం సెక్రెటరీ శ్రీజ మల్లారెడ్డి హాస్పిటల్ బృందం డాక్టర్ ఎస్.కె అబ్దుల్ అనుదీప్ స్టాఫ్ నర్స్ లు ప్రశాంతి ప్రియా పావని మార్కెటింగ్ మేనేజర్ ఎండి మహమ్మద్ నాగప్ప సురేష్ పాల్గొన్నారు ప్రజలు సద్వినియోగం చేసుకొని గట్టు ప్రశాంత్‌ని అభినందించారు

# సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్: పెండింగ్ బిల్లుల విడుదల చేయాలి



ప్రజాబలం ప్రతివీధి నిర్మల్ జిల్లా.. గ్రామపంచాయతీల అభివృద్ధి కోసం గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ ప్రభుత్వం ముందు డిమాండ్ చేస్తోంది. సోమవారము సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు పోశెట్టి మాట్లాడుతూ,నిర్మల్ జిల్లా లోని అన్ని పార్టీలకు చెందిన మాజీ సర్పంచులు తమ పదవీకాలంలో ప్రభుత్వం ఆదేశించిన పనులను నిబద్ధతతో పూర్తి చేశారని, వాటి కోసం అప్పులు చేసి సొంతంగా నిధులను వినియోగించినప్పటికీ, వాటికి సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు మంజూరు కాలేదని తెలిపారు.

ఆర్థిక సమస్యలపై తీవ్ర వ్యతిరేకత.

పూర్తయిన పనులకు బిల్లులు విడుదల కాకపోవడంతో సర్పంచులు తీవ్రమైన ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. వడ్డీ భారం కారణంగా కొందరు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో,ఇటీవల పెంబి మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం చేయడం హృదయ విదారకమని సిపిఎం అభిప్రాయపడుతోంది. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, సమస్యల పట్ల పోరాటం చేయాలని సర్పంచ్‌లను పార్టీ విజ్ఞప్తి చేస్తోంది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీల అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన సందర్భంలో బిల్లుల విడుదలను నిర్లక్ష్యం చేయడం దారుణమని సిపిఎం మండిపడింది. ప్రభుత్వాలు వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి,మాజీ సర్పంచుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి.

సిపిఎం డిమాండ్‌పూర్తి చేసిన పనులకు బిల్లులను వెంటనే మంజూరు చేయాలి.గ్రామపంచాయతీల అభివృద్ధి పనులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా ప్రోత్సహించాలి.సర్పంచుల ఆర్థిక సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

# వాజేడు ఎస్సై ఆత్మహత్య





ములుగు జిల్లాలో మరో విషాద సంఘటన జరిగింది. వాజేడు ఎస్సై హరీష్ ఆత్మహత్య చేసుకున్నాడు. సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ముళ్లకట్ట సమీపంలోని హరిత రిసార్ట్స్ లో ఘటన జరిగింది. కుటుంబ కలహాలు కారణమా..? వరుస ఘటనలతో మానసిక ఒత్తిడి తో ఆత్మహత్య..? అనే అనుమానాలు వున్నాయి. సోమవారం ఉదయం 6 గంటలకు తన డ్రైవర్ కి ఎస్సై హరీశ్ కాల్ చేసాడు. తనను హోటల్ నుండి పిక్ అప్ చేసుకొమ్మని చెప్పాడు. డ్రైవర్ వచ్చే వరకే తుపాకీతో కాల్చుకున్నాడు. అంతకుముందు హరిశ్, మరో అమ్మాయి గోడవపడ్డట్టు, తనను వదలిపెట్టాలంటూ హరీష్ బ్రతిమిలాడినట్లు ఆమె ససేమిరా అనడంతో మనస్తాపానికి గురై కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

# చెంచుల జీవన స్థితిగతులను మారుస్తాం

నాగర్ కర్నూలు అడవులను రక్షిస్తూ నే అడవులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న చెంచుల జీవన స్థితిగతులను మార్చేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, శ్రీ శివు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ నల్లమల్ల అడవి ప్రాంతంలో నీ చెంచులకు సిపిఎం ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తో కలిసి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరితగతిన అంతరించిపోతున్న ఆదిమ జాతి చెంచు బిడ్డలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. అడవులను రక్షించడంతోపాటు అడవిని నమ్ముకుని జీవిస్తున్న చెంచులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అమ్రాబాద్ నల్లమల్ల ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను టూరిజం హబ్ లోకి తీసుకువెళ్లి సీఎం రేవంత్ రెడ్డి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక చెంచు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మల్లెల తీర్థం పర్యాటక ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. నల్లమల్ల కు వచ్చిన మంత్రి సీతక్కకు స్థానిక ఆదివాసి గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు..





ప్రజా బలం ప్రతినిధి 2 డిసెంబర్ 2024

చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.

ఆలూరు గేట్ వద్ద కూరగాయలు అమ్ముకునే వారి పైకి ఒక్కసారిగా లారీ దూసుకెళ్లడంతో సుమారు 10 మంది వరకూ చనిపోయినట్టు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలుస్తోంది.

# ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు
## వర్చువల్ విధానంలో నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం
## పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్






ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమం నిర్వహించారు. వర్చువల్ పద్దతిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంత్రులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమని తెలిపారు.ఈ సందర్బంగా విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్తులో పేద ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కళాశాలలోని అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటూ చక్కగా విద్యను అభ్యసించాలన్నారు. నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసినందుకు విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శకుంతల,వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ఎన్ఎంసి నోడల్ అధికారి సునీల్, తహసిల్దార్ రాజు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పంచాయితీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# బీ ఆర్ ఎస్ యువజన అధ్యక్షుడు సందీప్ యాదవ్ పుట్టిన రోజు

గండీపేట ప్రజబలం ప్రతినిధి 2 డిసెంబర్ 2024మణికొండ భారత రాష్ట్ర సమితి కుటుంబ సభ్యుల ఆద్వర్యంలో మణికొండ క్వార్టర్స్ లో గల పార్టీ యువజన అధ్యక్షుడు సందీప్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుప బడినవి.

# కన్నడ సీరియల్ నటి శోభిత ఆత్మహత్య.

హైదరాబాద్ కన్నడ సీరియల్ నటి శోభిత ఆత్మహత్య చేసుకుంది. గాచ్చిబౌలి లోని తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది పెళ్లి అనంతరం సినిమా, సీరియల్స్ కి శోభిత దూరంగా వుంది. శోభిత మృతి పై పలు అనుమానాలు వ్యక్తంమవుతున్నారు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తుఫాన్ ఎఫెక్ట్.. విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం

చెన్నై ఫెంగల్ తుఫాన్ కారణంగా చెన్నైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ మధ్యలో చెన్నై ఎయిర్పోర్టులో ల్యాండ్ అయ్యేందుకు ట్రై చేసిన ఇండిగో విమానం తృటిలో ప్రమాదాన్ని తప్పించుకుంది. గాలుల తీవ్రతకు కుదుపునకు గురవుతున్నట్లు కనిపించిన ఫ్లైట్, ల్యాండింగ్ సాధ్యం కాక గాల్లోకి లేచింది. వెనుక భాగం రన్వేకు తాకేలా కనిపించినా లక్కీగా ప్రమాదం కాలేదు. తుఫాన్ దృష్ట్యా మంగళవారం వరకు చెన్నై ఎయిర్ పోర్టుకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

## 17,85,000 విలువగల అరవై కిలోల గంజాయి ని పట్టుకున్న సైబరాబాద్ యస్ఓటీ పోలీసులు

హైదరాబాద్ సైబరాబాద్ యస్ఓటీ పోలీసులకు నమ్మకమైన సమాచారం అందడంతో చందానగర్ పోలీసులతో కలిసి ఒరిస్సా నుండి వస్తున్న మహీంద్రా కారును చందానగర్ లోని గంగారం చెరువు వద్ద ఆపి లోపల తనిఖీ చేసి కార్ ఇంజన్ లో ఉన్న కాళి స్థలం లో అలాగే కార్ డోర్ లలో దాచి ఉంచిన 60 కిలోల ప్యాకెట్లను (విలువ రూ17,85,000) స్వాధీనం చేసుకున్నారు.చమన్, శివ్వంపేట ఉమాకాంత్,అర్జున సాయి కృష్ణ లను అదుపులోకి తీసుకున్నారు. రాకేష్ ఏ దాస్ పరారీలో వున్నాడు.

# వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలు పెంపకం చేస్తున్న వ్యక్తులు అరెస్ట్

## సమిష్టిగా గంజాయిని జిల్లా నుండి తరిమికొడుదాం



ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. సాహసోపేతంగా వెతికి గలిగాం.గంజాయి మొక్కలు ఉన్నాయని గుర్తింఛి సుమారు 70 లక్షలు రూపాయలు విలువచేసే గంజాయి మొక్కలని జప్తు చేసాము.

నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.

నిందుతుల వివరాలు

1.టకాడ ఇందల్, నివాసం:మంగల్ సింగ్ తాండా

2. కసావత్ సజన్ లాల్, నివాసం: మంగల్ సింగ్ తాండా

3. గోతి రవీందర్, నివాసం:మంగల్ సింగ్ తాండా

4. కచ్ కద్ సంతోష్, నివాసం:మంగల్ సింగ్ తాండా

5. బామానే సురేందర్, నివాసం:మంగల్ సింగ్ తాండా

6. పేలియ ప్రతాప్ సింగ్, నివాసం:మంగల్ సింగ్ తాండా

వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తే. పదోపరకు ఆదాయం వస్తుందని, పంటతోపాటు పంట చేనులో గంజాయి మొక్కలు సాగిస్తే లక్షల లాభం గడించవచ్చునని భావించి,సులభంగా డబ్బు సంపాదించవచ్చు అనే ఉద్దేశ్యంతో ఒక అడుగు ముందుకేసి తన పొలంలో గంజాయి మొక్కల పెంపకాన్ని అంతర్పంట గా భావించి సాగు చేసి చివరికి పోలీసులకు చిక్కి కటాకటాలు పాలైనారు.

వాహనాలు కూడా వెళ్ళలేని ప్రదేశంలోకి, అరణ్యం లో రోడ్లు సరిగా లేని ప్రాంతాలలో గంజాయి సాగు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం తో జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల ఐ.పి.ఎస్ నేతృత్వంలో ప్రత్యేక టీంతో ఆల్లంపల్లి మరియు బాబానాయక్ తండా ప్రాంతాలలో ఎస్పి డా.జానకి షర్మిల ఐ.పి.ఎస్ కి వచ్చిన పక్క సమాచారంతో. ద్విచక్ర వాహనంపై వెళ్లి కంది మరియు పత్తి పంటలలో కంటికి కనపడకుండా అంతర్ పంటగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పట్టుకోవటం జరిగింది.

పట్టుకున్న తర్వాత వాస్తవ పరిస్థితులు గమనిస్తే చాలా భయానకమైన విషయాలు తెలిశాయి.

గంజాయి సాగు చేస్తే లక్షల రూపాయలు గడించవచ్చని.అదే ఆశతో చేస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తెలిసింది.

సులభం గా డబ్బు సంపాదనతో పాటు తన అవసరాలకోసం ఏకంగా ఒక గృహపరిశ్రమ తరహాలో నిందితుడు తన పంట పొలంలో గంజాయి మొక్కల పెంపకం చేపట్టారు అని విశ్వసనీయ సమాచారంతో ఎస్పి నేతృత్వంలో ప్రత్యేక టీం వెళ్లి గంజాయి మొక్కలను గుర్తించి వాటి స్వాధీనం చేసుకోవడంతో.సినీ పత్తిలో వెళ్లిన జిల్లా ఎస్పీ.మొక్కలను సుమారు 70 లక్షలు రూపాయలు విలువచేసే గంజాయిని, నిందితులను. ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కి అప్పగించడమైనది.

వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా కడెం మండలం లోని.

1.టకాడ ఇందల్, అల్లం పల్లి పరిసర ప్రాంతాల్లో ఉన్న బాబానాయక్ తాండ గ్రామా శివారులోని తన యొక్క తండ్రి వ్యవసాయ భూమిలో పత్తి,కంది (తొగరు) పంటలో అంతర పంటగా ఉన్న గంజాయి మొక్కలను గుర్తించినాము. అక్కడే ఉన్న టకాడ ఇందల్ మమ్మల్ని చూసి పారిపోయే ప్రయత్నం చేయగా,మేము అతన్ని పట్టుకొని ఈ వ్యవసాయ భూమి ఎవరిది అని అడగగా అతడు ఇట్టి వ్యవసాయ భూమి మాదే అని చెప్పగా నేను అట్టి వ్యక్తిని విచారించమని పంచులను కోరగా వారు అట్టి వ్యక్తిని విచారించగా,తన పేరు టకాడ ఇందల్ %ం/శీ% హరిచంద్,వ. 35సం.లు, కులము: మథుర,వృత్తి: వ్యవసాయం, నివాసం:మంగల్ సింగ్ తండా,హెచ్/ఓ బాబనాయాక్ తండా కడం మండలం.తన నాన్న టకాడ హరిచంద్ పేరు పై బాబా నాయక్ తండా గ్రామ శివారులో సర్వే నెం.80/136 యందు 2 ఎకరాల 15 గుంటలు మరియు సర్వే నెం 80/361 యందు 3 ఎకరాల 15 గుంటలు వ్యవసాయ భూమి కలదు.తన నాన్న వృద్ధాప్యం వల్ల ఇంటి వద్దనే ఉంటున్నాడు.తన నాన్న పేరు మీద గల భూమిని తాను గత 4 సం.ల నుండి సాగు చేస్తున్నాడని తాను ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో అట్టి వ్యవసాయ భూమిలో పత్తి మరియు కంది(తొగరు) పంటతో పాటు అంతర పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడని తన వ్యవసాయ భూమిలో చాలా గంజాయి మొక్కలు ఉన్నాయని అట్టి వ్యవసాయ భూమిలో ఉన్న పచ్చి గంజాయి మొక్కలు/చెట్లు

చూపించినాడు. అట్టి గంజాయి మొక్కలను పీకించి తర్వాత నేను పంచుల సమక్షంలో నెరస్తుని యొక్క నేరము ఒప్పుదల మరియు జప్తు పంచనామా నిర్వహించి అట్టి గంజాయి మొక్కలను లేక్కించగా అవి మొత్తం 83 గంజాయి మొక్కలు కలవు ఇట్టి గంజాయి మొక్కలను ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషిన్ తో తూకం వేయించగా వాటి బరువు 48.64 కిలోలు కలవు వాటి విలువ 41,50,000/-రూపాయలు కలదు.తనతో పాటు తన గ్రామస్తులైన కసావత్ సజన్ లాల్ గోతి రవీందర్,కచ్చికద్ స%శీ%తోష్,బామానే సురేందర్,పేలియ ప్రతాప్ సింగ్ అనువారు కూడా వారి యొక్క వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేస్తున్నారని మీరు నాతో వస్తే చూపిస్తానని చెప్పినాడు.

2.కసావత్ సజన్ లాల్ పత్తి మరియు కంది(తొగరి) చెనులోకి వెళ్ళి ఆ చేను లో గంజాయి మొక్కలను గుర్తించినాము ఆ చేను లో ఉన్న కసావత్ సజన్ లాల్ పారిపోయే ప్రయత్నం చేయగా, మేము అతన్ని పట్టుకొని అట్టి వ్యక్తిని విచారించగా,తన పేరు కసావత్ సజన్ లాల్.తండ్రి .మంగల్ సింగ్,వ.52 సం.లు, కులము:మథుర, వృత్తి: వ్యవసాయం, మంగల్ సింగ్ తండా, హెచ్/ఓ ఒరేయ్ కంత్రి%శీ% బాబనాయాక్ తండా,కదం మండలం,తనకు బాబా నాయక్ తండా గ్రామ శివారులో సర్వే నెం.80/196 యందు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.తాను ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తన వ్యవసాయ భూమిలో పత్తి మరియు కంది(తొగరు) పంటతో పాటు అంతర పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నానని చెప్పగా అక్కడ మొక్కలను పీకించి తూకం వేయించగా వాటి బరువు400 గ్రాములు కలదు వీటి విలువ 1,00,000/- రూపాయలు కలదు.

3.గోతి రవీందర్ యొక్క పత్తి మరియు కంది(తొగరి) చెనులోకి వెళ్ళి ఆ చేనులో గంజాయి మొక్కలను గుర్తించినాము,వాటి విలువ 8 గంజాయి మొక్కలను గుర్తించాము,వాటి బరువు 2. 53 కిలోలు కలదు వీటి విలువ 4,00,000/- రూపాయలు కలదు.

4.కచ్ కద్ సంతోష్ యొక్క పత్తి మరియు కంది(తొగరి) చెనులోకి వెళ్ళి ఆ చేను లో 16 గంజాయి మొక్కలను కలవు వాటి బరువు 3.49 కిలోలు కలవు వీటి విలువ 8,00,000/- రూపాయలు కలదు.

5.బామానే సురేందర్ పొలం లో వేతకగా కంది(తొగరు) పంటతో పాటు అంతర పంటగా సాగు చేస్తున్న 16 గంజాయి మొక్కలను చూసాము,వాటి బరువు 3.29 కిలోలు కలదు వీటి విలువ 8,00,000/- రూపాయలు కలదు

6.పేలియ ప్రతాప్ సింగ్ యొక్క పత్తి మరియు కంది(తొగరి) చెనులోకి వేతకగా 20 గంజాయి మొక్కలను గుర్తించాము వాటి బరువు 4.08 కిలోలు కలవు వీటి విలువ 10,00,000/- రూపాయలు కలదు.

ఈ సందర్భంగా ఎస్పి గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు రహస్యం గంజాయి లాంటి మత్తు పదార్థాల కోసం వచ్చిన, మీ గ్రామ పరిసర ప్రాంతాల్లో పండిస్తున్న, విక్రయిస్తున్న తక్షణమే 8712659555, 8712659599 సెల్ నంబర్ కు సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ప్రజలు, పోలీసులు సమిష్టిగా కల్సి నిర్మల్ జిల్లా నుండి గంజాయి మహమ్మారీని తరిమికొడుదామని జిల్లా ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.జిల్లా పోలీస్ లో గంజాయి అక్రమ రవాణా నియంత్రణతో పాటు గంజాయి విక్రయదారులు, వినియోగదారులను ఉక్కుపాదంతో అణివేయాలనే లక్ష్యంతో నిర్మల్ పోలీసు అధికారుల పని చేస్తూ ఉంటారు.

సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో దేశ అభివృద్ధి కీలకమైన యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చేందుకుగాను మత్తుపదార్థాల అక్రమరవాణాకు పాల్పడితే సహించేది లేదని అలాగే చట్ట వ్యతిరేక కార్యాలపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ క్రింది కేసులు నమోదు చేయబడుతాయని హెచ్చరించారు.

దేశ భవిష్యత్తుయిన యువతను గంజాయి మత్తుకు బానిసలుగా మారుస్తూ,వారి కుటుంబాలను సమస్యల వలయంలోకి నెట్టివేయడంతో పాటు విధ్యార్థిని విధ్యార్థులు సైతం ఈ గంజాయి ఉచ్చుకు చిక్కికొని వారి భవిష్యత్తు అంధకారం చేసుకోవడంతో పాటు, వారి తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశలు గంజాయి లాంటి మత్తు పదార్థాల ద్వారా చిద్రమవుతున్నాయి. నేటి సమాజంలో ప్రమాదకారిగా మారిన గంజాయి వంటి మత్తు పదార్థాలను కట్టిడి చేయాలనే లక్ష్యంతో నిర్మల్ పోలీసులు పని చేస్తున్నారు.

8712659555, 8712659599 ఫోన్ నంబర్ ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుగా వచ్చి గంజాయిని విక్రయిస్తున్న విక్రయదారులతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయిని సేవించే వారి వివరాలు పోలీసులకు సమాచారం అందించడం ద్వారా గంజాయి విక్రయదారులు, వినియోగదారులను అణిచివేసే ధోరణి ప్రారంభమయినది.

ఈ తనిఖీల్లో పాల్గొన్న మరియు చాక చక్యంగా వ్యవహరించిన డిఎస్పీ ప్రభాకర్,ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సైదా రావు,కడెం ఎస్ఐ కృష్ణ సాగర్, అర్.ఎస్.ఐ రవి కుమార్,జిల్లా డాగ్ స్క్వాడ్ సిబ్బంది సాయి, సీసీఎస్ సిబ్బంది తిరుపతి,గణేష్, సతీష్ లను,హెడ్ కానిస్తాబుల్ కైలాష్, కానిస్తాబుల్ బీమ్ రావు,షారుక్,హోమ్ గార్డ్ అదికారులు శ్రీనివాస్,వెంకటేశ్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు

# మహిళా కానిస్టేబుల్ను నరికి చంపిన తమ్ముడు



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పరువు హత్య కలకలం రేపింది. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న నాగమణిని సొంత సోదరుడు పరమేశ్ దారుణంగా హత్య చేశాడు. ఇటీవల ఆమె ప్రేమించి, కులాంతర వివాహం చేసుకోవడంతో కుటుంబీకులు ఆగ్రహంతో ఉన్నారు. ఈక్రమంలోనే సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లొస్తున్న నాగమణిని రాయపోలు-మన్నెగూడ మార్గంలో పరమేశ్ కారుతో ఢీకొట్టాడు. అనంతరం ఆమెను కత్తితో నరికి చంపాడు. తరువాత పోలీసులముందు లొంగిపోయాడు.

# ప్రొద్దుటూరులో లాడ్జ్ లోమర్డర్

కడప ప్రొద్దుటూరులోని బిజిఆర్ లాడ్జిలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. తలపై బీరు సీసాతో కొట్టడంతో అతను మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. × మృతునికి సుమారు 30 ఏళ్లు ఉంటాయి. ప్రొద్దుటూరు కు చెందిన యనమల లోకేశ్వర్ రెడ్డి పేరుతో లాడ్జిలో రూం బుక్ చేశారు. హత్యకు గురైన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. పొద్దుటూరు వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు



# వ్యవసాయ కూలీ కుమార్తె జడ్జి గా ఎంపిక



పెద్దపల్లి ప్రతినిధి: జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన మొగురం గాయత్రి ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. అక్కడి హైకోర్టు నిర్వహించిన పరీక్షల్లో రెండోసారి పరీక్ష రాసిన గాయత్రి ఈనెల 27న వెలువడిన ఫలితాల్లో సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన మొగురం మొండయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు గాయత్రి ఉన్నారు. తండ్రి వ్యవ సాయ కూలీగా గ్రామంలోనే పనిచేస్తున్నారు. కూతురిని కాకతీయ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఉస్మానియాలో ఎల్ఎల్ఎం చదివించారు. ఏపీ హైకోర్టు నిర్వహించిన సివిల్ జడ్జి పోటీ పరీక్షలకు తొలిసారి హాజరైన గాయత్రి అప్పుడు విజయం సాధించలే కపోయారు. పట్టుదలతో చదివిన ఆమె రెండోసారి పరీక్షలు రాసి తన లక్ష్యం సాధించారు. కాగా మొండయ్యకు ఇద్దరు కుమారులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే ఆయన కుమార్తె ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ జడ్జిగా గాయత్రి ఎంపిక కావడం పట్ల వడ్కాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు.

# ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో వాదనలు..

హైదరాబాద్, డిసెంబర్ 2 ములుగు జిల్లా ఏటూరునాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో ) సోమవారం విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని వాదించారు. ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసే కాల్చి చంపారని పౌరహక్కుల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయన్నారు. మృతదేహాలను కనీసం కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని తెలిపారు. ఎన్‌హెచ్ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారని పౌరహక్కుల సంఘం న్యాయవాది పేర్కొన్నారు.అయితే అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించామని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారన్నారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో తీశారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఇరువురి వాదనలకు విన్న హైకోర్టు.. మృతదేహాలను రేపటి వరకు భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను రేపటికి (మంగళవారం) హైకోర్టు వాయిదా వేసింది.కాగా.. ఏలూరు నాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కు సంఘం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. మావోయిస్టుల భోజనంలో విష ప్రయోగం జరిగిందని హైకోర్టులో పౌర హక్కుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. పోలీసుల ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని.. వైద్య నిపుణుల సమక్షంలో పోస్ట్ మార్టం చేయాలని... పోస్ట్ మార్టం సమయంలో వీడియో రికార్డ్ చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు వీఆర్ఏ వారసుల ఆందోళన

వికారాబాద్ గత ప్రభుత్వం జీ ఓ 81 ఢ 85 అమలు చేసి కొంతమందికి మాత్రమే విధుల్లో చేర్చుకుని మిగిలిన 3797 మందికి మాత్రమే తెలంగాణ రాష్ట్రం వచ్చి ఒక సంవత్సరం పూర్తి అయిన విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీఆర్ ఏ వారసులకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే అసెంబ్లీని మట్టడిస్తామని వారు డిమాండ్ చేశారు. ప్రతి రాజకీయ నాయకుడికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల జీతం వేస్తుంది మరియు వారికి పెన్షన్ కూడా ఇస్తుంది కాని వీఆర్ ఏ వారసులు తమ పనికి తగిన వేతనాలను మాత్రమే అడుగుతున్నారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తమ సమస్యపై మనస్సు పెట్టి అమలు చేయలని వారు డిమాండ్ చేశారు.

# కార్లు అద్దెకు తీసుకుని మోసం చేస్తున్న ముఠా అరెస్టు

మాదాపూర్ రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలో కార్లు అద్దెకు తీసుకోని పక్క రాష్టంలో తిరిగి అద్దె కు ఇస్తున్న ముఠా ను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేసారు. ఏ1జూపూడి ఉష, ఏ2 తుడుముల మల్లేష్, ఏ 3సాగర్ పాటిల్, ఏ4అనిల్ జామనే ను అరెస్ట్ చేసారు. ముఠా ముందుగా నమ్మకంగా మాట్లాడి కార్లు కు అద్దె కు తీసుకుంటుంది. తరువాత వేరే రాష్టాల్లో డ్రైవర్ ల ద్వారా అద్దె కు ఇస్తున్న డబ్బులు సంపాదిస్తుంది. కర్ణాటక లోని బీదర్, బాల్కి లలో జిరాక్స్ పేపర్స్ తీసుకోని అద్దె కు ఇస్తుంది. కార్లు ఇచ్చిన యజమానులు అడిగినా తప్పించుకోని తిరుగుతుంది. బాధితుల పిర్యాదు మేరకు రంగంలోకీ దిగిన రాయదుర్గం పోలీసులు, నిందితుల నుండి 2కోట్ల 50లక్ష ల విలువ చేసే మహీంద్రా థార్ కార్లు 4,మారుతీ సుజుకి ఎర్టిగా కార్లు 10,ఇన్నోవా కారు 1,స్విఫ్ట్ కార్లు 3,హ్యుందాయ్ వెన్యూ కారు 1,ఐ20కారు 1,గ్రాండ్ ఐ10 కారు 1,స్వాధీనం చేసుకున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com